

ఓలేటి ఇందిరాదేవి
ఆనంద
ధాం

సహా సర్వులకు నమస్కరింపదగిన మహారాజ్ఞిగా వుండడం సహించలే పోవడాన్ని మనం ఆమోదించలేక పోవచ్చునేమోగాని అర్థంచేసుకోగల

ఈ దాంపత్యం వెనకవున్న చీకటి వెలుగులను సజీవంగా మన ఎదుట నిల్పిన ఈ చారిత్రాత్మక నవల చదువుతుంటే కాలం వెనక నడిచి, నాటిచరిత్ర సన్నివేశాలు ఆ వ్యక్తులు వారి ఆటలు పాటలు పం గలు సరదాలు ఎంతో నిండుగామనఎదుట నిలిచిమనల్ని సమ్మోహనప స్తాయి. పాత్రలన్నీ నేనా,నువ్వా అన్నట్లుమనదృష్టికోసంపోటీపడతా

అటు రాజ్యం, ఇటు భర్త వాటిమధ్య నలిగిన రుద్రమదేవిలో సంఘర్షణను సాటి మహిళ మాత్రమే అర్థం చేసుకుని చిత్రించగలదు అన్న నిజంమనకుప్రత్యక్షమయిన క్షణాన ఇన్నాళ్ళుపురుషులుమాత్ర చేస్తూ వచ్చిన రచనల ద్వారా మనం తెలుసుకున్నది, అర్థంచేసుకున్న పాక్షికమే నన్న మహా సత్యం తళుక్కుమంటుంది.

శత్రురాజులిద్దరినీ ఏకకాలంలో ఎదిరించిన తన భార్య పరా మాన్ని చూచి పశ్చాత్తాప్తుడయిన వీరభద్రునిచేత - చాళుక్యుల కోడలా ఎదురుగా భర్తవుండి కూడా ఏమీ చెయ్యలేని, నిస్సహాయ స్థితిలో క్రుంగుతుంటే నన్ను నువ్వు కాపాడుతున్నావు కదూ? అవునులే ! సీత దేవి శీలం రాముడు కాపాడాడా ? ద్రౌపతి శీలం పాండవులు కాపాడారా అంటు రచయిత్రి పేల్చిన శతఘ్ని మనస్సుల్లో గింగురుమంటూ వుంటుంది.

నేడు ప్రపంచమంతటా "నారీలోకం" విజృంభిస్తున్న సమ యంలో చరిత్రాత్మకమైన ఇతివృత్తం ద్వారా ఆ సమస్య స్వరూ స్వభావాలను సంయమనంతో, నిర్దిష్టంగా దర్శింపచేసిన రచయిత్రి ప్రతి భకు జోహార్లు|ఏకబిగిని కలిపితే ఈ చిక్కని నవలను చక్కని చల చిత్రంగా మలచగల వారెవరయినా వున్నారా ?

27-4-94
భాగ్యనగరం

వాకాటి పాండురంగారావు

# ఆనంద ధార

అది ఏకశిలా నగరం. సప్తప్రాకార పరివృతమై, సంపత్సమృద్ధమై వర్ధిల్లే ఆ మహా నగరం నేడు విచారంలో మునిగి ఉంది. ఎవరినోట విన్నా సార్వభౌములయిన కాకతి వీరరుద్రదేవుల అస్వస్థత విషయమే. అది మామూలు అస్వస్థత కూడా కాదు. భయంకర ప్రయోగమే జరిగింది భూత శాంతి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి, జప తపో నియమ నిష్ఠాగరిష్ఠులు వారి వారి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. కాని, ఉన్మత్త భైరవ ప్రయోగం ఉపసంహరించ బడటంలేదు.

★ ★ ★ ★

ఏకశిలా నగరంలో- అంటే ఓరుగల్లులో- శ్రీ చాళుక్య వీర భద్ర మహారాజా భవనంలో "ప్రభూ మహారాణీ రుద్రమదేవిగారు పతి దేవులయిన తమ దర్శనాన్ని అపేక్షించి వచ్చారు. సన్నిధానానికి దయ

చెయ్యమని సెలవా?" అని అడిగింది ఆయనను ఒక పరిచారిక వచ్చి.

అసహనాన్ని గాంభీర్యం వెనక దాచుకుని తల ఊపాడు వీరభద్రుడు.

చెంగావి చీరపై సరిగంచు రవిక శ్రుతికాగా, ఎర్రని వలిపెం మేలి ముసుగుగా అమర్చి, అనర్ఘ రత్నాభరణాలను విసర్జించి ముక్తామణిస్రగితమైన ఏకావళిని మటుకు ధరించి, బిరుదులనీ బరాబరులనీ చేటీ పరివార సహస్రాన్నీ నిరాకరించి, నిరాడంబర శోభాయమానంగా భర్త భవనంలోకి అడుగు పెట్టింది రుద్రమదేవి.

ఆమె అనుమకొండ పురవరాధీశ్వరి. అష్టమ చక్రవర్తి కాకతీయ గణపతిదేవ విశ్వావసీశు నంకతలమున పెరిగిన యాడుబిడ్డ. త్రిలింగ క్షోణీ శాసన సమర్థ విలక్షణ చరిత్ర.

భర్త సమక్షంలో, నిరతమూ తారాడే గాంభీర్య ముద్ర నధిగమిస్తూ వినయ భావం ప్రస్ఫుటమవుతున్న దామెలో. కానీ ఆమె రాగానే కోపంగా మొహం తిప్పుకున్నాడ వీరభద్రుడు. ధర్మపత్ని మనసు కటకట పడింది

"ప్రభూ!" అని నవ్వబోయింది కానీ పెదవులు విడలేదు. అంత తీవ్రంగా భర్తనెపుడూ చూడలేదామె.

"తమ చరణదాసిపై ఈ అలుక ఏమిటి ప్రభూ! ఎన్నిసార్లునేను విన్నపాలు పంపుకున్నా మా మందిరాని కీమధ్య విచ్చేయనేలేదు. చివరికి సాహసించి తమ దర్శనానికి నేనే వచ్చాను" అన్నది గొంతు పెగుల్చుకుని.



"హుం_తమరేమిటి. చరణదాసి ఏమిటి, మహారాణీ! తప్పు తప్పు చక్రవర్తినీ! సామంతరాజునైన నేను సామ్రాజ్ఞిపై అలుక వహించడమా? ఎంత మాట!" వ్యంగ్యంగా అన్నాడు వీరభద్రుడు.

"ప్రభూ! ప్రభూ! మనసా వాచా కర్మణా ఆత్మనా నేను తమ దాసినే" రుద్రమ కంఠంలో ఆర్తి.

ఓహోహో, ఏమి వ్యంగ్యం? ఏ అలంకారశాస్త్ర పాండిత్యమో ఇది. సకల సామంత రాజన్య కిరీట కోట నీరాజన సమర్పిత చరణారవిందలయిన తమరు ఒక సామంతుడినైన నాకు దాసిననటం ఎంత అతి వినయం! ఎంత ఎత్తిపొడుపు" కటువూ, వెటకారమూ వీరభద్రుడి కంఠంలో

కాదు ప్రభూ! ఎత్తిపొడుపు కాదు మీరు నా స్వామి, నాసర్వస్వం నా భర్త ఇదుగో మీరు నా మెడలో కట్టిన తాళి. ఈ పవిత్ర బంధాన్ని అవమానించేంత హీనురాలిని కాను. సకల సామంతులూ నాకుదాసులైతే నేను తమ దాసిని కానా? ధర్మశాస్త్రాలు మీరు మటుకు ఎరగరా?" వినీతురాలయి ప్రశ్నించింది రుద్రమదేవి.

"హా! ఎంత నటన! మేము కబురు పెట్టీపెట్టగానే అమాంతం మా మందిరంలో ప్రత్యక్షం కావలసిన సామంతుడివి-ఏందుకు రాలేదు" అని దండించడానికి ఏతెంచి ఉంటారు దేవిగారు. సువిశాలాంధ్ర సామ్రాజ్యాధీశ్వరినయిన నా మాట తక్షణం మన్నించడా ఈ వీరభద్రుడనీ-కానా?".

ఉరుము లురుముతున్నట్లే ఉంది వీరభద్రుడి కంఠం.

"ప్రభూ! ప్రభూ!"తరతరలాడిపోయింది రుద్రమదేవి.

"ఇక ఆజ్ఞాపించవచ్చు ఆంధ్ర సామ్రాజ్ఞిగారు తమ సామంతుడిని, తమ రాకలోని అంతరార్థాలు తెలియవనుకోకండి" రుసరుస అతని మాటలలో.

"ఇవాళిట్లా మాట్లాడుతున్నారేమిటి? అలుసుగల మధ్య ఆజ్ఞలూ, అంతరార్థాలూ ఏమిటి చెప్పండి?" అనునయంగా అన్నదామె.

"ఆఁ! మనమూ ఒక భార్యా భర్తలమే?" నిస్పృహగా అన్నాడు వీరభద్రుడు.

"ఆఖరికి అంత మాట కూడా అంటున్నారా, మహారాజా! మన ముద్దుల ముమ్మడాంబను కూడా మరిచిపోయినారా?" తీవ్రంగానే అన్నది ఆమె.

ఒక్క క్షణం అతని అంతరాత్మ గిలగిలలాడిపోయింది.

"మహారాజా! భర్తయొక్క అనురక్తి లేకపోయినా నేను మహా మండలేశ్వరినై ఏమి? సకల సామంత సమర్పిత త్రైలింద సింహాసన స్థితనై ఏమి? నిజం చెప్పండి ప్రభూ! ఈ రాజ్యం కోసం నేనెప్పుడైనా తాపత్రయ పడ్డానా? తమ ప్రేమ సామ్రాజ్యం కోసం ముచ్చటపడినాను. కానీ రాజ్యమే మన అనురాగానికి ప్రతిబంధకమా? దీనికోసం నా నిండు జీవితం రాళ్ళపాలు చేస్తారా!" ఆమె కన్నుల నీరు గిర్రున తిరిగింది.

ఆ కన్నీటి కొంకింతయినా కరగకపోగా అగ్నిమీద ఆజ్యం పోసినట్లు మండిపడాడు వీరభద్రుడు.

"మేకవన్నె పులివి నువ్వు. నీ చిలక పలుకులకు మోసపోయేటంత వెర్రివాడిని కాను" మదిరా స్ఫోరకాలయిన ఎర్రని కళ్ళతో మండించేట్లు చూశాడతను.

"ఇంత అన్యాయంగా మాట్లాడకండి, ప్రభూ తమ ఎడ నేను ఎన్నడయినా అనుచితంగా ప్రవర్తించానా? నా దాసదాసిజనాలూ, నా సమస్త సామ్రాజ్యాధికారాలూ, మహా భోగాలూ అన్నీ తమతరువాతనే మహారాజా, నేను తమ అర్ధాంగిని నా వైభవం. నా జీవితం తమరే. తమరు దిద్దిన మెరుగు కుంకుమరేకే నా బ్రతుకులో వెలుగు వెన్నెల రేఖ. తమరు తప్ప నా కాత్మీయులెవరు? నిరంతర రాజకార్యాలతో, ప్రజా పాలనా భారంతో అలిసిపోయి ఆడదానికి తగని శ్రమతో వేసారి



పోయి భర్త సన్నిధికి వచ్చానంకీ తమ ఇల్లాలిని ఇట్లా... ఇంత కఠి
నంగా ..."

జలజల రాలేయి ఆమె కళ్ళ నీళ్ళు.

ఒక లిప్తకాలం చలించిపోయినా దతను నిలదొక్కుకుని అన్నాడు
"దేవీ పొసగని ప్రేమ ప్రసంగాలు మన మధ్య అనవసరం
నన్ను విసిగించవద్దు తమ ఆజ్ఞ ధిక్కరిస్తున్న ఈ రాజద్రోహికి తగిన
శిక్ష విధించి వెళ్ళండి— కారాగారమో, శిరచ్ఛేదమో".

కెవ్వుమంటూ భర్త నోరు మూసిందామె ఎంత కిసలయ సుకుమా
రమో, అంత దృఢతరం ఆమె హస్తం.

అంతే, ఆ తరువాత ఏమైందో ఇద్దరికీ తెలియలేదు. శ్రీ చంద
నపు సువాసన వంటి దివ్య పరిమళం చుట్టేసినట్లయింది. భర్త వెచ్చ
ఊపిరి సోకి ఆమె కళ్ళు అరమూతలు పడినాయి. భార్య నుదిటి కుంకుమ
భర్త గుండెపై విడిది చేసింది. నిత్య వ్యాయామ సుందరమైన ఆ తని
తనూలత వీరభద్రుడనే సాలవృక్షం చుట్టూ అల్లుకుపోయింది. ఎవరు
సామంతులో, ఎవరు చక్రవర్తులో గుర్తుకు రాలేదు. వాళ్ళిద్దరూ ఆ
మగలు— అంతే— రణరంగంలో ఏ ఆయుధాలు ప్రయోగిస్తుందో ఏమో
కాని, రుద్రమదేవి తనే సమ్మోహనాస్త్రమైంది మగవి పాలిట.

లజ్జాలంకృతమూర్తి అయి "వాత్స్యాయన మహర్షి చెప్పిన
ప్రస్తుతానికి ఈ చెరసాల విధిస్తున్నాం జీవితాంతమూ ప్రభువులు మ
కౌగిట బందీలే సుమా అన్న"దామె పరస్పరాలింగనంలో పెనవేసుకున
ఇద్దరి హస్తాలూ ఓరగా చూసి కొంటెగా నవ్వి "అమ్మో యావజ్జీవ
కారాగారశిక్షే, కాస్త అప్పుడప్పుడూ దయదలిచి వదిలేస్తూండండి మహా
రాణి" అన్నాడు శృంగార రసాకారంగా వీరభద్రుడు

పెదవి మునిపంటనొక్కి- "ఉహూ, వదలను స్వామీ, వదలలేను" అన్నది చిలిపిగా రుద్రమదేవి.

"ధన్యుణ్ని- నా అందాల రుద్రమదేవి కౌగిట శాశ్వతంగా బందీనవటం ఎన్ని జన్మల పుణ్యమో" అన్నాడతడు.

మహారాజా, తమ అంతర్యం పాల సముద్రం లాంటిది. నిర్మలమైన ఆకాశంలాంటిది. ఉప్పెనలు వచ్చినా, కారుమేఘాలు క్రమ్మినా తాత్కాలికమే అని నా విశ్వాసం" అన్నదామె.

"దేవీ, దేవీ"

కిలకిల నవ్విందామె. "ఇందాకట్నించీ ఈ ప్రేమనంతా ఎక్కడ దాచారో దొరగారు, కాస్త నా మనవి వినండి. అవతల రాచకార్యాలకు వేళ అతిక్రమిస్తున్నది. భర్తతో ఇంకా సేపు హాయిగా మాట్లాడటానికి నోచుకుందా ఈ మండలాధీశ్వరి. త్వరలోనే మన వివాహ వార్షికోత్సవం వస్తున్నది. ఆ రోజయినా ప్రభువులు మా మందిరానికి దయచేసి మమ్మేలుకుంటారని ఈ ప్రేమనంతా అక్కడ కొనసాగించగలరని కోరుకుంటున్నది మీ ఇల్లాలు. ఇంకా ఏమన్నా కాస్త కోపం మిగిలిఉంటే ఆరోజుకూడా .." అంటూ సిగ్గుపడి "తీర్చుకోవచ్చును" అంటూ నవ్వి సెలవు తీసుకుని వెళ్ళిపోయింది మహారాణి మూడు మూర్తులా భార్యలా.

ఆ భవనం దాటేవరకే ఆమె హంసయాన. తరువాత త్రపాభారమునకు వంగిన నడుముతో పసిడి మెరుగుల పాదరక్షల లయతాళ భంగులుల్లసిల్లగా నడుస్తుంది. భర్తముందరే ఆమె కలకంఠి, మిగిలిన చోట్ల గంభీరపుంభావమైన పలుకు పొందిక యామెది. అతని సమక్షంలోనే ఆమె లజ్జా చకచ్చకిత కంపాలత. మిగిలిన వేళల దుర్నిరీక్ష్య తేజో భాసిత.

రాణి వెళ్లాక గాని ప్రకృతిలోకి రాలేకపోయినాడు వీరభద్రుడు.



మళ్ళీ అతనికంతా గుర్తుకొచ్చి కోపం వచ్చింది. ఆనాడు ఆ ముసలి రాజు బ్రతికున్న రోజులలో. కాకతి గణపతిదేవ సార్వభౌముడు నిండు కొలువు తీరాడారోజు. వార్ధక్యం వల్ల ఈమధ్య సభకు రాలేకపోతున్నాడాయన. కానీ ఈరోజు అంగరక్షకుల సాయంతో మెల్లిగావచ్చి వజ్ర సింహాసనాన్ని అధిష్ఠించాడు.

"స్వస్తి, సమధిగత పంచ మహా శబ్ద మహా మండలేశ్వర। అనుమకొండ పురాధీశ్వర! వీరలక్ష్మీ విజేశ్వర, పరనారీ సహోదర, స్వయంభూ దేవ శ్రీపాద పద్మారాధక, పతిహిత చరిత" వందిమాగధులు బిరుదులు పఠించారు. "రాయగజకేసరీ! సప్తమచక్రవర్తీ జయీభవ దిగ్విజయీభవ," అని జయ పెట్టారు, చాలా ముఖ్యమైన రోజు కనకే చక్రవర్తి సభకు రావటం జరిగింది. భావి చక్రవర్తిని నిర్ణయించబోయే తరుణ మది.

చక్రవర్తి కిరువైపులా ఉన్న సింహాసనాలపై పుంభావ వీర స్వరూపంతో ఆయన కుమార్తె రుద్రమదేవి, అల్లుడు వీరభద్రుడు కూర్చుని ఉన్నారు. రాజ గురువులు, మహామాత్యులు శివదేవయ్య దేశికులు యథాస్థానంలో ఆసీనులయినారు. మహా తలవర తంత్రపాలుడు, చక్రవర్తి బావమరిది గజసాహిణి జాయప సేనాని, జన్నిగదేవసాహిణీ, మల్యాల గుండయ్య సేనాని, మహాప్రధాన గణపదేవ మహారాజు (ఇతడు చక్రవర్తి కాడు) గోన గన్నారెడ్డి, ప్రాసాదిత్య నాయకుడు రేచర్ల రుద్రసేనాని గంగయ్య సాహిణి నిర్ణీత స్థానాలలో కూర్చుని ఉన్నారు. చక్రవర్తి దాయాదులు హరిహరదేవుడు. మురారిదేవుడు తమ భవిష్యత్తు ఎలా నిర్ణయింపబడుతుందో అని ఆత్రతగా వున్నారు అంతఃపురంలో స్త్రీలు ఎదురుచూస్తున్నారు.

శివదేవయ్యగారు లేచి సభా ప్రారంభం చేశారు. చక్రవర్తి తమ

పుత్రిక అయిన రుద్రమదేవిని "వీరభద్రదేవుడ" నే పురుష నామముతో యువరాజుగా ప్రకటించాడు. సభలోని ప్రజావాహిని ఉత్తుంగతరంగాలతో ఎగసిపడింది.

మంగళవాద్యాలు మ్రోగుతున్నాయి పురోహితులు పుణ్యనదీ జలాలు పూర్ణ కలశాలతో తీసుకొని, వచ్చారు రాజనర్తకి తనబృందంతో నాట్యానికి సిద్ధంగా వుంది ఆస్థాన గాయకులు వీణ శృతి చేసుకుంటున్నారు. ప్రాంగణాన అలంకరించి వున్న పట్ట గజం శుభ సూచకంగా ఘీంకరించింది.

గణపతిదేవుని కళ్ళలో వెలుగు వెన్నెల గోదారి పరవళ్ళు తొక్కింది తెర చాటున ఉన్న పట్ట మహిషుల సంతోషం మిన్ను ముట్టింది. మిగిలిన స్త్రీ జనం తమ జాతికి జరిగే ఈ అపూర్వ సన్మానాన్ని ముగ్ధులై చూస్తున్నారు. ఆడది రాజు కావడం మున్నెన్నడూ జరగలేదు మరి. గణపతి దేవుడి విశాల భావాలకు ఉదాహరణ ఇది.

వీరరుద్రదేవుడనే పేరుతో విశాలాంధ్ర దేశానికి యువరాజుగా అభిషిక్తురాలైంది రుద్రమదేవి. కాని, ఆమె ఒక్కతే ఈ సంతోషంలో పాలు పంచుకోనిది. భుజస్కంధాలపై మోయరాని బరువు పడినట్లు ఉక్కిరి బిక్కిరైనది

ఇంతవరకూ రాజ్యం మీద ఆశలు పెట్టుకున్నారు దాయాదులు హరహర దేవుడూ, మురారి దేవుడూ, వాళ్ళ మొహాలిప్పుడు నల్లగా మాడిపోవడం చూసింది. అసహనంతో పళ్ళు గిట్టకరచుకొన్న ఒకరిద్దరు దండనాథులను పరికించింది. తండ్రి గారి ప్రక్కనే కూర్చుని ఉండి లోలోపలి కలవరపాటును అణచుకుంటున్న భర్తను గమనించింది

ఆమె అర్ధనారీశ్వరి. ఆ హాలాహలాన్ని కంఠాన అదిమిపట్టి అమృత మధుర వీక్షణాలను ప్రజలపై వెదజల్లుతూ లేచి నిలబడింది.



ప్రజల సుఖశాంతుల కోసం శాయశక్తులా పాటుపడతానని ప్రతిజ్ఞచేసింది. గంభీరమైన పలుకు పొందికతో, రాజ్య భద్రతకోసం ఎవరి కర్తవ్యం వాళ్ళు శ్రద్ధగా నిర్వర్తించాలని విజ్ఞప్తి చేసింది. కర్తవ్యం మరిచిన వాళ్ళని, క్రమశిక్షణ లోపించిన వాళ్ళనీ ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించడం జరగదని చెప్పింది స్వయంభూ దేవుని ప్రతినిధిగా మాత్రమే తాను రాజ్య భారం స్వీకరిస్తున్నాననీ స్పష్టం చేసింది రాజ్య భద్రతకూ, దేశ శ్రేయస్సుకూ లోపం కలిగితే ఎంతటి రాజ బంధువులనైనా ఉపేక్షించనన్నది.

తదుపరి వందిమాగధులు వీరరుద్రదేవ విజయ ప్రశస్తిని పఠించారు. అంతరంగికులకు మట్టుకు స్త్రీగా కనిపించినా అధికారికంగా ఆమె పురుషుడుగానే వ్యవహరిస్తుంది. వీరరుద్రదేవుడిగానే ప్రజలను పాలిస్తుంది. శత్రువుల నెదిరిస్తుంది. ఇట్లా రెండు విధాలుగా విభజించుకున్న జీవితాన్ని కత్తిమీది సాములాగా స్వీకరించిందామె. ఆమె ఎందుకట్లా కావలసి వచ్చిందీ అంటే-కాలచక్రం దాదాపు ముప్పది వసంతాలు వెనక్కి తిరిగితే-

ఆ రోజు గణపతి దేవుని అంతఃపురములో రహస్య సమాలోచన మందిరంలో సమావేశం ఏర్పాటు చేయబడింది.

రాజగురువులూ, మహామంత్రీ అయిన శివదేవయ్యగారూ, అంతఃపుర రక్షకుడూ, ప్రాసాదాదిత్య నాయకుడూ, నగర రక్షకుడూ రేచర్ల రుద్ర సేనాని, వర్ధమాన పురపాలకుడు గోన బుద్ధారెడ్డి, గణపతి దేవుని బావమరిది గజ సాహిణి జాయప సేనాని-వీళ్ళు మాత్రమే ఆ సమావేశంలో

పాల్గొంటున్నారు. చక్రవర్తి చేసన్నతో మహామంత్రి ఈ విధంగా చెప్పారు.

"మీరు నలుగురూ చక్రవర్తికి మిక్కిలి విశ్వాసపాత్రులు కనుక పిలిపించారు. ఈ సమావేశానికి ఇక్కడ ఏ విషయమూ ఈ గదిగోడలు దాటి పోరాదు." నలుగురూ ప్రమాణం చేశారు రహస్యం గోప్యం చేస్తామని.

"మన చక్రవర్తికి ఇంతవరకూ సంతానం కలుగని మాట తెలిసినదే. ఏడుగురు రాణీలలోనూ సోమాంబా దేవి వారిప్పుడు గర్భవతులైన సంగతీ ఎరుగుదురు కదా! పుత్రుడు కలిగెనా పరమ సంతోషమే. పుత్రిక కలిగితే? రాజ్యానికి ఉత్తరాధికారిని నిర్ణయించడంలో చక్రవర్తి ఇక జాగు చేయదలచుకోలేదు. ఇప్పుడు జన్మించే బిడ్డ ఎవరైనా సరే భావి కాకతీయ చక్రవర్తి అని చక్రవర్తి అభిప్రాయం. కాకపోతే ఆడబిడ్డ పుడితే, ఆమెచేత రాజ్యంఏలించడానికి తగినపరిస్థితులు ప్రస్తుత కాలములో, ప్రస్తుత రాజ్యంలో పొసగని పని కొన్ని వందల ఏళ్ళ గడవాలేమో స్త్రీ స్త్రీగా రాజ్యం ఏలాలంటే. ఇప్పుడు పురుష వేషం తప్పదు.

ఉత్తరాన దేవగిరి యాదవులు మన కాకతీయులకు బద్ధ శత్రువు అని మీ రెరుగుదురు దక్షిణాన పాండ్యులు, అనేక సామంత ప్రభువులు, దాయాదులు ఈ రాజ్యంపైన కన్నువేసి ఉన్నారని మీకు తెలుసు. కాకతీయుల వంటి సమర్థులైన పాలకుల ఏలుబడిలో తెలుగు ప్రజలు కడుపులో చల్ల కదలకుండా సుఖపడుతున్నారు. కాంచీపురము వరకు సేనలు నడిపి జయించిన గణపతి దేవుల భుజ స్కంధములపైన తెలుగు దేశం కళా నిలయంగాసుభిక్షంగా వర్ధిల్లడం శత్రువులుసహించలేక..." మంత్రి గారి మాట పూర్తికాలేదు. లోపలికి వచ్చింది అంతరంగిక పరిచారిక



అయిన ఒక వృద్ధురాలు. చక్రవర్తి కన్నుల నుంచి ఆత్రత ఉబికి వచ్చింది. జీవితంలో యాభై సంవత్సరాల తరువాత పుత్ర లాభం పొందనుండెను మరి.

"మహారాజులకు జయము. తమరికి పుత్రికా లాభము కలిగినది. యువరాణి జన్మించింది!" అని విన్నవించింది.

వెంటనే చక్రవర్తి చెయ్యి మెడలోని పచ్చలహారాన్ని స్పృశించింది. మరు క్షణమే దానిని వదలి పద్మ రాగమణిహారాన్ని తీసి దానికి బహూకరించాడు.

శివ దేవయ్య గారి మొహంలో ఆనందం చిందింది. మిగిలిన నలుగురూ సంతృప్తిగా తలలు పంకించారు.

ఆడపిల్ల పుడితే చెప్పిన దాసీకి పచ్చల హారాన్నివ్వడం వారి ఆచారం. అబ్బాయి పుడితే పగడాల హారం బహూకరిస్తారు. దాసీ సాభిప్రాయంగా చూసి మహా ప్రసాదమని దోసి లొగ్గింది.

"ఇప్పుడు చెప్పు, దాసీ చక్రవర్తి కెవరు జన్మించారు?" అన్నారు శివ దేవయ్యగారు.

"మగబిడ్డ, బాబూ! నా బొందిలో ఊపిరున్నంత వరకూ ఈ రహస్యం దాచగలను. కానీ..." అంటూ ఆగిపోయిందామె. మంత్రి గారు చిరునవ్వు నవ్వారు.

"అమ్మాయిని అబ్బాయిగా పెంచడం ఎట్లాగంటావు? ఆ సంగతి మేము జాగ్రత్తపడతాము. రాజ సంతానము యొక్క ఆలనా పాలనా బాధ్యత మాత్రం నీది. అందుకు తగిన సదుపాయాలు సమకూర్చబడు

తవి. నువ్వు చేసే ఈ ఉపకారాన్ని రాజ కుటుంబమే కాదు. తెలుగు దేశం కూడా మరిచిపోదు" అన్నారు.

"ఎంత మాట, బాబూ! చక్రవర్తి గారి ఉప్పుతో బతికిన శరీర మిది. మీరింత చెప్పాలా?" అన్నది దాసి.

సమావేశంలో పాల్గొన్న నలుగురూ మహారాజుల పుత్రోత్సవం సంబరాలు నగరంలో చాటించడానికి వెళ్ళారు!

కాకతీయులు శివభక్తులు. స్వయంబు దేవ శ్రీపాద పద్మారాధకులు. భద్రకాళి ఇష్ట దైవం కాకతమ్మ కులదేవత. గణపతి దేవుని పూజలు ఫలించినవి. దేవతలు కరుణించారు. పట్టమహిషి సోమదేవి కడుపు పండింది. కాకతీయ వంశమనే పాలసముద్రంలో బాల జాబిల్లిలా ఉదయించింది రుద్రమ దేవి.

యువరాజు పేరు వీరరుద్రమ దేవుడని ప్రకటించారు. ఆ పేరుతో పెరుగుతూ సకల విద్యలూ నేర్చుకోసాగిందా బాలిక. శివదేవయ్యగారు రాజనీతి నేర్పసాగారు. మంచి ఛట్టోపాధ్యాయుడు చదువు నేర్పసాగాడు.

వర్ధమాన పురాధీశ్వరుడైన గోన బుద్ధారెడ్డి తన కుమారుడైన గన్నారెడ్డిని ఓరుగల్లులో ఉంచాడు. యువరాజు చెలిమి కోసమని అంతః పురంలో కొందరు పరిజనం ప్రత్యేకం ఆమె పెంపకం కోసమే నియోగింపబడ్డారు. వాళ్లెటువంటి వాళ్ళంటే, ప్రాణమైనా అర్పించగలరు గానీ, రాజపుత్ర రహస్యం మటుకు వెల్లడిచేయని వాళ్ళు.

రుద్రమదేవి శరీరం సర్వ రక్షణ శోభితం. విశాలమైన నయ



నాలు, సూటైన నాసిక, అజానుబాహువులు, ఉనికిలో దుర్నిరీక్షత్వం ....ఆమెకి చేయని అలంకారాలు ఆమె మంచి పొడగరి. బాల్యంనుంచీ వ్యాయామం చెయ్యడంవల్ల లాఘవమైన శరీరంతో సమస్త ఆయుధాలను ప్రయోగించడంలోనూ, రథ గజతురగ పదాతి దళాలనే చతురంగ బలాలను సమాయత్తపరచడంలోనూ, సకల యుద్ధ వ్యూహ నిర్మాణంలోనూ సుశిక్షితురాలైందామె. ఈత ఈదడంలో నైపుణ్యం సంపాదించింది. ఎత్తు మీద నించీ దూకడం, పంచకళ్యాణిని పట్టపగ్గాలులేనట్లు పరుగులు తీయించడం ఆమెకి లీలా వినోదాలు.

రుద్రమకి రెండు పదులు నిండక ముందే కన్న తల్లి సోమదేవి మరణించింది. మిగిలిన రాణులలో నారాంబ, పేరాంబలు జాయపా సేనాని చెల్లెళ్ళు. వాళ్ళిద్దరూ సవతి తల్లుల్లా కాక, సొంత తల్లుల్లాగే ఆదరించారు రుద్రమని.

గణపతి దేవుడి కిద్దరు చెల్లెళ్ళు-కుందాంబ, మైలమాంబ. ఇద్దరూ నతవాటి వారి కోడళ్ళు. వాళ్ళు అనేక ధర్మ కార్యాలు చేశారు. తమ పేర గ్రామాలు, దేవాలయాలు, చెరువులు నిర్మించారు. ఆ మేనత్తలంటే రుద్రమకెంతో ఇష్టం.

"నా కో కూతురు పుడితే నా మేనల్లుడు రుద్రదేవుడి కిచ్చి పెళ్ళి చేసేదాన్ని గదా!" అంటుండేది కుందాంబిక. ఆవిడకు కూతురు లేదు. కొడుకే ఉన్నాడు. గణపతి దేవుడు నిట్టూర్చేవాడు, కుమార్తెకి మేనరికం చేసి చెల్లెలితో వియ్యమందలేకపోతినే అని!

రుద్రమ తరువాత మళ్ళీ ఒక ఆడపిల్ల పుట్టింది గణపతి దేవుడికి.

గణపాంబ అని పేరుపెట్టి అమ్మాయిలాగానే పెంచాడామెని. రాజనీతిని కూడా నేర్పాడు.

రుద్రమకి నాట్యం నేర్చుకోవాలని ఉండేది. బొమ్మలాటలు ఆడాలని ఉండేది. చక్కగా చెల్లెలిలాగా బొట్టూ, కాటుకా పెట్టుకోవాలని సరదాపడేది. కానీ, ఎలా కుదురుతుంది? పుడుతూనే తనపై మోపబడ్డ మహా భారాన్ని నెరవేర్చడం కోసం ఆమె అలా బ్రతకాల్సి వచ్చింది. మగబిడ్డ అలంకారాలే దాల్చవలసి వచ్చింది ఆమె తనని తాను దేశానికి అంకితం చేసుకున్నది. మహత్తరమైన కార్యాలను స్త్రీలు ఎంత చక్కగా నిర్వహించగలరో నిరూపించదలచుకున్నది. తన తండ్రి గారిలాగా ప్రోత్సాహమిస్తే ఎంత ఎదగగలరో ఆడవాళ్ళు అని లోకానికి నిరూపించదలచుకున్నది. వ్యక్తిగత సౌఖ్యం నాశనమైనా పట్టించుకోలేదామె. తన సరదాలను లలిత కళలకు కాక, భయంకర యుద్ధ విద్యల వేపు సంపూర్ణంగా మళ్ళించింది. తోటి బాలికలు పూల చెళ్లాడుకుంటూనో రంగవల్లులు తీర్చుకుంటూనో, నృత్యం నేర్చుకుంటూనో, పాటలు పాడుకుంటూనో, ముగ్ధ మనోహరంగా అలంకరించుకుంటూనో ఉంటే, రుద్రమదేవి బల్లెం.

విసురుతూనో, కత్తి తిప్పుతూనో, గుఱ్ఱపు స్వారీ చేస్తునో, రాజనీతి గ్రంథాలు పఠిస్తునో, ఈడుకి మించిన వ్యాయామాలలో మగరాయుడిలా మొండిగా బ్రతికేది.

కానీ, గణపతి దేవుడూ, శివదేవయ్య గారూ మటుకు తృప్తిగా నిశ్వసించారు. ఆంధ్రదేశానికి ఒక అమూల్యాభరణాన్ని సమర్పిస్తున్నామని.

o o o



"హుం సమర్పించారులే ఆంధ్రదేశానికి అమూల్యాభరణాన్ని... కాదు, కాదు—ఆడదాని రాచరికాన్ని ఛీ! ఈ ముసలాళ్ళిద్దరికీ మతిపోయి ఈ పని చేశారు. ఏం! ఆడకూతురు రాజ్యం ఏలకపోతే ఇంకే మగాడూ ఇక్కడ లేడా? పేరుమోసిన వీరాధివీరులుండగా, దిగ్దంతులవంటి దండనాథులుండగా అర్భకురాలైన ఈ ఆడది, ఈ రుద్రమ రాజ్యం ఏలవలసి వచ్చిందా? ఈమె రాజ్యాన్ని అంగీకరిస్తూ కూచోవటానికి పౌరుషవంతులెవరూ గాజులు తొడిగించుకు కూర్చోలేదు. అల్లుడినైన నాకు రాజ్యం ఇస్తే ఏం పోయిందో ముసలి రాజు ముల్లె? ఆ కూతురి భర్తనేగా నేను? ఏం చాళుక్య వంశం అంత తీసిపోయిందా? వీళ్ళ దృష్టిలో. అనుకుంటూ అతలాకుతలమైపోసాగాడు వీరభద్రుడు. భార్య రుద్రమకూ, రాజు రుద్రమకూ మధ్య నలిగిపో సాగిందతని మనస్సు.

అసలు రుద్రమ వివాహం పెద్ద సమస్య అయింది రాజుకి. మగరాయుడిగా పెరిగిన అమ్మాయిని వివాహమాడటానికి ఏ రాజకుమారుడూ ముందుకు రాలేదు. పైగా, రుద్రమ ఓరుగల్లులోనే ఉండి రాజ్యపాలన చేస్తుంది గానీ, అత్తవారింటికి వెళ్ళదు. అతనే ఇక్కడికి రావాలి. నిరవద్యపురాధీశ్వరుడు చాళుక్య ఇందుశేఖర మహారాజూఅయిన రాణి ఉదయ మహాదేవి—వారి కుమారుడు వీరభద్రుడు. వారి రాజ్యం అనేక సమస్యల్లో, క్లిష్ట పరిస్థితుల్లో ఉండగా రుద్రమ సంగతి తెలిసింది తల్లి ఉదయాంబ దూరదృష్టితో వీరభద్రుడిని వివాహానికి ఒప్పించింది, ఆమె కోరిక ఫలించి రుద్రమ వారి రాజ్యాన్ని సుస్థిరం చేసిందనుకోండి అది వేరే సంగతి.

వీరభద్రుడు రుద్రమదేవికి ఈడైన వాడు కాదు. పది పన్నెండేళ్ళు ఆమె కంటె పెద్ద, సౌందర్యమూ సామాన్యమే. వీరత్వం

సంగతి తెలీదు. అనేక మల్లగుల్లాలు పడిన మీదటనే ఈ పెళ్ళికి అంగీకరించాడు గణపతిదేవుడు. మరి అనురూపుడూ, అందగాడూ, వీరుడూ, సమర్థుడూ అయిన రాజకుమారుడు అల్లుడు కావాలని చాలా ఏళ్ళు వేచి ఉన్నాడాయన. ఎవరూ రుద్రమని వివాహమాడటానికి ముందుకు రాలేదు. వీరభద్రుడు ఒప్పుకున్నాడు. సరే, ఇదీ ఒకందుకు మంచిదే అనుకుని ముహూర్తం పెట్టించాడు. రాజు అంతకు ముందరే చిన్న కుమార్తె గణపాంబను ధరణికోట పాలకుడైన కోట బేత రాజు కిచ్చి వివాహం చేశాడు.

ఇప్పుడు రుద్రమ వివాహం ఒక సమస్య అయింది. ముందు సంబంధం కుదరటం ఒక సమస్య, తర్వాత పెళ్ళి ఒక సమస్య. ఇంతవరకూ రుద్రమ ఆడపిల్ల అని ఎవ్వరికి తెలియదు. అయిదారుగురు అంతరంగికులకు తప్ప పైగా పిల్లనిచ్చి పెళ్ళి చేస్తామని సాటి రాజులు చాలా మంది వచ్చారు. రాజభక్తిపరులైన వెలుగోటి వారు సలహా చెప్పారు. రుద్రమ సంగతి బయటపడకుండా ఉండాలంటే ఒక రాజకుమార్తె నిచ్చి పెళ్ళి చేయమని. కానీ, చక్రవర్తి ఒప్పుకోలేదు. తన బిడ్డ బ్రతుకుతో పాటు ఇంకొక పిల్ల బ్రతుకునుకూడా పాడు చేయటానికి ఆయన అంతరాత్మ ఒప్పుకోలేదు.

వివాహ సందర్భంలో రుద్రమ యువతి అని చాటించి వీరభద్రునితో వివాహం జరిపించాడు. సంపూర్ణ స్త్రీ వేషంతో దేవకన్యలా మెరిసిపోతున్న రుద్రమదేవిని చూసి సదస్యులు ఆశ్చర్య పోయినారు. ఈమెనా ఇన్నాళ్లూ యువరాజను కొన్నామని.

రుద్రమ, వీరభద్రులకు ముమ్మడాంబిక పుట్టింది. తరువాత నాలుగైదేళ్ళలోనే గణపతి దేవుడు ఆమెకు యౌవ రాజ్యాభిషేకం



చేశాడు. అప్పుడామె గర్భవతి. ఆ తరువాత ఆయన ఎన్నో రోజులు బ్రతకలేదు. వీరభద్రుడికి ఒళ్ళు మండిపోయింది ఆ సభలోనే. కట్టుకున్న భర్త ఉండగా తగుదునమ్మా అని యువరాజవుతుందా భార్య? కళ్ళ ముందే భార్యకి, ఒక అబలకి సార్వభౌమత్వమా? ఒక ఆడదానికి ముద్రాధికారమా? ఒక స్త్రీకి పట్టాశ్వ పట్ట గజాధిరోహణమా? బిరుదులూ బరాబరులూ, చక్రవర్తి లాంఛనాలూనా? అమ్మో! ఆ కాలం రాకుండానే ఈ యువరాజు పదవితోనే ఈ రుద్రమ ప్రభ చల్లారాలి, అని అనుకోవటం ప్రారంభించాడతడు. అసలు పట్టాభిషేకం జరగనివ్వకూడదని అతని ఊహ.

ఇంక కాకతీయుల జ్ఞాతులు మురారిదేవుడూ, హరిహర దేవుడూ వాళ్ళిద్దరూ ఎప్పట్నించో రాజ్యం మీద ఆశ పెట్టుకొని సమయం కోసం చూస్తున్నారు. ఇప్పుడీ ఆడదాని ఏలుబడికి లొంగాలంటే వాళ్ళకి తల కొట్టేసినట్లుంది. వీళ్ళు కాక గాజులు ధరించిన ఆడదాని ఏలుబడి సహించలేని కొందరు అధికారులూ సామంతులూ కలసి ఒక శత్రు కూటమిగా ఏర్పడుతుండగా, సకలరాజ్యాంగ తంత్రపారంగత, సర్వశస్త్ర ప్రయోగ చతుర అయిన రుద్రమదేవి అన్నపూర్ణలాగా ప్రజలను కన్న బిడ్డల వలె పరిపాలన చేస్తున్నది. అనేక తటాకాలు తవ్వించింది. కవి పండితులను పోషిస్తున్నది. అధికారంగా ఆమె పురుషుడిలాగా వ్యవహరిస్తుంది. సంపూర్ణ పురుష వేషంలోనే రాజ్యాన్ని పరిపాలిస్తుంది. అప్పుడామె పేరు "వీర రుద్ర దేవుడు" అంతఃపురంలో మాత్రం ఆమె స్త్రీగా వ్యవహరింపబడుతుంది అప్పుడామె మహారాణి రుద్రమదేవి.

ఆసాయంకాలం అంతరంగిక సఖి వకుళాదేవి మహారాణి కేశాలకు

సాంబ్రాణి ధూపం వేస్తూ "దేవీ! తమరు ఈమాత్రానికే బేల కాకూడదు. మహారాజుగారు తమ ఎడ తప్పక ప్రసన్నులు కాగలరు. కొంచెం ఓర్పు వహించండి. ఓర్చినమ్మకు తేటనీరంటారు పెద్దలు. అన్ని సమస్యలనూ కాలమే పరిష్కరిస్తుంది. తమరు త్వరపడరాదు. మీవివాహ వార్షికోత్సవం కదా ఈ రోజు! రాకపోతే ప్రభువులను నేను వెళ్ళి తీసుకొస్తాను. చూడండి" అన్నది.

"పోవే, కొంటె పిల్లా! మీమహారాజుగార్ని గూర్చి ఎవరేఇక్కడ దుఃఖపడేది? అందుకేం కాదులే!" చిరుసిగ్గు రంజిల్లే ముఖాన్ని అవతలి వైపు తిప్పేసుకుంది రుద్రమ. "మరిఎందుకో తెలుసుకోవచ్చున మహారాణి జుట్టుఎత్తి పట్టుకొని, పొగ సరిగా అంటేటట్లు చూస్తున్న రెండవ ప్రధాన సఖి మంజువాణి నవ్వుతూ ప్రశ్నించింది.

"కాబి ఆంధ్ర సామ్రాట్టుల కోసంకూడా నిరీక్షణ ఎక్కువౌతుంది లేవే అమ్మగారికి. అందుకైనా కాస్త ఓపిక పట్టాలి దేవిగారు! ఇంకో అయిదారు నెలలు అంతే గదమ్మా!" రాణికి చెక్కుల మకరికా పత్రాలు దిద్దుతూ అన్నది మూడవ సఖి చంపకమాల.

"అబ్బా! కాసేపు గొడవ పెట్టకండర్రా మహారాణి వారిని అలసట పెట్టకండి," అంటూ ఉద్యాన వనం నుంచి ఊడిపడింది నాల్గవ సఖి మాలతీలత, పమిట చాటునుంచి ఒకే ఒక్క మామిడికాయ బయటకి తీసి రాణికి ఇచ్చింది. అది మామిడికాయల కాలంకాదు. చిరుకోపంగా చూసింది రుద్రమదేవి. ఎదురుగా ఉన్న వెండిపళ్ళెం నిండా ఘుమ ఘుమ లాడే అనేక రకాల పువ్వులున్నై.

అవి తీసి ప్రియసఖులమీద విసరటం మొదలు పెట్టింది.



"రణరంగంలో శత్రువుల మీద బాణాలు కురిసినట్టు మామీద పుష్పాలు విసిరితే ఏంలాభం, మహారాణీ! వృధా చేయకండి. పాపం! ఆ పూలని మహారాజుగారు విచ్చేస్తున్నారు. వారిమీద పువ్వులే విసురుతారో, బుక్కాయే చల్లుతారో, ప్రేమడోలల్లో ఊగిస్తారో, వలపు తెమ్మెరలో తేలిస్తారో... సరేకాని మామిడికాయ సంగతి మరచిపోయారు దేవీగారు దేవర వారిని చూసిన సంతోషంలో" అంటూ చమత్కరించింది అయిదవ సకి మదనలేఖ,

రుద్రమదేవి ప్రధాన సఖులు పదిమంది. వారిలో ప్రధాన సఖి వకుళాదేవి. వకుళాదేవి అంతఃపుర నామం కామసాని అసలుపేరు ఆమె పురుషవేషంలో ఉంటే, వాళ్ళు పురుషవేషంలోనే ఉంటారు. ఆమెతో సమానమైన విద్యావంతులనే చెప్పాలి వాళ్ళనీను. సౌందర్యంలోనూ ఉన్నతశ్రేణే వాళ్ళదీ. ఎన్నడైనా తీరిక ఉండి రుద్రమదేవి చెలియలతో మట్లాడుతూ ఉంటే అంతఃపురంలో వేరే దీపాలక్కరలేదు. పదకొండు దీపాలున్నై ఒకేచోట. చిదిమితే చాలనిఅంటారు రాజమాతలు నవ్వుతూ.

రాజోద్యాన వనం మధ్యభాగాన మహారాణి ప్రత్యేక విలాస మందిరం ఉన్నది. చక్కని భవనం అది. మహారాణి తన వివాహ వార్షికోత్సవాన్ని అందులో జరుపుకొంటుంది. ఆసాయంకాలంనుండి ఆడవాళ్ళ వేడుకలు ముమ్మరమై పోయినై పేరంటంలో ఎన్నెన్నో పరిహాసాలు దొర్లినై. తర్వాత నవరసాభినయ చతుర అయిన రాజనర్తకి నృత్య ప్రదర్శన జరిగింది. కానీ, మహారాజు వీరభద్రుడు రాలేదు. చిన్నబోయి ఉన్న తమ దేవిని చూచిన వకుళాదేవి, మంజుల జీనిలవలేక వీరభద్రుడి వద్దకు పరుగిడినారు. ఆడవేషంలోనే. వకుళాదేవి సౌందర్యానికి దిగ్భ్రాంతుడైనాడు వీరభద్రుడు. అరెరే! మొదటిసారిగా ఉజ్జ్వలమైన స్త్రీవేషంలో

మహారాజు కంట పడ్డానే అనినాలుక కొరుక్కుందామె. రాజు కలవరపాటు గ్రహించి ఏమనుకొన్నాడో, ఏకళనున్నాడో, ఏకుళ ఏంమంత్రం వేసిందో భార్య దగ్గరికి బయలు దేరాడు వీరభద్రుడు.

బ్రహ్మాండంగా అలంకరించబడిన ప్రత్యేక మందిరంలో ఊహించని విధంగా సత్కారాలు, మర్యాదలూ చక్కగా జరిగినై ఆయనకి పేరుకి యువరాజేగాని, గణపతి దేవుడు మరణించినప్పటి నుంచిరుద్రమ దేవే చక్రవర్తినిగా వ్యవహరించబడుతున్నది. పెళ్ళినాడే ఇంతగౌరవింపబడలేదేమో అనిపించింది ఆతనికి కోపంతగ్గి, మనస్సు ఓకింత హర్షపుల్లమైంది. అమ్మయ్యో! ఇప్పటికి చరితార్థలం. అనుకుంటూ శయన మందిరానికి దోవ తీయించారు చెలులు. అడుగడుగునా పూవుబెత్తులు పరిచారు ఎటు చూసినా సౌందర్యమే! ఏదివిన్నా మృదుగీతమే! సుగంధ పరిమళాల ఘుమఘుమలు, కస్తురి పునుగుల గుబగుబలు నాసాపుటాన్ని సోకుముట్టిస్తుంటే, కిలకిల నవ్వులు రువ్వుతూ, చెలులు తోడురాగా విచ్చేస్తున్న ప్రాణేశ్వరుణ్ణి ఉత్కంఠతో చూసింది రుద్రమదేవి.

చిరుసిగ్గు దొంతరలమధ్య ఆయనకి ఎదురువచ్చింది. అప్పుడామెవారణాసి నుంచి తెప్పించిన విలువైన ఎర్రని పట్టుచీర ధరించింది. కొత్తరకంగా చీర కట్టారు చెలులు. దానినిండా మంచిముత్యాలుకుట్టి ఉన్నై. నీలిరంగు మేలిముసుగుతో ప్రత్యేకమైన ఆహార్యమైన వైభవంతో మోహినీదేవతలా మెరిసిపోతొందామె. జడ చొక్కాలు చొక్కాలుగా చుట్టి నిండా పువ్వులు అమిర్చారు. భర్త విచ్చేసినందుకు కళ్ళలో కళలు నింపుకుని, బుగ్గల్లో కెంపుల సిగ్గులు దాచుకున్న ఇల్లాలిని చూసి మందహాసం చేసి "దేవీ! అమ్మాయి క్షేమమా?" అని అడిగాడు వీరభద్రుడు. చెలులకు కనుసైగ చేసి పాపను తెప్పించింది రుద్రమ. కూతురితో కలసికాసేపు ఆడుకున్న



తర్వాత "దేవి! తమరేమిటివాళ మెరిసిపోతున్నారు?" అని నవ్వాడు వీరభద్రుడు. అంతటి మహారాణికి అంతరాంతరాలలో గిలిగింతలు పెట్టినట్లై మెల్లగా తలఎత్తి "చంద్రుడువస్తే కలువ మెరవదా, ప్రభూ" అన్నది. ఆమె కళ్ళు నీటితో నిండినై.

"నే నొచ్చానుగా! ఇంకా ఎందుకు కన్నీరు?" అంటూ అక్కున అదుము కొన్నాడతను.

"మీ రొచ్చారనే ఆనంద బాష్పాలు" అంటూ అల్లుకుపోయిందామె

"మహారాణి! అంత బేలవైతే ఎట్లా" అని పరిహాసమాడా డతను.

"ఆఖరికి తమవద్ద కూడా బేల కావద్దంటారా, ప్రభూ!" అన్నదామె.

నా దగ్గరే కాదు, ఎక్కడైనా బేలవుగా ఉంటేనే బాగుంటుంది నాకు, అనుకున్నాడు వీరభద్రుడు మనస్సులోనే. ఆ వేళలో పైకి ఆ మాట అని ఆమె మనసు నొప్పించటం ఇష్టం లేకపోయిందతనికి.

ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ ఆ ఆలుమగలు సరస సల్లాపాల్లో కరిగిపోతున్న వేళ...

పెంపుడు చిలక వచ్చి మహారాణి భుజం మీద వాలింది. "దేవి! అపాయం!" అని పలికి ఎగిరిపోయింది.

భవనం చుట్టూ మహిళా సైనికులే కాపలా కాస్తున్నారు. ఇలా సందేశం వచ్చిందంటె పరిస్థితి వాళ్ళ చేయి దాటి పోయిందనే అర్థం.

మహారాణి చటుక్కున లేచింది. శిరస్త్రాణ కవచ ధారణలకు సమయం లేదు. కట్టిన చీరనే కాసెకోకగా మడిచింది. గోడమీదున్న కత్తి, డాలు అందుకుని "ప్రభూ! మీరు కూడా సిద్ధంకండి" అన్నది. అతను కత్తీ, డాలూ అందుకున్నాడు.

ఎట్లా జొరబడ్డాడో శత్రురాజు ఏరువ మల్లిదేవుడు లోపలికి జొరబడ్డాడు. కత్తి చేతబట్టుకుని కాలయముడిలా వస్తున్నవాడు రుద్రమను చూసి తక్కున ఆగిపోయినాడు.

"ఓహోహో! ఏం సౌందర్యం. రాణీ, నీది! జగదేక మోహనం కాదటే, రుద్రమా! ఇంత అందగత్తెవని తెలియదు. లేకపోతే ఏనాడో నీ పొందు లభింపజేసుకునే వాణ్ణి నిన్ను చంపను, ఓడించను. నా మనస్సు మార్చుకొన్నాను నీ అందం నావశం చేస్తివా, నిన్ను వదిలేస్తాను! అయినా, నీ కేలనే, అబలా, ఈ కరకు కత్తుల కణకణలు? చిలుక పలుకులే సహింపలేనంత సుకుమారిలా కనిపిస్తున్నావు. ఇంక కత్తేం పడతావులే! సుఖంగా నా కౌగిట కులుకుతూ ప్రేమ సామ్రాజ్యాన్ని నేను చూసుకుంటాను గానీ" అంటూ కత్తి ఝుళిపించి వికటంగా నవ్వాడు మల్లి దేవుడు.

"ఛీ! నీచుడా! తెలుగు రాణిని-పైపెచ్చు నా ఇల్లాలిని నా కళ్ళ ముందు అవమానపరచి బ్రతుకుదామనేనా?" అంటూ లాఘవంగా మల్లి దేవుని కత్తిని చేతినుండి ఎగరగొట్టేశాడు వీరభద్రుడు.

హుంకరించి మళ్ళీ కత్తి అందుకున్నాడు మల్లిదేవుడు.

"ప్రతి పరాయి ఆడదాని అందమూ నీది కాదురా, మూఢుడా!



నీకు అక్కాచెల్లెళ్ళు లేకపోతే ఏం? అమ్మ ఉందిగా" అంటూ కత్తి కలిపింది మహారాణి.

"మీ రుండండి, దేవి! ఈ దుర్మార్గుడిసంగతి మేం చూసుకుంటాం" అని అడ్డువచ్చాడు వీరభద్రుడు. సంతోషంగా తప్పుకుందామె. తన భర్త అంత ప్రయోజకుడైనాడంటే ఆ ఇల్లాలికి పట్టపేనుగు ఎక్కినప్పటి కంటే సంబరమెక్కువైంది.

"చాల్లేవోయ్, వాజమ్మా! రాజ్యం చేయటం చేత కాక చేతికి గాజులు తొడిగించుకున్న వాడికి పెళ్ళాం.

రాజైతే, ఆవిడ మోచేతి నీళ్ళు తాగుతూ బ్రతికే పౌరుషహీనుడివి. నన్ను ఎదిరిస్తావా?" అంటూ కలబడ్డాడు మల్లి దేవుడు.

అతని కత్తిపోటులకు రుద్రమదేవే గిలగిల లాడిపోయిందంటే ఇంక వీరభద్రుడి మాట చెప్పాలా?

అప్పటికప్పుడు తను రాజ్యం వదిలేసి, భర్తకు పట్టం కట్టేయాలని అనిపించింది మహారాణికి. ఇతరుల దృష్టిలో తన భర్త ఇంత హీనంగా ఉన్నాడంటే ఆ స్త్రీ మనస్సు అలివికాని బాధకు గురయింది. కానీ, ఇది ఊహించే కాబోలు గణపతి దేవుడు కఠినంగా శాసించాడు. వీరభద్రుడికి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజ్యం ఇవ్వకుండా. "నువ్వు బాధపడవద్దు, తల్లీ! రాజ్య పరిపాలన అంటే మాటలు కాదు మన స్వప్రయోజనాలకంటే రాజ్య భద్రత, ప్రజా క్షేమం ఆలోచించి నీకు పట్టాభిషేకం చేస్తున్నాను. నీ భర్త అట్టే సమర్థుడూ, రాజనీతి కోవిదుడూ అని తోచటం లేదు నాకు. కాకతీయ సామ్రాజ్యాన్ని మూడునాళ్ళ ముచ్చట చేయకు తల్లీ!" అని ఆర్తిగా బతిమాలాడు ఏకాంతంలో

కూతుర్ని. అది గుర్తొచ్చి ఆగిపోయి నిరీహంగా నుంచుండి పోయిందామె.

కొంత పోరు జరిగాక వీరభద్రుడి చేతిలోని ఖడ్గాన్ని ముక్కలు చేశాడు మల్లిదేవుడు. విజయ సూచకంగా కహకహ నవ్వి, "ఇప్పుడు నిన్ను చంపి, నీ పెళ్లాన్ని ఎత్తుకుపోతున్నా, ఎవడు అడ్డొస్తాడో చూస్తా" అని రంకె పెట్టి కత్తి ఎత్తాడు. క్షణం ఆలస్యం అయితే విరభద్రుడి తల ఎగిరి ఉండేదే కానీ ఈ లోపులో మల్లిదేవుడి కత్తి ఎగిరి అల్లంత దూరాన పడింది. అతని కళ్ళు జిగేలుమన్నాయి.

ఎట్టయెదుట రౌద్రాకారంతో, సంపూర్ణ పురుష వేషంతో భద్రకాళిలా నిలబడి ఉంది రుద్రమాంబిక.

విరభద్రుడి కళ్ళే చీకట్లు కమ్మాయి. ఇక మల్లిదేవుడి మాట చెప్పాలా?

దుర్గాదేవి విశ్వరూపాన్ని దర్శించిన మహిషాసురుడికిమల్లే భ్రమన్పడి పోయినాడు తరువాత కత్తి కలిపాడు తెలివి తెచ్చుకుని.

రుద్రమదేవి ఖడ్గ చంక్రమణాల్లోంచి తేజోనలం ఉద్భవిస్తున్నది. ఆమె పరాక్రమాన్ని, ప్రదర్శిస్తున్న ఖడ్గ యుద్ధపు మెలకువల్నీ విస్ఫారిత నేత్రాలతో చూశాడు విరభద్రుడు. కైలాసం నించి అమ్మవారు దిగి వచ్చినట్లనిపించిందనికి కూడా.

మల్లిదేవుడు మహాబలవంతుడు. స్థూలకాయుడు నాజూకుగా, మణిశలాకలా ఉన్నది రుద్రమదేవి అవలీలగా కత్తి తిప్పుతూ అతణ్ని ముప్పుతిప్పలూ పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించింది.



శత్రువు శరీరంనించి రక్తం ఒడికలు కడుతుంటే మహారాజ్ఞి జడలో అలంకరించుకున్న పువ్వు వాడలేదు.

ఒక ఆడది సామ్రాజ్యం ఏలటమా? ఛీ! పురుష ప్రపంచానికే సిగ్గుచేటు. మగ వాళ్ళందరూ దద్దమ్మలనా స్త్రీకి పట్టం గట్టాడు గణపతి దేవుడు?" అని గర్జించి మాయోపాయంతో శుద్ధాంతం ప్రవేశించి రాజదంపతులను మట్టుపెట్టడానికి విచ్చేసిన అపర భీమసేనుడు, పురుష సింహాడు మల్లిదేవుడు ఆడదాని ముందు నిలువలేక గజగజలాడి పోయినాడు. ప్రాణ భయంతో ఆమె కాళ్ళపై పడ్డాడు.

అప్పటికే చుట్టుముట్టిన సైనికులకు అతనిని బంధించమని ఆజ్ఞ ఇచ్చి, వెనుదిరిగి చూసేసరికి విరభద్రేశ్వరు లేరీ? లేరు

తను చెయ్యలేని పని-అందునా ఖడ్గ యుద్ధం భార్య చెయ్యటమా? అవమానభారంతో ఆయన శిరసు వాలిపోయింది. చల్లబడుతున్న కోపం మళ్ళీ భగ్గుమన్నది.

సామంతరాజు తనపై అనవసరంగా కత్తి కట్టటంకంటే, పతిదేవుడు అర్థాంతరంగా ఇలా వెళ్ళిపోవటం మిక్కిలి మనస్తాపాన్ని కలిగించింది రాణికి. దీర్ఘ వియోగానంతరం సంభవించిన తమ కలయికకి ఆమె ఎంతో సంతోషించింది ఇందాక. కానీ, మళ్ళీ ఇదేమి ఉపద్రవం

ఈ మధ్యనే ఆమె మొగలిచర్ల మొదలయిన పుణ్య స్థలాలు దర్శించి వచ్చింది. ఆయా దేవతలకు మొక్కుకుంది. ఈ సారి తన

5)

గర్భవాసాన మగబిడ్డ పుడతాడేమో" అని ఆశించింది. అదీకాక తనపై మోపబడిన సువిశాల సామ్రాజ్య భారాన్ని దక్షతతో మోయగల శక్తి ప్రసాదించమని తత్తద్దేవత అందరికీ జోతలు పెట్టింది. నగరంలో ఏక వీరాదేవికి ఏటికోళ్ళు సమర్పించింది. స్వయం భూస్వామి కనక నివేదన లిచ్చింది. కాకతమ్మకీ, మైలారు దేవుడికీ కానుకలు అర్పించింది.

"ఏ దేవుడూ నాభర్త నాతో సఖ్యంగా ఉండేట్టు ఆశీర్వదించలేదా?" అని దిగ్గుళ్ళ పోయిందిప్పుడామె.

"హుం!వివాహ వార్షికోత్సవం ఎంతరసాభాస అయిపోయింది?" అనుకుంటూ కళ్ళు విప్పేసరికి ఎదురుగా గోన గంగారెడ్డి, ప్రసాదాదిత్య నాయకుడూ, మేచమ నాయకుడూ కనబడ్డారు.

కొదమ తుమ్మెద రెక్కల అందాలు గుర్తించుకున్న మీసాలతో పౌరుషానికి ప్రతీకలుగా నిలిచిన ఆ యువ వీరుల వేపు పరిశీలనగా పరికించింది! శత్రురాజులు లేవదీసిన వదంతి గుర్తుకొచ్చిందామెకు. వాళ్ళకి తగిన ఆజ్ఞలిచ్చి పంపించింది,

"రుద్రమదేవి కావాలనే యువకులను సేనాపతులుగా, అంగరక్షకులుగా నియమించుకొంది" అన్నారు శత్రువులు ఆమాట గుర్తొనప్పుడల్లా గుండెలో గునపాలు గుచ్చినంత బాధ కలుగుతూందామెకు. తనసౌశీల్యం తన అంతరాత్మకి తెలుసు. పైన భగవంతునికి తెలుసు చాలు. కానీ,ఇదే మగ మహారాజు అయితే ఇలాంటి వ్యంగోక్తులతో దెప్పుతారా? రాజుగారి రాసిక్యం అంటూ పొగడుతారుగానీ.



ఒక [illegible] ...స్తుంటే, అతను పాపని ఒళ్ళో కూచోపెట్టు[illegible] చమత్కారాలు చేస్తు...

వాళ్ళలో చాలా [illegible]
గారు పాతికేళ్ళ [illegible] ...కే పొంగిపోయింది. తను
జీర్ణించుకోలేక [illegible] ...లా భర్తను అల
తిరుగుబాటు! వేల [illegible] ...గు నేతచీర
[illegible] గోల

సమర్థులూ, [illegible]
యువకులు, ప్రభుభక్తి [illegible]
మంచిదని భావించింది [illegible]
సంపూర్ణ రాజ్యాభిషేకం [illegible]
దేవుడు మరణించాడు, ర[illegible] ...దులకుట్రలు
శత్రువుల పన్నాగాలూ వి[illegible] ...ను రాజుగా ప్రకటించ దల్చు
కోలేదామె. పరిపాలన ఆమెచేస్తున్నా, పేరు గణపతిదేవుడుదే ఉంటుంది. అధికార ప్రకటనలూ, శాసనాలూ మొదలైన వాటిలో అడుగడుగునా సింహాసనం ఆపదల పాలౌతున్న తరుణమది. ఇటువంటి మహావీరుల సహాయం అవసరం అని తలపోసింది రుద్రమ. సరిహద్దు రాజులూ, దాయాది సోదరులూ, అటు కొప్పెరుంజింగడూ, రాజేంద్రచోళుటూ, ఆ వైపు యాదవ మహాదేవరాజూ కదను త్రొక్కుతున్నారు. కయ్యానికి కాలు దువ్వుతున్నారని గూఢచారి దళాలువార్తలు తెచ్చినై. తెలుగుదేశపు పరిపాలకు రాలైన ఈ ఆడదాన్ని వీలైతే సంహరించాలనో తపించిపోతున్నారు వాళ్ళు. తన ప్రాణం సంగతికాదు, నశ్వరమైన ఈ దేహంమీద తనకంత తీపి లేదు. అంతమాత్రాన కుట్రదారుల కుత్సిత కుతంత్రాల మధ్య, స్వార్థపరుల కోరికల మధ్య ఆంధ్ర సామ్రాజ్య లక్ష్మిని వదిలిపెట్టలేదు. సమర్థుడైన నాయకుడు లేకపోతే ఈ దేశం ఏమైపోతుంది?

అసలే శైవ, వైష్ణవ, జైన, బౌద్ధ మతాల మధ్య కలహాలు చెలరేగుతున్నై. సమైక్యంగా ఉండకపోతే తెలుగుజాతి సర్వ నాశనమై పోతుందే. చిన్నాభిన్నమై పోతుందే ఈ రాజ్యం. అసలు తెలుగుజాతనేది ఏమిటి, ఆ జాతికైన సమైక్యత కావాలి. ఈ రుద్రమ కంఠంలో ప్రాణం ఉన్నంతవరకూ జాతి సంరక్షణకే పాటుపడుతుంది. కాకతీయ వజ్ర సింహాసనాన్ని, తద్వారా ఆంధ్రదేశ సౌభాగ్యాన్ని, భద్రతను సర్వదా కాంక్షించబట్టే కదా అరితేరిన వీర యువకులను పదవులలో ప్రవేశపెట్టింది అలాంటి పరిపాలిస్తున్నదిగదా ఏదో పాడుమాటలనాలని తప్పుతోటిరాజులకు ఆమె మంచితనం తెలిదా?

రుద్రమదేవి ఇక ఆగలేకపోయింది. ఉప్పెనలా పొంగి ఒకికి వచ్చింది దుఃఖం ఇందాక హంస తూలికాతల్పం మీద పన్నీటి జల్లు కురిసింది. ఇప్పుడు కన్నీటి వరద ఒడ్డు విరిగింది

పగలంతా రాజకార్యాలతో అలిసి ఉన్న ఆరాణికి కావలసింది ఒక చల్లని మాట. తన భర్త దగ్గర్నుంచి కాస్త ప్రోత్సాహం అవి గనుక ఉంటే ఆమెకింత చింత, ఇంతగుండె తల్లట ఎందుకు? మగమహారాజుల లాగ ఈరుద్రమదేవికి ప్రత్యేక సౌకర్యాలు, అవసరాలు అవసరంలేదే. వాళ్ళకి మదిర కావల్సి రావచ్చుమదవతి కావల్సిరావచ్చు.వాళ్ళుఏమైనా కోరగలరు. తన కలాంటివి అక్కరలేదు గదా! హుఁ!మగవాడు రాజ్యం చేయ్యటానికి ప్రకృతీ, పరిస్థితులూ కూడా ఎంతో దోహదం చేస్తాయి

"యుద్ధం చేసి ఎంత అలసిపోయినావు, దేవీ? పైగా కడుపులో నా బిడ్డతో అని వీరభద్రుడు ఒక్క మాట అనిఉంటే చాలు, ఆమె పడిన శ్రమ అంతా మరచిపోయేది ప్చ్! మామూలు స్త్రీగా పుడితే ఎలాఉండేది



తను వంట చేసి భర్తకి వడ్డిస్తుంటే, అతను పాపని ఒళ్ళో కూచోపెట్టుకొని గోరుముద్దలు పెడుతూ తనతో చమత్కారాలు చేస్తూ...

ఆ చక్రవర్తిని హృదయం ఆ ఊహకే పొంగిపోయింది. తను అన్నం అమ్మలా పాపను పెంచుకుంటూ. అచ్చం భార్యలా భర్తను అలరిస్తూ, ఓరుగల్లు సాలెవారి పనితీరు మెరిసే సన్నని వక్కరంగు నేతచీర కట్టుకొని, కొప్పులో బంతిపూలు తురుముకుని ఈ రాజ్యకార్యాల గోల లేకుండా హాయిగా ఉంటే. . శివా! స్వయంభూదేవా, నన్నెందుకీ కృతక మర్యాదలతో. రాజ పదవికి బంధించావు తండ్రీ!మనసు విప్పి మగనితో మాట్లాడటానికి లేదు. తనివితీర కూతుర్ని ముద్దులాడుకోవటానికి లేదు ... "అని అష్టైశ్వర్య విరజమాన అయినచక్రవర్తిని వెక్కివెక్కి ఏడుస్తుంటే పక్క గదిలోనే నిద్రిస్తున్న, వకుళాదేవి చంగున మంచందూకి పరుగెత్తుకొచ్చింది. రుద్రమదేవిని అక్కునచేర్చుకొని, బుజ్జగించింది. "గర్భవతు లిలా దుఃకించవచ్చునా, తల్లీ! కడుపులోఉన్న భావి సామ్రాట్టులు కంది కలగుండు పడిపోరూ? అమ్మా! వీరభద్రుల వారిని మళ్ళీ తీసుకొస్తాను. మా బంగారు తల్లి కదూ- మావరాల మూటకదూ!మాఅందాల రాణివికదూ అని రుద్రమ పెదవులపైన హాసరేఖలు తొంగిచూచేదాక ఓదార్చింది. వకుళ

"వకుళా! నాక్కీరాజభోగాలు వద్దు. మామూలుగా బ్రతకాలనుంది. ఆ పర్ణశాల లేదూ అట్లాంటి చోట ఉండాలని ఉంది." అన్నది రుద్రమ.

"అమ్మా! అమ్మా! అని ఆమె మాటలకి అడ్డుపడింది వకుళ

"గణపతి దేవ చక్రవర్తుల వారికివిశ్వాసపాత్రురాలైన అంతఃపుర

సంరక్షకురాలిగా, కాబోయే ఆంధ్ర చక్రవర్తిని అనుంగ సఖిగా మహారాణీ వారూ:"

"మమ్మల్ని ఆజ్ఞాపిస్తున్నావా, వకుళా దేవీ?"

"క్షమించండి తల్లీ! అపరాధిని .. అంత మాట అనకండి మీ సఖిని, మీ దాసిని మన్నించండి." అన్నది వకుళ బాధగా.

"మరి?"

"తమరిని అర్థిస్తున్నాను. పాదాలంటి వేడుకుంటున్నాను. కాకతీయ చక్రవర్తిని గతం మరిచి పోకపోతే .."

"అప్రతిష్ఠకరూ రాజవంశానికి, తెలుగుదేశానికి!" పేలవంగా అన్నది రుద్రమదేవి.

"సర్వసంగ ప్రతిభాధురీణులు, సకలశాస్త్ర పారంగతులు, మనీషా విశారదులు- తమకి తెలియని విషయమా తల్లీ, అది! ఈ సఖి తమకి విన్నవించుకునే పాటిది కాదు. కానీ, దేవి తమరు ప్రశాంత మనస్కులై ఉండాలని ప్రార్థిస్తున్నాను. జరిగిపోయిన కాలం మళ్ళీ రాదు. ఇంకా ఆ విషయాలు మనస్సులోనించి తొలగి చకపోతే ఎట్లాగమ్మా!" ఆవిశన్నంల నీరు నించింది వకులాదేవి. ఆమె పెద్ద కళ్ళనుంచి ముత్యాల్లా జాలువారుతున్నాయి కన్నీళ్ళు, స్వయంగా తన చేత్తో ఆమె కళ్ళు తుడిచింది రుద్రమ.

"చెలీ!" అంటూ ఎదకు హత్తుకుంది "మాట ఇస్తున్నాను. ఇంకెప్పుడూ ఆ విషయం పైకి అనను. మరచిపోవడానికి ప్రయత్నిస్తున్నాను. ఈ అభాగ్యురాలి కోసం నువెందుకమ్మా ఏడుస్తావు? పూరుకో" అని వకు



ళను బుజ్జగించింది మహారాణి.

వకుళ లేచి ప్రశాంతికోసం రాజభిషగ్వరులు ఇచ్చిన భస్మాన్ని తేనెలో రంగరించి సేవింపజేసింది రాణీ చేత. తల్పంపై పరుండబెట్టి దుప్పటి కప్పింది.

అప్పటికి ఆంధ్రాధీశ్వరుని మొగసాలలో తెల్లవారుజాము గంటలు మ్రోగినై.

వకుళ చెక్కిట చేయి చేర్చి ఆమె దగ్గరే కూర్చుంది. ఎందుకిలా జరిగింది? అమాయకురాలైన రుద్రమదేవి జీవితం ఇలా అయిందేమిటి? అయ్యో! అని దిగులు పడింది వకుళ. నేనే సూత్రధారి నయినానే అందుకు నా పాపం ప్రక్షాళన మవుతుందా? అని దిగ్గుళ్ళి పోయింది.

o o o

పరమ రమణీయమైన ప్రకృతి కనుల పండుగ చేస్తుంటే, నిర్మల నీరాలు కలిగిన సరస్సులో ముఖసౌందర్యాలు ప్రతిఫలిస్తుంటే ఆడవేషంలో ఉన్న రాజకుమారి రుద్రమదేవి సఖులతో కొలను గట్టున ఆడుతోంది. పాకాల చెరువు వద్ద రేచర్ల రుద్ర సేనాని కట్టిస్తున్న దేవాలయ ప్రాంత మది దాగుడుమూతలు, ఒప్పులకుప్ప లాంటి తెలుగు అమ్మాయిలు ఆడుకొనే ఆటలన్నీ అక్కడ ఆడుకోటానికి అనాడు కుదిరిందామెకి. యుద్ధ విద్యల కానాడు ఆటవిడుపు దొరికింది. చెలులతో ఇంత దూరాన వన విహారానికి వచ్చిందామె. ఓరుగల్లులో ఆమెకింత అవకాశమేదీ అసలు? ఇన్నాళ్ళూ దాగిన రుద్రమదేవి స్త్రీత్వం ఒక్కసారిగా విజృంభించిందందుకే.

కేరింతలతో, ఆడపిల్లల సల్లాపాలతో మారుమ్రోగుతోందా ప్రదేశ

మంతా. కానీ, కాస్త దూరంలో అవేం పట్టించు కోకుండా నిర్నిద్ర దీక్షతో నిరుపమాన శ్రద్ధతో శిల్పం చెక్కుతున్నాడొక యువకుడు.

పదిహేడేళ్ళ ఎలజవ్వని, పదహారు కళల నెలవంక ధగధగలాడే ఆభరణాలు ధరించి, ఎర్రని సరిగంచు గల ఆకుపచ్చని కంజీవరం పట్టు పరికిణీ కట్టుకుని. నల్లనిచుక్కలున్న పసుపుపచ్చ భావజ తిలకంపల్లెవాటు వేసుకున్న వనదేవత వంటి ఆంధ్ర యువతి, అణువణువునా సొగసులు చిమ్మే రాజకన్య అందగత్తెలైన అనేకమంది సఖులతో ఆడుతూ పాడుతూ ఉంటే కూడా అశిల్పికుమారుడు తలఎత్తి చూడకపోతే ఉడుకుంక్కదిఆపిల్ల

తను ఆడపిల్లవేషంలో బాగాలేదాఏం?అనిఅనుమానమూ వచ్చింది. అందంగా ఉంటే ఈ అబ్బాయి నన్ను చూడడేం? అని తపనపడింది. "వీరభద్రదేవుడిగా ఉన్నప్పుడు గన్నారెడ్డి మొదలైన యువకులతో తిరిగినా ఏం అనిపించలేదే? మరి స్త్రీవేషంలో ఇదేమిటి చిలిపి ఆలోచనలు బాబోరా! వేషం మహిమ అని నవ్వుకుందామె.

ఎట్లాగో రెచ్చగొట్టి, గోలచేసి చివరికి అతని చేతిలోని ఉలి లాక్కునేదాకా ఊరుకోలేదు. రుద్రమ, వకుళ, అప్పుడతను తల ఎత్తి చూశాడు. చూసిన తర్వాత తలదించలేదు. కళ్ళువిస్మయంతో పెద్దవైనై ముగ్ధుడైపోయి చూస్తుండి పోయినాడు. "తన తపస్సు ఫలించింది. ఇష్ట కామేష నేత్రాలతో చూడసాగాడు.

"ఏమిటలా చూస్తావు బొమ్మలు చెక్కే పిల్లవాడా?" అని కోప్పడ బోయింది కానీ, రుద్రమకి నోటమాట రాలేదు తనను అమ్మాయివేషం లో ఇంత దగ్గరగా ఒక యువకుడు చూడటం ఇదే ప్రథమం.



"ఇదేమిటి? తను సూటిగా చూడలేక పోవడమేమిటి? ఎంతటి మగవాణ్ణీ నిర్భయంగా చూసేతను ఈ అబ్బాయి ముందిలాఅయిపోతున్న దేమిటి?"

వాలిపోతున్న కళ్ళను మెల్లగా ఎత్తి అతనివేపు పరిశీలనగా చూసింది.

విశాలములై తీక్ష్ణములైన అతని కళ్ళు అపుడే విచ్చిన తామర పువ్వులోని రేకులవలె ఉన్నాయి. పెద్దనుదురు, సన్నగా, ఎట్టగా బిగించి నట్లుండే పెదవులు, గిరజాల జుట్టు, ఎదపై యజ్ఞోపవీతం...

ఆ యువతి గుండెకు సూటిగా వలరాజు మొదటి బాణం సంధించి విడిచాడు. మరులు గొల్పే సరిచూపులో ఆయువకుణ్ణి వదలలేదు. మనస్సు నిండా పొంగి పొర్లుతున్న పూజ్య భావంతో వంగి రుద్రమదేవి పాదాలపై చేతులుంచాడతను. "సులలిత నవ యౌవనారంభ చంద్రోదయోద్వేల లావణ్య రసారుణ్య తారుణ్య దుగ్ధార్ణ వావిర్భవత్కంబు బిబ్బోక హృత్కుంధరే! సత్కృపా ఘుందిరే..." అంటూ

అప్పుడు వాళ్ళిద్దరికీ బాహ్యస్మృతి లేదు.

"చెలీ! చెలీ!" అని కుదిపింది గాభరాగా వకుళ. ఉలిక్కిపడి గబుక్కున తన పాదాలు ఇవతలికి లాక్కుంది రుద్రమ.

ఆ యువకుడు కూడా తేరుకుని "అయితే నువ్వు మానవ కాంతవా ఆవిడ నిన్ను చెలీ అంటున్నది" అన్నాడు ఆశ్చర్యంగా.

ఆఏకవచన సంబోధనకు విసికోపం వచ్చింది వకుళకు. "ఏమయ్యా ఈమె ఎవరనుకుంటున్నావు? ఎవరో తెలిస్తే నువ్విలా..." మధ్యలో అడ్డుకుంది రుద్రమ. చెప్పవద్దని కనుసైగ చేసింది.

"నువ్వేం చేస్తుంటావు?" అని అడిగింది వకుళ.

"ఇక్కడ శిల్పాలు చెక్కటం నేర్చుకుంటున్నాను."

"వినయశీలివేనే, నేర్చుకుంటున్నా నంటున్నావు ఇంత బాగా చెక్కుతూనూ। నీ పేరేమిటి?" అడిగింది వకుళ.

"రామప్ప అంటారు. ఒకసారి ఇలా రండి" అంటూ వాళ్ళిద్దరినీ తన పర్ణశాలకు తీసుకు వెళ్లాడు. అందులో ఒక గదిలో పూజించబడుతున్న దేవీ విగ్రహం చూసి ఇద్దరూ స్థాణువులే అయినారు. ముమ్మూర్తులా రుద్రమదేవి వచ్చి కూర్చున్నట్లుగా వుంది అక్కడి ప్రతిమ.

"నువ్వు మానవ కాంతవో. దేవకాంతవో నాకు తెలీదు. నా భావనా రూపమైన ఓ దేవి! శిల్పకళా సామ్రాజ్ఞీ. నాకోసం భూమికి దిగివచ్చిన ఓ అచ్చరా, సకల ఆగమ శాస్త్ర లక్షణ శరీరా, ఇన్నాళ్ళకు నాకు సాక్షాత్కరించావా ధన్యోస్మి, దేవి ధన్యోస్మి"అన్నాడు రామప్ప. అతని కళ్ళవెంట భావోద్వేగానికి తట్టుకోలేక ఆనంద భాష్పాల తడి.

బిత్తరపోయింది రాజకుమారి. ఆవేగం అతిశయించి స్పృహ తప్పినట్లయింది. చటుక్కున పడిపోబోతున్న ఆమెను పట్టుకున్నది వకులాదేవి.

భావి మహారాజ్ఞిని కాదు కాదు మహారాజును తగిన కట్టుదిట్టాలలో



ఉంచవలసిన బాధ్యత వకుళ కప్పజెప్పాడు గణపతిదేవులు.

ఆ లెక్కన ఈ క్షణమే రుద్రమ నవతలికి లాక్కుపోవలసింది. కానీ ఆమెలోని మానవత్వం అట్లా చెయ్యనివ్వలేదు. తరువాతి జీవితంలో రుద్రమదేవి కెలాగూ శాంతి ఉంటుందో, లేదో అనిపించింది. మామూలుగా ఆడపిల్ల లాగా కొంచెం సేపయినా ఇతనితో మాట్లాడనీ ఇది తెలిసి గణపతిదేవులు ఎంతయినా కోపించనీ. ఈ దివ్యప్రణయ క్షణాలను ఈ అమాయకురాలికి దూరం చెయ్యలేను. అరుదుగా రుద్రమకు లభించిన ఆడవేషం ధన్యమైంది, ఎంత ఉదాత్త ఆరాధన అతనిదీ అనుకుంటూ రుద్రమ సేదదీరిన తరువాత ఆమె నక్కడ విడిచిపెట్టిబయటకు వచ్చేసింది.

ఎన్నడూ ఎరగని జలదరింపు ఇద్దరికీ ఏం మాటాడాలో తోచలేదు ఆరాధనా పూర్వకమైన అతని చూపులు కలువరేకుల మాలలయి ఆమె శరీరమంతటినీ చుట్టివేసినాయి. ఊహలలోకూడా రుద్రమ ఇంతవరకూ సిగ్గుపడలేదు. ఇప్పుడు అంత సిగ్గూ ఒకేసారి ముంచుకొచ్చింది. తల వంచుకుంది.

కాసేపు ముళ్ళమీద నుంచున్నట్టు గడిపి, "సఖీ! మనం నగరానికి వెళ్ళే సమయం సమీపించిందమ్మా" అని కేకవేసింది వకుళ.

మిగిలిన చెలులు వాళ్ళ ఆటలో వాళ్ళున్నారు. ఈ జరిగిన సంగతి తెలియదు.

అతని సామీప్యాన్ని విడవలేక విడవలేక బయటికి వచ్చింది రుద్రమ.

వెనకే రామప్పా వచ్చాడు. "ఇంతకీ నీ పేరు చెప్పలేదే?" అని "నా పేరా? నా పేరూ..." అని రుద్రమ తడుముకుంటుంటే "రా... రాజకుమారి" అని చెప్పింది చప్పున వకుళ అందుకని "రాజకుమారి"లో ఒక్క అక్షరమేగా తేడా.

రుద్రమ చెవి దగ్గరచేరి "పేరుకూడా తెలియనంత ఏం మాటాడుకున్నారు అమ్మాయిగారూ" అంది ముసిముసిగా.

"ఫో, మేమేం మాటాడుకోలేదు" అంది రుద్రమ చిన్నగానే.

"ఓహో, సందర్భాన రస పారవశ్యంలో ఉండిపోయారన్నమాట ఇద్దరూ తనువులు మాటాడుకోక పోయినా మనసులు మౌనంగా మాటాడేసుకుని ఉంటాయిలే" అని చమత్కరించింది వకుళ.

"కుమారీ, మళ్ళీ ఎప్పుడు వస్తావు" అని అడిగాడు రామప్ప.

"వీలు రావాలేకానీ మా రా రాజకుమారి చిలకలా ఎగిరొచ్చి మీ శిల్పం ఖజాన వాలదూ" అంది పరిహాసంగా వకుళ.

"ఛీ . ఫో"అని కసిరింది రుద్రమ సిగ్గుపడుతూనే.

"సరేనండీ అయ్యా, వీలయినంత త్వరలో వీలుచూసుకుని వస్తాము సరేనా" అంది వకుళ.

"మీరు కూడానా" అన్నాడు రామప్ప నవ్వుతూ.

"అమ్మో ఏమో అనుకున్నాను మీ స్నేహితుడు గడుసువాడేనే" అంటూ రుద్రమని మోచేత్తో పొడిచింది వకుళ

రుద్రమ తల వంచుకుని ముసిముసిగా నవ్వుకుంది.

"నేను రాకుండా ఈ పిల్లను పంపరు లెండి వాళ్ళ తండ్రిగారు.



అందుకు రాక తప్పదు. చూడండి వచ్చినా దూరంగా కూర్చుంటాలెండి. అదిగో ఆ చెట్టు దగ్గిర" అంది వకుళ

"ఏం కూర్చోనక్కర్లే దక్కడ మాతో ఉండవచ్చు" అన్నారు ఇద్దరూ.

ఒకేసారి "మీ గాభరా దొంగలుతోలా మీ దగ్గిరే కూచుంటాలెండర్రా" అన్నది.

"ఇప్పుడు అమ్మా వాళ్లెవరూ ఇంటిలోలేరు. ఈసారి వచ్చినపుడు వాళ్ళని పరిచయం చేస్తాను" అన్నాడు రామప్ప. కళ్ళతోనే వీడ్కోలు తీసుకుని భారంగా కదిలిన రాకుమారిని చూసి నిట్టూర్పు విడిచింది వకుళ.

నగరంలోకి వెళ్ళగానే రుద్రమను అంతఃపురంలోకి పంపించి తాను సైనిక శిక్షణ పొందుతున్న బావ ఎల్లనను కలుసుకోవటానికి వెళ్ళింది

"ఓహో యువరాజుగారి ఇష్టసఖీ వకుళదేవిగారా, స్వాగతం" అని చేతులుచాపి ఆహ్వానించాడు ఎల్లన.

పరుగెత్తుకు వెళ్ళి ఆ బాహువుల మధ్య ఇమిడిపోవాలనిపించింది వకుళకి కానీ నిభాయించుకుని "ముందా చేతులు తియ్యి బావా నువ్వొకొస్త పక్కకు కప్పుకుని నన్ను లోపలికి రానీ"అంది గంభీరంగా.

"అలాగే" అంటూ పక్కకి తొలిగి మూతి ముడుచుకున్నాడు అతను.

"పిచ్చి బావా" అంటూ నవ్వింది వకుళ "సరేలే ఎందుకొచ్చావు?

తిప్పి చూడటం ప్రారంభించింది "ఓహో మీ గురువుగారి సర్వేశ్వర శతకం కూడా ఒండే పూర్తయిందా బావా, నిజంగానే దీన్ని తీసుకెళ్తున్నా యథావాక్కుల వారి కవిత్వం నాకు చాలా ఇష్టం, అవునుగానీ బావా, ఈ తెలుగు భారతం అది, సభా పర్వాలు చూస్తుంటే దిగులుగా వుంటుంది, మిగిలిన పర్వాలన్నిటినీ ఏ మహాకవో తెనిగిస్తే బాగుండును పద్దెనిమిది పర్వాల మహాభారతం తెలుగువారికి లభ్యమయ్యే శుభఘడియ ఎప్పుడో" అని బాధపడుతూ సర్వేశ్వర శతకమూ, నన్నయభటారకుల భారతమూ తీసుకుంది వకుళ.

"అవును! పైగా నా కేమిటో ఆశ. మన ఓరుగల్లులోనే శేష మహాభారత రచన జరుగుతుందని, సరేలే మన సాహిత్య చర్చలు తరవాత కొనసాగిద్దాం మందిలా రా" అన్నాడు ఎల్లన.

"ఎందుకో?" భయం నటించింది వకుళ.

"నా గుండెలో మోగే మధుర నాదాలువినిపిస్తాను. ఏదీ ఇంకొంచెం దగ్గిరకొచ్చి వినాలి"

"బావా!"

"కామసానీ!"

"బావా!"

"మనం ఇలా దూరంగా ఎన్నాళ్లు వుండాలో?"

"ప్చ! రాజ్యతంత్రం సరిగ్గా సాగాలంటే మనలాటి ఎందరు అనామకులు అల్లాడిపోవాలో, యువరాజు వివాహం కావాలికదా ముందు"

"ఏమోనే, అమ్మాయ్" అంటూ సూరాంబ రావటంతో ఒకరి



మీ యువరాజుగారు రానిచ్చారా? రాణివాసంలోని సౌఖ్యం ఇక్కడెందు కుంటుందిలే" అన్నాడు ఇంకా కోపంగానే ఎల్లన.

"ఇదిగో, బావా నన్ను ఏడిపిస్తున్నావని అత్తయ్యతో చెప్తా చూడు"

"ఏమిటర్రా పిల్లలూ, ఈ గొడవ? ఏమే కాముడూ లోపలి కొస్తూనే వాణ్ణి రెచ్చగొట్టుకుంటూ వస్తావేమే" అంది రోపల్నించి వచ్చిన ఎల్లన తల్లి సూరాంబ నవ్వుతూ.

"అబ్బే ఏం లేదత్తయ్యా బావ యథావాక్కుల అన్నమయ్య కవిశ్వరుల శిష్యుడు గదా ఆయన దగ్గర్నించీ కొన్ని గ్రంథాలు తెచ్చుకున్నాడు. అవి నేను తీసుకెళ్ళి చదువుతానంటే ఇవ్వటల్లేదు చూడు సరే గానీ ఇప్పుడు నీ వొంట్లో ఎలా వుంది? రాజవైద్యుల మేనల్లుడుగారొచ్చి మందిస్తున్నారు కదా" అన్నది వకుళ.

ముసిముసిగా నవ్వింది సూరాంబ "నేనంటే ఎంత శ్రద్ధ నా ఆరోగ్యం గురించి ఇంత ఆరా ఏం కథ? ఇవిగో కారప్పూసా, లడ్డుండలూ దేశా తినండి" అంటూ పళ్లెంలో తినుబండారములు పెట్టి ఇచ్చింది,

అవి తిని ముందు గదిలోకి రాగానే ఆ పిల్ల చెవి పట్టుకున్నాడు ఎల్లన.

"ఏయ్ మొద్దు ఎన్ని అబద్ధాలు నేర్చుకున్నావు? నువ్వు గ్రంథాలు చదువుతానంటే నేను ఇవ్వటలేదూ, ఇవిగో వీటిని తీసుకెళ్ళి నాదువు ముందు" అంటూ కొన్ని ఆమె కిచ్చాడు.

"చదివాలే, బావా సంస్కృత గ్రంథాలేగా అన్నీ"అంటూ వాటిని

కౌగిలిలోంచి ఒకరు విడివడి దూరంగా జరిగి దిక్కులు చూస్తున్నట్లు నటించసాగారు.

"నువ్వేమో తల్లిదండ్రులులేని పిల్లవు, చిన్నప్పుడు మీ నాన్న నిన్ను తీసుకెళ్ళి ఆ రాజివాసంలో పెట్టకపోయినా బాగుండేది. ఈ పాటి కిద్దరు బిడ్డల తల్లివై ఈ ముసలమ్మ బాధ్యత తీసుకునేదానివి. మీనాన్నా మీ మామయ్యా ఇద్దరూ యుద్ధంలో పోనేపోయినారు. మీ అమ్మ నిన్ను నా కోడలిగా చేసుకోమని అడుగుతూనే కన్నుమూసింది ఇంక మిగిలింది ఈ మొండి కట్టె ఒక్కటే. కనీసం కొడుకు కడుపున కాయ కాచిందా? ఇహ నేను సంతోషంగా వెళ్ళిపోతాను. చక్రవర్తులు దయగలవారే కానీ మీ పెళ్ళి ఎప్పుడు చేయిస్తారో ? నా కళ్ళతో చూడగలనా అసలు?" అని ఆవేదన పడింది సూరాంబ

వకుళ సిగుపడింది. అత్తయ్య ఎదుట.

"నీ కెందుకమ్మా నువ్వో బ్రహ్మాండమైన పందిరి వేయించెయి భూదేవంత అరుగు వేయించెయ్యి కామసాని మెళ్ళో మూడు ముళ్ళు వేసేస్తాను, సరా" సరదాగా తేల్చెయ్యబోయాడు ఎల్లన,

అంతకంటేనా, నాయనా, కానీ నీ సైనిక శిక్షణ పూర్తికావాలికదా ఇటు కామసాని వివాహానికి గణపతిదేవ ప్రభువు అనుజ్ఞ కావాలికదా అప్పుడూ మీ పెళ్ళి జరిగేది. చక్రవర్తులే ఒక శుభముహూర్తంనిర్ణయించి మీ ఇద్దర్నీ కలుపుతారేమోలే మీ ఇద్దరూ వారికి అత్యంత ప్రీతిపాత్రులు గదా" అంది సూరాంబ

ఆరాత్రి అత్తయ్య చేతివంట తిని ఏ కలతలూ లేని నిద్రపోయి



మరునాడు ప్రొద్దున్నే అంతఃపురానికి వెళ్ళిపోయింది వకుళ.

ఇక ఇక్కడ రుద్రమదేవికి అన్నం సహించటంలేదు. నిద్ర పట్టటంలేదు. ఏ విద్య నేర్చుకోవాలన్నా అనాసక్తతఏర్పడింది. ఖడ్గయుద్ధం చేస్తూ రెండుసార్లు కత్తి పడేసుకుంది. ధనుస్సు చేతపట్టుకుంది కాని బాణం లక్ష్యాన్ని ఛేదించటంలేదు. గురువుగారు తల పంకించి ఇక ఆ పూటకి సెలవిచ్చి విశ్రాంతి తీసుకోమని చెప్పి పంపారు.

మర్నాటి పొద్దున్నే వకుళ రావటం చూసి చాటంతయింది రాకుమారి మొహం.

"మనం మళ్ళీ అక్కడికి ఎప్పుడు వెళదాం వకుళ" ఆమె రాగానే అడిగిన మొదటి ప్రశ్న అది.

"ఎక్కడికి" అని విస్తుపోయిందివకుళ. తరవాతగుర్తుకొచ్చింది "ఓహో.... అక్కడికా వెళదాం... వెళదాం వీలుచూసుకుని' అని ఆశాజనకంగా మాటాడింది.

ఒక నెలరోజులు రాకుమారిని ఆపే టప్పటికి వకుళ తలప్రాణం తోకకి వచ్చింది.

"వకుళ రామప్పను చూడాలి వకుళ రామప్పను చూడాలి" అని వకుళ చెవిలో ఇల్లుకట్టుకుని పోరింది రుద్రమ.

మామూలు ఆడపిల్లలు బయటికి వెళ్ళొచ్చేమో కాని యుక్త వయస్కురాలయిన రాజకన్య అందునా మగబిడ్డగా చెలామణీ అవుతున్న

అమ్మాయి అడుగు బయట మోపాలంటె చాలా కష్టం

చివరికి గణపతిదేవ చక్రవర్తులు కొంచెం ప్రసన్నంగా ఉన్న సమయంచూసి అనుజ్ఞ సంపాదించింది వకుళ "రుద్రసేనానిగారు కట్టిస్తున్న దేవాలయములో గజ సాధనికుడైన జాయప సేనానిగారు రచించిన నృత్త రత్నావళికి ఉదాహరణలుగా శిల్పాలు మలుస్తున్నారట. యువరాజులు చూడాలని ఉబలాట పడుతున్నారు" అని విన్నవించుకుని ఎట్టకేలకు సాధించింది.

వంద హెచ్చరికలుచేసి బిడ్డను ఆమెతో పంపారుచక్రవర్తిచుట్టూ తెరలు కట్టిన పల్లకిలో రాకుమారి బయలుదేరాలని నిర్ణయింపబడింది.

"వకుళ ఏ పరికిణీ కట్టుకోనూ ఏ ఓణీ వేసుకోనూ ఏం నగలు పెట్టుకోనూ" అని ప్రాణం తీసింది రుద్రమ.

ఎన్నడూ ఆమెలో అంత ఉత్సాహం చూడలేదు చెలులు. ఆభరణాలమీద అంత ఆసక్తి ఇదివరకు లేదు. నల్లని భావజ తిలకం, చేనేత పరికిణీ కట్టుకుంది చివరికి దానికి దోసెడు వెడల్పున్నపచ్చటిఅంచుంది. దానిమీద సరిగ పూలు కుట్టిఉన్నాయి. మెత్తని గులాబీరంగు ఓణీ వేసుకుంది. సిందూరంలాంటి రవిక తొడుక్కుంది కట్టె వంకీలు పెట్టుకుంది సన్నని వడ్డాణం ఆవిడ నడుము పిడికెడే అని చాటుతోంది. కాలిఅందెలు చేతి కంకణాలు రవళిస్తుంటె ఆ కన్నె మిన్న ముగ్ధమనోహరంగా, నయనాభిరామంగా వెలుగు పసుపు సొగసులు కుమ్మరిస్తూ పల్లకి ఎక్కిం పక్కన వకుళ ఒక్కతే.

ఆ ఇల్లు పూరిల్లులాగా కనిపించటంలేదు రుద్రమ కళ్ళకి రాజ



ప్రాసాదాల కంటె ఎక్కువ బాగుంది.

ఇంటిలోకి వస్తున్న ఇద్దరు మెరుపుతీగల్లాంటి ఆడపిల్లల్ని చూచి ఆశ్చర్యపోయాడు వీరాచార్యులు. ఆయన రామప్ప తండ్రి.

"అమ్మాయి మాణిక్యాంబా ఎవరో అమ్మాయిలు వచ్చారు చూడు. నీ స్నేహితులా" అని కేకేశాడు కానీ ఈ చిన్న ఊళ్ళో వీళ్ళనిఎప్పుడూ చూసినట్లు లేదే అనుకున్నాడు.

మాణిక్యాంబ చిన్నన్న రామప్ప గదిలో ఉంది అతనికేదో సాయం చేసిపెడుతూ.

"ఎవరొచ్చారో" అని ఉత్సాహంగా పరిగెత్తుకొచ్చింది ఆఅమ్మాయి. పదిహేనేళ్ళుంటాయేమో, ఆ చుట్టు పక్కల ఉన్నవి శిల్పుల ఇళ్లే. అయిదారు మైళ్ళ దూరంలో మటుకు ఒక చిన్నకోయపల్లె ఉంది. శిల్పుల ఇళ్ళలో తన ఈడు పిల్లలులేరు, కోయపిల్లలొచ్చారేమో అనుకుంటూ వచ్చి చూసిన మాణిక్యాంబ రుద్రమనిచూస్తూనే విస్తుపోయింది. రుద్రమ అచ్చం చిన్నన్నయ్య చెక్కిన శిల్పంలాగా ఉందేమిటని ఆశ్చర్యపోయింది–

"రండి...రండి కూర్చోండి"అంటూ లోపలికి తీసుకెళ్ళి చాప పరిచింది—మీరెవరంటూ ఎలా అడగాలబ్బా అనుకుంటూ–

అంతలో పూజకెళ్ళిన తల్లి త్రిపురసుందరీ, నీళ్ళకెళ్ళిన వదిన విశాలాక్షి కూడా వచ్చారు, ఇంతమంది జనం రుద్రమకి. వకుళకి ఒక క్షణం భయం వేసింది, ఏం మాట్లాడాలా అని– "మీరు రాజధాని నుండి

వచ్చారమ్మా? ఎండనబడి వచ్చినట్లున్నారు, అమ్మాయ్ విశాలా దాహం తెచ్చివ్వమ్మా" అని కోడలిని కేకేసింది త్రిపురసుందరి—

"ఔనండీ ఇక్కడ గుడి, శిల్పాలు చూద్దామని వచ్చాం, మాకు తగా తెలియదు, మీరు కొంచెం చూపిస్తారేమోనని" అందుకుంది వకుళ

"అలాగేనమ్మా దానికేం భాగ్యం మా అమ్మాయీ, విశాలా చూపి స్తారులే" అంది త్రిపురసుందరి.

అంతలో కాస్త దబ్బఆకూ, ఉప్పూ వేసిన పల్చని మజ్జిగ తెచ్చి యిచ్చింది విశాల. భక్ష్య, భోజ్య. చోష్య లేహ్యాలతో ప్రతిరోజూ భోజనం చేసే రాకుమారికి మజ్జిగ అమృతంలా అనిపించింది. వకుళ సంజ్ఞ చేయకపోతే "ఇదేం పానీయమండీ?" అని అడిగేదేమో కూడా వీ ళ్ళిక్కడ మాట్లాడుతుండగా మాణిక్యాంబ రామప్ప దగ్గిరకి తుర్రుమంది

"అన్నయ్యా నీ శిల్ప లక్ష్మి వచ్చింది చూడు" అని చెప్పింది.

రామప్ప మొహం అమాంతం విప్పారింది. గుండెలో ఏదో తెలి యని అలజడి. ఒళ్ళంతా పులకింతలు " అమ్మాయి వచ్చిందన్నమాట" అనుకున్నాడు. ఆ ఊహే పరమ సంతోష కారణమైంది ఆ యువకుని ఎదలో మధురిమలు పరవళ్ళు త్రొక్కినాయి. కానీ ఎట్లా ఆ అమ్మాయిని వెంటనే చూడటం? అమ్మతో మాట్లాడుతోందేమో! త్వరగా అపె ఇక్కడికి రాకూడదు? అని తహతహ లాడిపోయిందతని మనస్సు.

యౌవనంలో ఏ భావం అయినా ఎంత దృఢమైనది. అందులోనూ వలపు మాట వేరే చెప్పాలా?



"అమ్మా...అమ్మా వీళ్ళకు గుళ్లో చెక్కుతున్న శిల్పాలు సరిగా చూపించి, వివరించాలంటే రామన్నయ్యని కూడా తీసుకెళ్లాలమ్మా"అంది మాణిక్యాంబ ఉత్సాహంగా—"ఈ అమ్మాయిని అన్నయ్య చూడటానికి వేరే ఏం మార్గముంది?"అనుకుంటూ.

"అట్లాగే తల్లీ! తీసుకెళ్ళు" అంది త్రిపురసుందరి.

ముందు మా ఇల్లు చూద్దురుగాని రండి" అంటూ తీసికెళ్ళింది విశాల.

పూరిల్లయినా విశాలంగా, హాయిగా ఉంది. వాకిలికి బంతిపూల తోరణాలు వేలాడుతున్నాయి. దొడ్డి గుమ్మానికి ఎదురుగా కళకళలాడు తున్న తులసికోట ఉన్నది. దొడ్డినిండా చెట్లు–చల్లని గాలీ ఏదో ఉద్యాన వనములో విహరిస్తున్నట్లుంది. రుద్రమ, వకుళలకు ముద్ద మందారం, సంపెంగ, పారిజాత చెట్లని ఎంతో ఉత్సాహంగా చూపించి "ఇదుగోనండీ మా ఇంటిలో గోరింటాకు చెట్టుకూడా వుంది మీరు పెట్టుకుంటారా?" అంది మాణిక్యం.

"ఎందుకు పెట్టుకోరూ? ఆడపిల్లలు కాదా! అమ్మాయ్! నీ వెళ్ళి వీళ్ళకి గుడి చూపించిరా, నేనీలోపల గోరింటాకు రుబ్బిస్తాను" అంది సుందరమ్మ.

గుటకలు మ్రింగారిద్దరూ.

"మేము... మేము ఇంటికెళ్ళిపోవద్దు" అని సర్ది చెప్పారు.

"పోనీ రుబ్బిస్తాను—ఇంటికెళ్ళి పెట్టుకుందురుగాని" అందావిడ·

"అమ్మయ్య" అనుకున్నారిద్దరూ ఎందుకంటే యువరాజు వీర రుద్రదేవుడి చేతికి గోరింటాకు ఉంటే రేపు సభలో జనం...అమ్మో—

బాదం చెట్టుకింద ఎత్తుగా, విశాలంగా ఉన్న తిన్నెమీద కూచుని సుందరమ్మ పెట్టిన అరిసెలు తిని, మంచినీరు త్రాగారు. కొంచెం సేపు అయ్యాక "ఇక వెళదామా అంటూ లేచారిద్దరూ.

"అన్నయ్యా వస్తావా?" అని పిలిచిందిమాణిక్యం.

అందరూ ఎక్కడ గుర్తుపడతారో అని ఉబలాటాన్ని దాచుకున్నా అతను గుమ్మంలోంచి బయటికి సరుగెత్తి వచ్చినట్లే ఉన్నది ఒక్కసారిగా అతనివైపు చూసిందామె. ప్రాణాలన్నీ చూపులలోపెట్టి క్షేమమా అని పలకరించాడతడు. మహారాజు కుమార్తెగా ఎన్నడూ ఎరగని సౌఖ్యానికి లోనయింది.

ఇక గుడిలో చెక్కుతున్న శిల్పాలను అతడేం చూపించాడో, ఆమేం చూసిందో భగవంతునికే తెలియాలి. ఇద్దరి మనసులతోనూ అనిర్వచనీయమైన ఆనందం పరవళ్ళు త్రొక్కుతోంది.

"మరే, మాణిక్యం నాకీవైపు శిల్పాలు చాలా బావున్నాయి. ఇటు వచ్చి చూపించవూ!"అని గుడి వెనుకవైపుకి దారితీసింది వకుళ.

ముఖ మండపంలో రామప్ప రుద్రమలిద్దరేమిగిలారు గబుక్కున ఆమె చేయి పట్టుకొని పక్కనున్న తోటలోకి లాక్కుపోయాడు రామప్ప.

"నిన్ను చూడకుండా బ్రతకలేను, రామప్పా" అన్నది రుద్రమదేవి.



"నేనుమాత్రం ఉండగలనా నిన్ను చూడకుండా?" అన్నాడు అతను

"ఇదేమిటీ తపన—నిన్ను ఎన్నిసార్లు చూశానని మనకి ఎంత పరిచయం ఉందని ఒక్కసారేగా—అట్లతదియ రోజు చూశానూ అయినా నిన్ను వేల సంవత్సరాలుగా ఎరిగి ఉన్నట్లుందేం"

అవును మరి మన పరిచయం ఈ జన్మదైతేగా,"

"ఆ(..."

"ఔను కొన్ని కోట్ల సంవత్సరాల క్రితంది. ఈ భూమి పుట్టక ముందే మనం పరిచయమయ్యాం. అప్పటి మననిట్టూర్పులలోంచే మలయ మారుతం రూపు దిద్దుకుంది మన నవ్వులలోంచి వెన్నెల పుట్టింది. మనతోనే ప్రపంచంలో ప్రణయ శబ్దం ప్రారంభమయింది. ఇదేం నీకు తెలియదు కదూ. ఉత్త పిచ్చిపిల్లవు సుమా" అంటూ భావోద్వేగంతో ఒంగి ఆమె మెడమీద తన నుదురు ఆనించబోయినాడు.

బెదురు బెదురుగా చూసిందామె. గాలివానలో నాగవల్లి తీగలాగా వణికిపోయింది.

"అంత భయమెందుకోయ్ లీలాహరిణేక్షణా? ఓహ్ అంతచక్కని కళ్ళు బెదిరిపోతుంటే ఎంత బావున్నాయో" అంటూ దగ్గరికి రాబోయాడు అతను.

వివశురాలయిందా బాలిక. ఒక్క క్షణమే ఆ వెంటనే సంస్కారం ఆమె వెన్నుతట్టింది గబుక్కున దూరంగా జరిగింది.

"పో- నీతో మాటాడను" వెనుదిరిగాడతను.

వీణా నిక్వణంలా ఆమె గొంతు- "కోపం వచ్చిందా?" అని.

మీ తండ్రిగారెవరు" రూక్షంగా అతని గొంతు-

"తండ్రిగారా దేనికి!"గొంతు తడారిపోయిందామెకి-

"తండ్రిగారంటే తడబడుతున్నావు ఏమిటి సంగతి"

"పో- నీతో మాటాడను" గారంగా ఆమె-

పకపకా నవ్వాడతను "పెద్దలంటే భయం భక్తి ఉండాలిగానీ, మరీ ఇంత భయమా ధైర్యం చెయ్యకపోతే మన పెళ్ళి ఎలా అవుతుంది మరి ఉండు .. నేను మా నాన్నగారితో మాటాడుతాను. వారికి చెపితే వారు ఓరుగల్లుకి వచ్చి మీ నాన్నగారితో మాటాడుతారు. నిన్ను మా ఇంటి కోడలిగా చేస్తారు, అప్పుడు ఇదుగో—అప్పుడు ఎట్లా కుదర దంటావో చూస్తాను"

తను ఈ పొదరిల్లు లాంటి ఇంటికి కోడలు కాగలదా. అంత అదృష్టమా తనకి ప్రేమామృతం వర్షించే ఈ ఇంటి మనుష్యులతో కల కాలమూ తను జీవించగలదా, రసహృదయుడూ, కళ స్రష్ట అయిన ఈ యువకుడు జీవితాంతం తనకి నెచ్చెలికాడుగా ఉంటాడా. రుద్రమ మొహం ఎర్ర బారింది ఆ వూహతో,

"ఏయ్ అమ్మాయ్! ఏమిటి ఆలోచన-

"ఏంలేదు—ఏం లేదులే"

"ఔనూ... ఇందాకటినుంచీ అడుగుదామని మరిచిపోతున్నా సొమ్ములు బాగా పెట్టుకొచ్చావే ఎవర్ని ఎరువడిగావు"

"ఆఁ నేనా? సొమ్ములా! ఔనౌను" అని తడబడింది-



"ఏమిటి ఔనౌను... నీ మొహం! ఇందాకట్నించీ చూస్తున్నా నిన్నూ నీ ముద్దొచ్చే తడబాటునీ! ఇక ఆగలేను దేవి కటాక్షించాలి సిందే"

"ఛీ... ఛీ... అందుకే నీతో మాటాడనన్నాను"

"పోన్లే దూరంగా ఉంటాలే" మూతి ముడుచుకొన్నాడతను.

"సొమ్ములూ... ఇవి మా వకుళవి! ఔను వకుళవి నాకు సొమ్ము లిష్టమని తనవన్నీ నాకు పెట్టేసింది నేనేమో తన వేషం, తనేమో నా వేషం వేసుకున్నాము"

"వేషమేమిటి?" సాలోచనగా అడిగాడు అతను-

అబ్బెబ్బే వేషంకాదు... కాదు... నిజమే కాదు కాదు వేషమే కాదు కాదు...."

"నిజమే" అని పూర్తిచేసి "ఏమిటా పిచ్చి వాగుడూ" అని పడీపడీ నవ్వాడు రామప్ప.

"సరే పద! వాళ్ళు మనకోసం ఎదురుచూస్తున్నారేమో! చాలా సే పైనట్లుంది మన మిక్కడికి వచ్చి. ఇద్దరం ఇంతదూరంగా కూచుని మరీ చెప్తున్నాం- సరే పద" అంటూ దారి తీశాడతను.

ముందు రామప్పా, వెనుక తల వంచుకుని రుద్రమా వస్తుంటే

8)

కళ్ళార్పకుండా చూసింది వకుళ. ఎంత చక్కని జంట? చక్రవర్తి వీళ్ళ పెళ్ళి జరిపిస్తారా: ఎప్పుడూ తల ఎత్తి నడవటం తప్ప వంచి నడవటం నేర్వలేదు రుద్రమ. ముందు నడవటమే కాని ఎవరి వెనుకా నడవలేదిం తవరకూ, ఓహూ! ఎంతగా పురుషుడిగా పెంచినా, అతణ్ణి చూసే సరికి అమాంతం జన్మ సిద్ధ గుణాలే వచ్చినై. ఇది కదా పరమేశ్వరుడి మాయ

"ఇదేమిటండోయ్! మీరూ ఆలోచనలో పడ్డారు. ఇందాక మీచెలీ అంతే. కొంపదీసి ఓరుగల్లు అమ్మాయి లందరికీ వేపాకంత వెర్రిగానీ తప్పనిసరిగా ఉంటుందేమిటీ?" అని నన్నగా నవ్వాడు రామప్ప.

ఉలిక్కిపడి ప్రకృతిస్థురాలైంది వకుళ. తనూ నవ్వుతూనే ఏదో సమాధానం చెప్పింది.

"చూడండి వకుళగారూ. ఈవిడగారికి తల్లి దండ్రుల పేర్లు తెలియవట. పోనీ మీ కేమైనా తెలుసా." అన్నాడు రామప్ప!

"తెలుసు. గణపతి దేవ..."అంటూ నాలిక కొరుక్కుని–"గణపతి దేవ చక్రవర్తి కొలువులో ఎవర్నడిగినా చెప్తారు మా గురించి. వకుళ అని అడగండి– నేను తీసికెళతాను వాళ్ళింటికి" అని సర్దేసింది,

విచిత్రగా చూశాడు రామప్ప. ఏం మాట్లాడలేదు కానీ, అతనిలో అనుమానం ప్రవేశించింది. ఈ అమ్మాయిలు ఏదో దాస్తున్నారు ఎందుకో. అనుకున్నాడు.

రుద్రమ్మా, వకుళా, మాణిక్యాంబా, విశాలాక్షి ఉత్సాహంగా మాట్లాడుకుంటూ ఇంటి ముఖం పట్టారు. నలుగురూ ఇంచుమించు ఒకే



వయసు వారవటం వల్ల బాగా కలిసిపోయినారు.

ఇంటికెళ్ళి మంచినీళ్ళు తాగి త్రిపురసుందరితో "వెళ్ళొస్తా" మని చెప్పారు.

ఆవిడ బొట్టుపెట్టి, దొడ్లో కాసిన పళ్ళు చేతిలోపెట్టింది. "మంచి దమ్మా! మళ్ళి ఎప్పుడన్నా రండి. ధనవంతుల పిల్లల్లాగా ఉన్నారు. జాగ్రత్త. దారి అంతా చిట్టడివి, ఈ సారి సొమ్ములు పెట్టుకు రాకండి. ఎందుకైనా మంచిది." అన్న దావిద.

"అబ్బబ్బే ... నేను ధనవంతురాల్ని కానేకాదండీ! అస్సలు కాను గాభరాగా అన్నది రుద్రమ.

"అలాగా" అంటూ రుద్రమ ధరించిన దుస్తుల కేసి ఆభరణాల కేసి ఆశ్చర్యంగా చూసిందావిద.

"అబ్బే... ఇవన్నీ నావికావండీ! వకుళవి" అంది తత్తరపాటుగా రుద్రమ.

"కానండీ! ఎప్పుడూ ఇలాంటి బట్టలు కట్టుకోలేదంటే ఇచ్చానండీ సొమ్ములుకూడా అంతేనండీ। చంద్రహారాలు, పాపిడి పిందెలు పెట్టుకోవ డానికి తనకు కుదరదు కదండీ మరి" అంది వకుళ యువరాజా వేషంతో కుదరదని ఆమె ఉద్దేశ్యం.

"ఎందుక్కుదరదూ?" అందావిద.

"అదే...అదే లేవు కదండీ మరి."

మరి మరి అని చంపుతున్నావు కనిపెట్టేస్తుంది జాగర్త అని చెవిలో గొణిగింది రుద్రమ.

"ఏమిటేమిటీ! మీరిద్దరూ చెవులు కొరుకుంటున్నారు?" అనిఉత్సాహ పడింది మాణిక్యాంబ

"ఇటు రావోయ్! నీ చెవులు కూడా కొరుకుతాం కావలిస్తే" అంది వకుళ.

"ఏది కొరకండి చూస్తాను. నన్నేమైనా చేస్తే మా చిన్నన్నయ్య ఊరుకుంటాడా?" అంటూ వచ్చింది మాణిక్యాంబ నవ్వుతూ.

"ఏం లేదు .. మీ అమ్మగారు చాలా మంచివారంటుంది కుమారి" అంది గుసగుసగా.

"జాన్లేమ్మా! నీకే ఉన్నాడు మహాఅన్నయ్య! చేతిలోసుత్తి కళ్ళలో ఆలోచనలున్నూ" అంది ఉడుకుంటూ రుద్రమ.

కిలకిలా నవ్వింది మాణిక్యాంబ.లోపలికి వెళ్ళిమినపసున్ని ఉండలు నాలుగు తెచ్చి. "దారిలో తినండి" అని ఇచ్చింది త్రిపురసుందరి.

"ఇంతకీ మీఅన్నగారేం చేస్తారమ్మా?" అనిఅడిగింది రుద్రమని.

"రా...రా" గుణింతాలు నేర్చుకుంటున్నట్లుగా అంది రుద్రమ మొహానికి నవ్వుపులుముకుని- "అదేనండీ రయితు అన్నమాట" అనీ వకుళ అర్థం రాకపోతే- "రాజుగారు" అని చెప్పేసేదే యధాలాపంగా రుద్రమ.

"దొంగలండీ...దొంగలు."



"ఆఁ ఏరి- ఎక్కడా దొంగలు" అంటూ అంతా అటూ ఇటూ చూశారు.

"అదికాదండీ. దార్లో దొంగలు పడతారేమో నని భయంతో మేమిట్లా తలా తోకా లేకుండా మాట్లాడుతున్నాం అంతే" అని నవ్వేసింది వకుళ— ఇహీహి అని.

"మంచి చమత్కారులే ఇద్దరూనూ...ఎలాంటి మొగుళ్ళు వస్తారో కాని" అందావిడ.

సిగ్గుపడి,"ఇంక వెళ్ళొస్తామండీ" అని మాణిక్యాంబకీ, విశాలకీ కూడా చెప్పి పల్లకీ ఎక్కారు ఇద్దరూ. ఏదీరామప్ప రాడేం!మళ్ళీఎన్నాళ్ళ కో పునర్దర్శనం: వీడుకోలు లేకుండా కదల లేకపోతున్నది రుద్రమ. అయోమయంగా చూస్తుందిఅటువైపే! ఒక టడిగితే ఒకటి చెప్తున్నది.

జబ్బమీద చిన్నగా గిల్లింది వకుళ. యధాలాపంగా ఉన్నదేమో కెవ్వుమన్నది రుద్రమ.

ఏమైం దేమైందని చుట్టూ మూగారందరూ. రామప్పా అతనిఅన్న శ్రీహరీ కూడా వచ్చారు—వీరాచార్యులతో సహా.

"ఆఁ ఏం లేదండీ! వీపుమీద చీమ ఉంటే దులిపా అంతే" అంది వకుళ.

"ఇందాకట్నుంచీ తోటలో,దొడ్లల్లో తిరిగితిరి మరి"అందిసుందరమ్మ

"ఆడపిల్లలు కాస్త జాగర్తగా తీసుకెళ్ళండయ్యా వెంటతోడుకూడా ఎవ్వరూ లేరు" అని పల్లకి బోయీలకి చెప్పాడు వీరాచార్యులు...

"పోనీ మన చిన్నబ్బాయిని కాస్తదూరం వెళ్ళి రమ్మందామండీ!" అంది సుందరమ్మ.

సంతోషంగా ఒప్పుకున్నాడు రామప్ప. రుద్రమ ముఖం వికసించింది.

"ఏమిటో! నాకు వచ్చి పడింది. ఈ మహానుభావు లిద్దరూ ఇట్లా మమైకం అయిపోయినా మర్యాద మంటగలపరు కదా నా మెడమీద తల కాయ ఇహ ఎన్నాళ్ళో ఉండదు ఇట్లా అయితే" అనుకుంది వకుళ. ఆమె కప్పుడు తన బావ గుర్తొచ్చాడు.

నగరానికి చేరేసరికి_

గణపతి దేవ చక్రవర్తీ, అతని ఏడుగురు రాణులూ ఆదుర్దాగా ఎదురు చూస్తున్నారు. అప్పుడే మహామంత్రికి కబురు వెళ్ళింది, జాయప సేనాని కొంత సేనావివహాన్ని ఏర్పాటు చేస్తున్నాడు_ రుద్రమని వెతక టానికి.

ప్రాసాదిత్య నాయకుడు రుద్రమ దేవి మిగిలిన చెలులని ప్రశ్నల మీద ప్రశ్నలు వేస్తున్నాడు_ ఆమె వెళ్ళిన ప్రదేశం గురించి.

"అమ్మయ్య... వచ్చారా? ఏమిటి,వకుళా ఇంత ఆలస్యం చేశావు. నిన్ను నమ్మి యువరాణులను పంపాను" అన్నాడు గణపతిదేవుడు.

"కాదునాన్నగారు నేనేఆపాను వకుళ వెళ్దామని తొందర చేస్తుంటే ఆ ప్రాంతంలో కోయపల్లె ఉంది. వాళ్ళలో చాలామంది వీరులున్నారు. వాళ్ళని మన సైన్యంలో చేర్చుకుంటే బాగుంటుందనిపించింది" అని విన్న వించుకుంది రుద్రమ



చక్రవర్తి చాలా సంతోషించాడు. తన బిడ్డ విహారాలకి వెళ్ళినా రాజ్య రక్షణ గురించీ_ఆలోచిస్తున్నది గదా అని. "అలాగా అక్కడికి రేపే మన మేచయ నాయకుణ్ణి పంపుతా."

"అలా కాదు, నాన్నగారు. సైన్యమంటే ఆ కోయలకి భయం. స్వేచ్ఛందంగా ఉండాలను కుంటున్నారు వాళ్ళు. నేనూ, వకుళా వెళ్ళి వారిని ప్రచ్ఛన్నంగా పరిశీలించి, అర్హులైన వారిని ఎలాగో నచ్చజెప్పి తీసు కొస్తాము. సైన్య విస్తరణ కైనా తోడ్పడనివ్వండి, నాన్నగారూ" అని బతిమాలింది రుద్రమ. తండ్రిసరేననేదాక వదల్లేదు,

మరో వారంలో వకుళా, రుద్రమా మళ్ళీ బయల్దేరారు. రామప్ప కుటుంబానికి బహూకరించడానికి విలువైన కానుకలు సిద్ధంచేసిందిరుద్రమ దేవి.

"బాల్చాలు, రాకుమారీ, నీ కేమయినా మతి పోయిందా? ఒక సామాన్య రైతు బిడ్డవి నువ్వు_ఇవి తీసుకెళ్తే ఎలా ఉంటుంది:" అని మందలించింది వకుళ.

"మరి" అని బిక్కమొహం వేసింది రుద్రమ.

"నే చెప్తానుండు, మానాన్నేమో నేత బట్టల వ్యాపారం చేస్తాట్ట_ నేను కొని తెచ్చానని వాళ్ళకి చెప్ప మంది వకుళ.

ఓరుగల్లు నేతపనికి ప్రసిద్ధి పొందింది. పిడికిటిలో ఇమిడిపోయే సన్నని నూలు బట్టలు నేసేవారు, రెండు బావజ తిలకం చీరలూ, రెండు పరికిణీలూ, ఒక బుట్టనిండా పళ్ళు, ఒక ముత్యంతో చేసిన ఖరీదయిన ఉంగరమూ తీసుకుని ప్రయాణమయ్యారు. రుద్రమదేవికి ఒళ్ళుతెలియని

ఆనందంగా ఉంది. ఏమిటా అరమోడ్పు కన్నులూ। రామినామ స్మరణే నా," అని పంహాసాలు చేస్తూంది వకుళ.

వాకిట్లోకి రాగానే ఎదురొచ్చి కౌగిలించుకుని, లోపలికి తీసుకెళ్ళింది మాణిక్యాంబ ఆప్యాయంగా ఆదరించారు వీరాచార్యులు, సుందరమ్మ విశాలకి వేవిళ్ళు. ఆవేళ లేవకపోయినా, వీళ్ళు వచ్చారని తెలిసి లేచి వచ్చింది. ఆరోజు రుద్రమకి పండుగలా ఉంది. తల్లులు వేరేభవనంలో తండ్రి వేరేభవనంలో, తను వేరే భవనంలో ఉంటూ— మీరు, తమరు అని సంబోధించుకుంటూఅత్యంత కృతకజీవితం గడిపే పిల్లకి ఈఇల్లు వల్లమాలిన ఇష్టమైంది.

ఒక వారం పదిరోజులు వాళ్ళిద్దరూ తమ ఇంట్లో ఉండి చుట్టు ప్రక్కల ప్రదేశాలన్నీ చూస్తామనటం ఆఇంటివారికి ఆనందహేతువైంది ఆడపిల్లలు మగ్గురూ భోజనం చేస్తుంటే సుందరమ్మా, విశాలా వడ్డించారు అది పూర్తి శాకాహారం ఆ వంటలు రాజకుమారికి ఎంతో రుచికరంగా ఉండేవి. నూనె గోంగూర, కరివేపాకు కారం, మామిడికాయ పప్పు, గుమ్మడికాయ పులుసు ..చాలా బాగా వండుతుంది సుందరమ్మ. రుద్రమ తెచ్చిన చీరలను చూసి ఆశ్చర్యపోయారంతా.

"అమ్మోయ్! చాలా బాగున్నాయే.. ఇవి నేనెప్పుడూ చూడనుకూడా లేదమ్మా ఇలాంటివి" అని మురిసిపోయింది మాణిక్యాంబ.

"ఛీ మొద్దు! అవక్కడ పెట్టు. ముట్టుకోకు... మాసిపోతాయి.నువే కాదు, నేనూ ఎప్పుడూ చూడలేదు ఇలాంటివి" అని సుందరమ్మ.

"మీ కోసమే తెచ్చాం... తీసుకోండి" అంది రుద్రమ్మ



"ఊహుం .. వద్దమ్మా। మీకే మేమేమన్నా పెట్టాలి గాని మీరిస్తే మేము తీసుకోవడ మేమిటి_ తప్పుకదూ?" అందావిడ.

"ఊరికే వద్దులేండి. మా నానగారు బట్టల వ్యాపారం చేస్తారు. విదేశాలకన్కూడా వెళతారండి మోటుపల్లి రేవులో నౌకఎక్కి నాలుగయిదు తడవల్లో వీటి డబ్బు ఇచ్చేద్దురు గాని లెండి. చవగ్గా వస్తాయి గదా అని తీసుకొచ్చాను. బట్టల వ్యాపారం నేనుకూడా చేస్తున్నాననుకోండి పోని" అంది వకుళ.

"ఔనమ్మా .ఇంకో రెండుమూడు నెలలలో మా కోడలికి సూడిద రిస్తారు. అప్పుడు మీరుతప్పకుండా రావాలమ్మా ఆతరువాత మేమిక్కడ బట్టలు కొనుక్కుని చందవోలు వెళ్ళి సూడిద లిచ్చి రావాలి, ఎలాగూ బయట కొనే బదులు ఇక్కడే కొంటాములే ఇదిగో ఈ పాముకుబుసం లాంటి తెల్లని జరీ చీర మా కోడలికి పెడతాను. అని సంతోషపడింది సుందరమ్మ.

"చందవోలా మీ కోడలి పుట్టిల్లు. అంటే అది వెలనాటి రాజధాని_ చోడుడిదేగా ఆ సైన్యాధిపతి ప్రస్తుతం శక్తిలేని వాడు. అసలు వాళ్ళ కాల్బలం..."

రుద్రమ మాట్లాడుతుంటే నోరువెళ్ళబెట్టి చూశారు వాళ్ళు రుద్రమ నొక్కపోటు పొడిచింది వకుళ ఆమె చేతిమీద_మాట్లాడటం ఆపేసెయ్యి అన్న సూచనగా.

"ఆ వెలగనాడూ చోడుడూ, కాల్బలమూ...ఇవన్నీ ఈ పిల్లకెలా

9)

తెలుసా అవి ఆశ్చర్యపోతున్నారు కదూ. ఈ మధ్యన మా నాన్నగారి దగ్గరికి ఆ వెలనాటి మహారాజు పట్టుచీరల కోసం, భావజతిలకాల కోసం కబురు పెట్టారులెండి. ఈ కుమారి నా ప్రాణ స్నేహితురాలు, ఎప్పుడూ మా ఇంటనే ఉంటుంది. అప్పుడు తెలిసింది ఈ రాజుల పేర్లు" అన్నది.

అప్పుడు తెలిసింది రుద్రమకి తన పొరబాటు వకుళ వైపు వేయి కృతజ్ఞతలు పొంగేట్టు చూసింది.

ఆ పది రోజులూ రుద్రమ రామప్పతో జరిపిన వినోద విహారాలు వనదేవతకి కనుల పండుగలైనాయి. అర్థం పర్థం లేకుండా ఎన్ని వేల కబుర్లు చెప్పుకున్నారో వారికే తెలియదు. దూరం దూరంగానే మసలినా సామీప్యమే ఆనందంవారికి.

రోజుకో పల్లెకి వెళ్ళి రావటం నూతన సైన్యం ఏర్పరచటంతో వకుళ దుంప తెగింది. ఇక తిరిగి రాజధానికి వెళ్ళేరోజు రుద్రమకన్నీళ్ళు పెట్టుకుంది "ఏమిటో పిచ్చి పిల్లలు సొంత పిల్లల్లా కలిసిపోయారు. మా కోడలి సీమంతానికి తప్పక రావాలమ్మా" అని బొట్టుపెట్టి వస్త్రం,రవికల బట్టా పెట్టి సాగనంపింది సుందరమ్మ.

"నా అనుమానం నిజమే అయితే, ఆ పిల్లలు సామాన్య స్త్రీలు కారు. కుమారి అన్న పిల్లకి మహారాణుల కుండే ఠీవి ఉంది. మొన్న ఏదో సందర్భవశాత్తు ఆమె చెయ్యి చూశాను. నా అనుమానం అప్పుడు నిజమైంది. ఆమె అగర్భ శ్రీమంతురాలు. రాజ్యాలు ఏలగలదు. అసలు అటువంటి హస్తం స్త్రీలకు ఉండటమే ఆశ్చర్యం కత్తి పట్టడంలో నేర్పుగల బాహ్య లక్షణాలను బట్టే తెలుస్తుంది. ఇంకో చిత్రం గమనించావా? మన



చిన్నబ్బాయి చెక్కుతున్న శిల్పాలు ఆ పిల్లలాగే ఉన్నాయి" అన్నాడు. వీరాచార్యులు రాత్రి భోజన సమయంలో భార్యతో.

"ఆఁ.. ఏమిటండీ మీ రంటున్నది?" అని నోరావలించింది సుందరమ్మ.

"మెల్లిగా... మెల్లిగా! పిల్లలకి తెలియనీయకు ఈ సంగతి ఆ పిల్ల ఏ చక్రవర్తికూతురో అయి ఉంటుంది. ఎందుకో మనింటి కొచ్చింది" అన్నాడు వీరాచర్యులు.

"ఒకవేళ గణపతిదేవ చక్రవర్తి కూతురు కాదుకదా?" అన్నది సుందరమ్మ.

"ఆఁ కానీ ఆయన కూతురు గణపాంబకి పెళ్ళిచేసి ధరణి కోట పంపాడుగదా"

° ° ° °

"నూతన సైన్యాన్ని సమీకరించుకు వచ్చిన భావి యువరాజు వీర రుద్రదేవులుగారికి స్వాగతం" అన్నాడు గణపతిదేవుడు,రుద్రమని చూసి.

"నాన్నగారూ" అంటూ ఏదో చెప్పబోయింది రుద్రమ.

"చాలమ్మా! నా కేం చెప్పనక్కరలేదు, అంతా తెలిసిపోయింది"

"తెలిసిపోయిందా" అంటూ భయంతో నిట్టూర్చింది రుద్రమ.

"ఎందుకు తెలియదూ? ఆ కోయ సైన్యాన్ని సమీకరించటానికి ఎంత కష్టపడ్డావో తెలియదా మాకు" అన్నాడాయన.

"అమ్మయ్య" అనుకుందామె.

కర్నూలు మండలంలోని సామంతులు తిరుగుబాటు చేస్తున్నారని వార్తవచ్చింది. గుండయ సేనాని, జన్నిగదేవసాహిణి, పోతినాయకుడు వాళ్ళ మీద దిగ్విజయ యాత్రకు వెళ్ళబోతున్నారు.

తరవాత ఇటు..."వెలనాటి చోడుడు కూడా విజృంభిస్తున్నట్లు వార్త వచ్చింది. యువరాజువారు తగిన సైన్యంతో వెలనాటి మీదకు దండెత్తవలసి ఉంటుంది"అని వెల్లడించాడు గణపతిదేవుడు "ఇది మీరు చేయవలసిన ప్రథమ దిగ్విజయ యాత్ర" అని హెచ్చరించాడుకూడా.

"నాన్నగారూ.. నాన్నగారూ"అని తరతరలాడిపోయిందిరుద్రమ రామప్పకి దూరంగా వెళ్లాలని.

"రాజ సౌఖ్యాలతోబాటు బాధ్యత కూడా పెంచుకోవాలి యువరాజులు ఇది క్షాత్ర ధర్మం"అని మరోమాట మాట్లాడనివ్వకుండా వెళ్ళిపోయాడు గణపతి దేవుడు. అప్పటికి రుద్రమ సర్వ విద్యలూ ఆకళింపు చేసుకున్నది కాని, మనస్సులో అంతటి పౌరుషం లేదు. ఇప్పుడే చందవోలు దండయాత్రకి అద్దె సుముఖంగా లేదు. ఆలోచనా మందిరములో ఒక్కత్తే ఆలోచిస్తుంది

అంతలో వకుళ పరుగెత్తుకొచ్చింది "అమ్మా.. అమ్మా, చెప్పడానికి నోరు రావటం లేదమ్మా" అంటూ రుద్రమ ఎంతో సమాధాన పరిచి అడిగిన తరువాత వకుళ గొంతు పెగిలింది... "మహారాజా వారికి తమ ప్రణయ వృత్తాంతం అంతా తెలిసిపోయింది. యుద్ధం వంకతో తమని దూరంగా చందోలు పంపించి ఇక్కడ రామప్ప కుటుంబాన్ని చిత్రహింసలుపాలు చేయ తలపెట్టారమ్మా. అందులో రామప్ప...



రామప్ప కళ్ళు పీకేయించమన్నారట. ఈ సంగతి మా బావ ఎల్లన రహస్యంగా కనుక్కొని నాకు చెప్పాడు" అన్నది.

మాటలు పూర్తి కాకముందే స్పృహ తప్పిపోయింది రాకుమారికి ఆమెను మిగతా చెలులకు అప్పగించి తను బావదగ్గిరకి పరుగెత్తింది. "ఏం చేద్దాం బావా! మాచెలి తట్టుకోలేక స్పృహతప్పి పడిపోయింది"అని కన్నీళ్లు పెట్టుకుంది.

"పురుష విద్యా ప్రవీణురాలివి స్థిర చిత్తవు బెంబేలు పడిపోకు కామసాపీ సరే నేనుపోయి శివదేవయ్యగారిని పిలుచుకొస్తానుండు ఇప్పుడాయనే గతి" అంటూ చకచకా వెళ్ళిపోయాడు ఎల్లన.

హుటాహుటిగా రాకుమారి అంతఃపురానికి వెళ్లారు శివదేవయ్య దేశికులు "అమ్మా...అమ్మా ఏమిటి తల్లీ" అని ఆమె శిరస్సును నిమిరారు ఓదార్పుగా.

రుద్రమకి దుఃఖం వచ్చింది. కక్కటిల్లిపోయింది.

శివదేవయ్యగారు గాభరపడారు. "ఏమిటమ్మా ఏమైంది చెప్పు ధైర్యం మేరు వయిన కాకతి సార్వభౌముల గారాబు బిడ్డవు..."

"అందుకేనండీ ఇంత కష్టం వచ్చింది". వకుళ మంత్రిగారితో అంతా చెప్పింది.

"భయం లేదమ్మా" అని ఆమెని ఓదార్చి ఆలోచనలో పడ్డారు రాజ గురువులు శివదేవయ్య దేశికులు.

"అమ్మా నన్ను క్షమించు తల్లీ వ్యక్తిగత శ్రేయస్సు కోసం తప్పు పాటు పడవని నా విశ్వాసం అతనితో నీ వివాహం జరపటం

అసంభవం. పంచ ప్రాణాలు నీమీద పెట్టుకొని పెంచిన నీ కన్న తండ్రి సంగతికూడా ఆలోచించు. సాటి రాజకుమారుడికిచ్చి కానీ నీపెళ్ళిచేయరు చక్రవర్తి నిన్ను ప్రేమించిన నేరానికి అతని కుటుంబం మొత్తాన్ని చిత్రహింసలపాలు చెయ్యమని ఆయన శాసించారంటే..."

రుద్రమ దేవి చెవులు మూసుకుంది. ఆపైన వినలేక "ఇప్పుడు నన్నేం చెయ్యమంటారో చెప్పండి మహాత్మా, నేను రాజకుమారినని ఆ అమాయకుడికి తెలీనే తెలీదు. అసలు తప్పునాది తన శిల్పలోకంలో తానున్న అతన్ని నేనే... నన్ను శిక్షించండి అతని కళ్ళు కాదు పీకవలసింది నా కళ్ళు. ఆ కుటుంబాన్నికాదు-నన్ను చిత్రహింస చెయ్యండి"

"పిచ్చి తల్లి ఆవేశపడకు" అన్నారు శివదేవయ్యగారు జాలిగా.

"ఆవేశపడక ఏం చెయ్యమంటారు. గురుదేవా! మీకు నమస్కరించి వేడుకుంటున్నాను. మీరు తప్ప రాజశాసనాన్ని మార్చగల మానవుడులేడు. వాళ్ళ తప్పేంలేకుండా ముచ్చటయిన ఆ కుటుంబాన్ని బలి చేయకండి వాళ్ళని కాపాడండి నా రామప్పని అంధుడ్ని చేయకండి నా జీవితంలో నేను మిమ్మల్ని కోరే మొదటి కోరికా, చివరికోరికా ఇదే ఇంక నా కేం అక్కరలేదు" అంటూ చేతులు జోడించింది రుద్రమదేవి

"ష్ మెల్లిగా.. మెల్లిగా గోడలకు చెవులుంటాయి ఇకనుంచీ అతను నీ రామప్పకాడు. ఇటుపై ఇంకెప్పుడూ అతన్ని కలుసుకోవుగా? ఈసారికి నేను వాళ్ళని కాపాడగలను రెండోసారి నే నేం చేయలేను" అన్నారాయన.

గుండె ద్రవించి పోతున్నా పైకిమాత్రం కఠినంగా "రామప్పని



ఇంకెప్పుడూ కలుసుకోకూడదా? అవును ఈసారికలుసుకుంటేఖచ్చితంగా అతన్ని చంపేస్తారన్న మాటేగా ఇప్పుడు కాపాడ గలుగుతున్నా మంత్రిగారి దయవలన ఇదేచాలు. అతడు చిరాయుష్షుగా బతకనీ ఈ సౌభాగ్యులాలిని మరిచిపోనీ.

"రాకుమారీ" అని మృదువుగా భుజం తట్టింది,వకుళ.

తన బాధను లోలోపలే అణచుకుంటూ తెప్పరిల్లింది రుద్రమదేవి. అతి కష్టంమీద సంభాళించుకుంది. అనేక విధాలుగా సమాధాన పరుచుకుంది. అప్పుడు మాటివ్వ గలిగింది "సరే మహాత్మా! నా కర్మ నెవరు తప్పించగలరు? నా తండ్రిగారు దయాసముద్రులనుకున్నాను నేనడిగే ఈ చిన్న కోరిక తీర్చలేరా అనుకున్నాను పొరపాటు పడ్డాను ఇప్పుడీ కరకు రాచరికానికి బలవుతున్నాను ఆ బీద శిల్పి రామప్పను బతికుండగా చూడను ఈ రాజకుమారి త్వరగా వెళ్ళి అతన్ని కాపాడండి శిక్ష అమలు జరుగుతున్నదో ఏమో దివ్య శిల్పసృష్టి చేసే అతని కళ్ళని కాపాడండి చరిత్రలో అతనిపేరు అజరామరం కావాలి" అన్నది.

అప్పటికే శివదేవయ్యగారు లేరక్కడ శిక్ష రద్దుచేయించటానికి వెళ్ళారు.

ఇదంతా తెలుసుకున్న గణపతి దేవుడు నిట్టూర్చడం మినహా ఏమి చేయలేక పోయినాడు. మొద్దుబారిన మనస్సుతో చందవోలు దండయాత్రకీ మేనమామ అయిన జాయప సేనానితో బయలుదేరింది రుద్రమదేవి. వడికము గొప్పసేపుడుకూడా వెంటవెళ్ళాడు. అప్పటిదాకా కాస్తలో కాస్తయినా ఆడపిల్లగా ఆలోచించే ఆమె ఇప్పుడు సంపూర్ణ పౌరుషం అలవరచుకుంది. లేకపోతే భీకరమైన యుద్ధములో పాల్గొనేదే కాదు. ఆమె

తన్న కలలు గాలిమేడలయ్యాకనే ఆమె లాలిత్యం మొగ్గలోనేతుంచి వేయబడ్డాకనే జీవితాన్ని కరకు కత్తుల కణతలకు అంకితంచేసింది.

కోరుకున్న యువకుడ్ని వరించలేని అభాగ్యురాలయినా యుద్ధానికి వెళ్ళిన ప్రతిచోటా విజయాన్నే వరించగలిగింది.

తన ముద్దుల పట్టి వివాహం అనుకున్నంత వైభవంగా జరపలేదనీ, ఆమె కిష్టమైన వ్యక్తితో జరపలేదని, తరవాత వ్యధ చెందసాగాడు గణపతి దేవుడు. కానీ చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏం లాభం?.

"యువరాజులకు జయము" అంటూ లోపలికి ప్రవేశించాడు గోన గన్నారెడ్డి.

"గన్నారెడ్డీ! ఏమిటి సంగతి?" అని అడిగింది రుద్రమదేవి. అధికారులతో, సఖులతో అందరితోనూ నోరారా మాట్లాడుతుందామె. అందరి సంగతులూ అడిగి తెలుసుకుంటుంది. అవసరమైన సహాయం చేస్తూంటుంది.

"మన్నించండి! మల్లిదేవుడు తప్పించుకుని పోయినాడు" అన్నాడు గన్నారెడ్డి. కఠినమైన కాపలా గల కరాగారం నించి ఎవరయినా తప్పించుకో గల్గాలంటే మన వాళ్ళు ఎవరో సహాయపడి ఉండాలి. అంటే ఎవరో రాజద్రోహులు రాజభటుల రూపంలో కీలక స్థానాల్లో ఉన్నారన్న మాట. అవునూ, గన్నారెడ్డీ! కారాగార రక్షణాధికారి మాదయ నాయకుల గురించి మీ అభిప్రాయం?" అన్నది రుద్రమదేవి.



"అవును. నేను పరిశోధించి ఆ విషయం కనుక్కుంటాను" అన్నాడు గన్నారెడ్డి.

సర్వ సైన్యాధిపతి అంబదేవుడు ప్రవేశం కోరాడని ఒక పరిచారిక వచ్చి చెప్పింది.

"రమ్మని చెప్పు" అన్నది రుద్రమ.

"యువరాజా! రాజేంద్రచోళుడు మరికొందరు చిన్న రాజులతో కలిసి దక్షిణాన కర్నూలు మండలంలోని త్రిపురాంతక. శ్రీశైల ప్రాంతాలపై దాడి జరుపబోతున్నారట. మన వేగిరావు టపాలో గూఢచారులు వార్త పంపారు" అన్నాడతను.

రుద్రమదేవి కనుబొమలు ఎర్రబడినాయి. వెంటనే మంత్రి, సామంత, దండనాధులతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసింది.

"దేశ భక్తులారా! ఆప్తమిత్రులారా! మీ శక్తి సామర్థ్యాలు నిరూపించుకోవటానికి సిద్ధంగా ఉండండి.

రాజేంద్రచోళుడు సైన్యం సమీకరించుకొని మన పైకి వస్తున్నాడట. చెరనుంచి తప్పించుకుని పోయిన మల్లిదేవుడూ ఊరుకోడు. అతడు పల్లవ కొప్పెరుంజింగణ్ణీ కాకపోతే. ఏ శత్రువునైనా, సరే శరణు వేడగలడని నా ఊహ. మీ అభిప్రాయమేమిటి?" అనిఅడిగింది రుద్రమదేవి.

కొంతసేపు చర్చలు జరిగాక చివరకు అందరూ ఇలా అన్నారు. "యువరాజు వీరరుద్రదేవుల ఆనతిని శిరసావహిస్తాము. శత్రువులను

ప్రతిఘటించడానికి మేము సిద్ధం. మా ఒంట్లో ఆఖరి రక్తపు బొట్టుచిందే దాకా, కాకతీయ సామ్రాజ్య రక్షణకే పాటుపడతాము కడ ఊపిరి పీల్చేదాకా దేశ స్వాతంత్ర్యాన్ని పరిరక్షిస్తాము. విజృంభించిన శత్రు సేనావాహినికి కాకతీయ సైన్యం చెలియలికట్ట కాగలదు" అని ముక్త కంఠంతో చెప్పారు.

రుద్రమదేవి దృష్టి వారిమీద లేదు. ఆమె భృకుటి ముడిపడింది పక్కనే ఉన్న వకుళ సాలోచనగా పెదవి మునిపంట నొక్కుకుంది. కారణం సామంతులలో ఒకడైన వీరభద్రుడు ప్రమాణం చెయ్యలేదు. అదే ఇంకొకరయితే ఈపాటికి కారాగారం లోపల ఉండేవారు.

రుద్రమదేవి అంతరంగానికి దగ్గరగా ఉన్న మంగళసూత్రాలు స్పందించినాయి. మిగిలిన సర్వ పటాలమూ ఏం చెయ్యాలో తెలియక బొమ్మల్లా ఉండిపోయినారు. ఈ అవిధేయతకు లోపల ఉడికిపోతున్నా రాణిగారి భర్త కనుక ఎవ్వరూ నోరెత్తలేదు. ఒక్క నిమిషం సూది కింద పడితే శబ్దం అయ్యేంత నిశ్శబ్దం రాజ్యం చేసిందక్కడ.

శక్తినంతా కూడ దీసుకుని "చాళుక్య వీరభద్రుల వారి ఉద్దేశం?" అని తీక్షణంగా ప్రశ్నించింది రుద్రమ.

"ఏముంది? సభా నిష్క్రమణం" అంటూ ఆ భవనంలో నుంచి వెళ్ళిపోయినా డాయన.

దండనాథులూ, రాజ్యమూ లస్తంభాలూ. రుద్రమాంబిక ఉభ భుజాలూ బోనులో పెట్టినసింహాల మాదిరి రవరవడిపోలాయినారు. అ దునా, తమాయించుకున్నారు రాణిగారిది పక్షపాత దృష్టి కాదని.

సభ చాలించి వెళ్ళి దుస్తులు మార్చుకోకుండా మంచం మీద వాలింది.



"ఎంత పని చేశారు వీరభద్రులు? అందరిముందూ అవమానించినందుకు కాదు బాధ. ఈ అవమానం ఆంధ్ర సామ్రాజ్యలక్ష్మికి అపకారం కాదా. ప్రభూ! రాజ్యం కోసమేగా మీ తపన. రాజ్యం ఇవ్వటానికేమంది? నిక్షేపంగా ఇవ్వవచ్చు. కానీ, పదవీతృష్ణ, రాజ్యకాంక్ష, అధికార లాలన తప్ప మీకు దేశ క్షేమం అక్కరలేదే! ప్రజాక్షేమమూ ధర్మ రక్షణా ముఖ్య కర్తవ్యాలు కానప్పుడు రాజ్యయోగ్యత ఎక్కడుంది? ఒక హక్కును అనుభవిస్తున్నామంటే దానికి రెట్టింపు బాధ్యతను భరించాలండీ అందులో రాచరికం చాలా కష్ట సాధ్యమయిన విటీయం అసిదారావ్రతం ఒక్క నిదదవోలు రాజ్యం కాపాడుకోవటం చేతకాని మీరు సువిశాల కాకతీయ రాజ్యాన్ని ఎట్లా పాలిస్తారు? మిమ్మల్ని భర్తగా గౌరవిస్తే గౌరవించవచ్చు. కానీ, ఒక సామంతుడుగా ఈ అవినయాన్ని నేను సహించను. వ్యక్తి సుఖం కన్నా సామాజిక క్షేమం ముఖ్యం- మీకు రాజ్యం లభించలేదన్నంత మాత్రాన దేశాన్ని శత్రురాజుల పాలు చేయటానికి కూడా సిద్ధపడటం క్షంతవ్యం కాని నేరం- రుద్రమ రాజ్యంలో దుష్ట వ్యామోహాలకు తావు లేదు" అనుకుంది.

భర్తని బంధించడం తప్ప వేరేగత్యంతరం లేదు. "ఎవరక్కడ? వెంటనే శ్రీ వీరభద్రులవారిని ...." బంధించమని చెప్పబోయేటంతలో "త్వరగా దయచెయ్యమని చెప్పమా, యువరాణీ!" అంటూ వకుళ ప్రవేశించింది.

చిరాగ్గా చూసింది రుద్రమదేవి.

"ప్రసన్నం కంది, దేవీ! ద్వారం దగ్గిర శ్రీ వీరభద్రుల వారి దివ్య సముఖాన్నించి ఏదో లేఖ వేచి ఉన్నట్లుంది. చూశారా?" అని అడిగింది వకుళ.

"లేఖా? ఏం లేఖ?"

"ఏం లేఖో? నాకేం తెలుసు? ప్రాణేశ్వరుల వద్ద నుంచి వచ్చిన ప్రథమ లేఖ గదా! తమరు చదువుకుని ఆనందించండి."

"వకుళా! పరిహాసాలు కట్టిపెట్టి అవతలికి పో!" అని కసిరింది రుద్రమ.

"పోతా. పోతా! మీ ఉత్తరానికి నేను అడ్డం ఎందుకు వస్తున్నాను? ఇదిగో! చదువుకోండమ్మా" అని చేతిలో పెట్టి తుర్రుమంది వకుళ.

విప్పింది రుద్రమ.

"ప్రాణ ప్రియకు ఆలింగన పురస్సరముగా "వీరభద్రుడు వ్రాయునది.

ఈపాటికి దేవిగారు అలిగే ఉంటారు. నా అవిధేయతకి కినిసి ఉంటారు. కానీ? అయినా, మా ఇల్లాలు మమ్మల్ని అర్థం చేసుకుంటుంది. మాకు మటుకు దేవభక్తి లేదా? ఈ మహా సామ్రాజ్యాన్ని పరాయి వారికి అప్పగింత పెట్టేంత వెర్రివాళ్ళ మా దేవీ, మేము? లేక దుర్మార్గులమా? అర్ధాంగలక్ష్మీ! పదుగురు సామంతుల ముందూ, అధికారుల ముందూ భార్యకి జయ పెట్టి, నమస్కరించి ప్రమాణం చెయ్యటమంటే నాకు సిగ్గయింది. నీకు అయ్యుః క్షీణమేమో అనిపించింది. ఏమంటున్నారు గర్భంలో ఉన్న భావి సార్వభౌములు? చిమ్ముడమ్మ ఎట్లాఉంది? ఇవాళ సాయంత్రం మీ వారు దర్శనం చేసుకుంటారు. రాచకార్యాలకు కాస్త విరామం ఇస్తారా దేవిగారు!

ఇట్లు
-వీరభద్ర మహారాజు."

తడబడుతూ "వకుళా! వకుళా!" అని పిలిచింది రుద్రమ.

"ఊఁహూఁ! నేనేం రాను. నన్ను పొమ్మని కోప్పడ్డారుగా ఇందాక" అని బుంగమూతి పెట్టుకుని వచ్చింది వకుళ. రుద్రమకి నవ్వొచ్చింది. వకుళా నవ్వేసింది. "అమ్మయ్య! ఈవిడగారి కోపం తగ్గించగలిగాను" అనుకుంది వకుళ.



"యువరాణిగారూ! శయనాగారం సిద్ధం చేయించమని సెలవా! నగరంలోని పువ్వులంగళ్ళకు, పరిమళ ద్రవ్యాలకు వస్తుసంభారములకు, చీనాంబరాలకు అలంకార పరిష్కర్తలకు శృంగార ప్రబంధ నాయికలకు కబురుపంపమంటారా" అని వుత్సాహంగా అంది వకుళ.

"నిన్ను కొడతాను పిల్లోయ్" అంటూ ముసిముసిగా నవ్వింది రుద్రమ.

"ఎందుకో నన్ను కొట్టటం? దేవేరిగారూ, దేవరవారూ ఇద్దరూ విక్షేపంగా ఉన్నారు, మధ్యన నాకు దెబ్బలా"అంది వకుళ.

"ఊఁ...దెబ్బలూ-ముద్దులూను" అంటూ వకుళ చెక్కిలి ముద్దాడింది రుద్రమ.

"ఆఁ...ఆగండాగండి ఇంకా మహారాజురాలేదు. అందాకా ఇవన్నీ దాచిపెట్టండి"అని చమత్కరించింది వకుళ. తనపై ఆమెకుగల ఆత్మీయతకు పొంగిపోతూ. వీరభద్రుడు ఎన్నడూ లేనిది చెప్పిన వేళకే దయచేశాడు. చెలులు తెచ్చిన ముమ్మక్క దేవిని ఎత్తుకుని కాసేపు కబుర్లు చెప్పాడు.

ఆయన వచ్చాడని కబురుతెలిసినా త్వరగా మందిరానికి వెళ్ళలేకపోయింది రుద్రమదేవి ఆ వేళే అనేక రాజకార్యాలు పరిష్కరించవలసి వచ్చింది. అందులో చోళుడు దండెత్తి రానున్నాడని వార్త తెలిసింది కూడాను.

ఎంతోసేపు వీరభద్రుడు నిరీక్షించవలసివచ్చింది. అంతసేపూ అతను వెళ్ళిపోకుండా ఉన్నాడంటే వకుళ మాటల చాతుర్యమే. ఎన్నిసార్లు విన్నా ఇంకా వినాలనేట్లు మాట్లాడుతుంది వకుళ.

చివరికి నడిరేయి అలసి సొలసి నిరలంకారంగా భర్తను దర్శించింది రుద్రమ. ఆమెకు మాట్లాడే ఓపిక కూడా లేదు, తూలిపడబోతున్న ఆమెను గబుక్కున పొదివి పట్టుకున్నాడు భర్త.

"ఏమండీ! మీరు వస్తారని తెలిసికూడా పెందలాడే రాలేకపోయినాను మన్నించగలరా? ఇవాళే పని ఎక్కువయిందండీ ఏమండీ నాకు కళ్లు తిరుగుతున్నాయి ఎలాగో ఉంది" అంటూ వేలాడబడి పోయింది రుద్రమ.

"పిచ్చిదానా నీకెంత కష్టం వచ్చింది? గర్భవతులయిన సుకుమారులు ఇంతపనిచేస్తే తట్టుకోగలరా?" అంటూ ఆర్తిగా ఆమెను తల్పం మీద శయనింపజేసి నుదురు చుంబించాడతను

"ఏమండీ నన్ను వదలి వెళ్ళిపోకండి నాకు భయంగా ఉంటుందండీ మీరు దగ్గిర లేకపోతే. సంవత్సరం మన పాపలూ కలిసి ఈ మందిరంలోనే ఉందామా?" మగతగా అందామె.

"ఎవరక్కడ?" అన్నాడు వీరభద్రుడు.

వకుళ ప్రవేశించింది "మహాప్రభూ ఆజ్ఞ" అంది.

"పళ్ళరసమూ, వేడి పాలూ తీసుకురా వకుళ" అన్నాడతను.

రెండు క్షణాలలో పట్టుకొచ్చిందామె.

"ప్రభూ దేవిగారేమిటి ఇట్లా వున్నారు? ఇవాళ నేను అమ్మగారికి సాయం చెయ్యలేకపోయినాను. నాకు వేరే పనిఉండి అరెరె" అంది అదుర్దాగా ఆమె.

"చేతులారా చేసుకున్నదిలే నువ్వు రాజవైద్యులను పిలిపించు. ఎందుకైనా మంచిది ఆయనచేతనే విశ్రాంతి తీసుకోవటం తప్పనిసరిఅని చెప్పిద్దాం" అన్నాడు వీరభద్రుడు.

ఆమె వెళ్ళిపోయాక "దేవీ" అని తట్టి మృదువుగా లేపాడు భార్యని "ఊ .."అని మగతగానే కళ్ళు విప్పింది రాణి "నువ్వు మధ్యాహ్నం నుంచి ఏమన్నా తిన్నావా అసలు?" అని అడిగాడు ఆర్ద్రంగా

"లేదండీ మీరు వచ్చాక కలిసి తిందాం అని ఆగాను కానీ రాలేక



పోయినాను" ఆమె గొంతులో బాధ

వీరభద్రుడికి కళ్ళు చెమరించినాయి "కొంచెం లేవగలవా? పళ్ళ రసం తాగుదువుగాని లేక పాలు తాగుతావా?"అని మెల్లిగా లేపి ఒళ్ళో కూచోపెట్టుకున్నాడు.

"ఏదైనా సరే! మీరు.. " అందామె.

"నే నేదైనా తాగుతాను నా సంగతి దేనికి? నువ్వు వేడిగాఉన్న పాలు తాగు బాగా నిద్రపడుతుంది" అన్నాడు.

తరవాత ఆమె పాద సంవాహన చెయ్యడం ప్రారంభించాడు. "వద్దండీ అయ్యో అదేం పనండీ"అని మొత్తుకుంది రుద్రమ.

"నువ్వు మాట్లాడకు నీ కెంత కాళ్ళు నొప్పులుగా ఉన్నాయో ఊహించగలను. చూడు ఎంత సేపు నిలబడి ఉన్నావో కాళ్ళు నీరు పట్టి ఉన్నాయి. దేవి నీకేమి ఖర్మ ఇదంతా ఇద్దరం వదిలేద్దాం హాయిగా మా నిడదవోలు వచ్చేయి అమ్మాయిని తీసుకుని అమ్మా నాన్నలు నిన్ను కళ్ళలో పెట్టుకుని చూసుకుంటారు నేను నిన్ను పోషిస్తే ఉండేతృప్తి చాలు నాకు" అన్నాడతను.

"మీ కోరిక మన్నించలేని అభాగ్యురాలిని ప్రతి ఆడదానికీ అత్తిల్లే బతకవలసిన చోటు అని తెలిసీ పుట్టింటిలోనే వుంటున్నాను పుట్టింటి పేరుతోనే చెలామణీఅవుతున్నాను కానీ నేనేం చెయ్యను అశక్తురాలిని. తండ్రిగారు నాపై...-

చివాల్న లేచాడు వీరభద్రుడు "అదిగో ఆ ముసలిపీనుగు పేరు నాదగ్గిర ఎత్తకు" అన్నాడు రూక్షంగా.

అంతలో వకుళ రాజవైద్యుణ్ని తీసుకొచ్చింది. వాళ్ళ ముందు మాట్లాడితే బాగుండదని వూరుకున్నారిద్దరూ.

రాజవైద్యుడు రుద్రమని పరీక్షించి ఏదో మందు వకుళచేతికిచ్చి "దీన్ని తేనెలో రంగరించి రుద్రమకివ్వమన్నాడు. వీరభద్రుణ్ని ఇవతలికి పిలిచి "మహారాజా ప్రసవం అయ్యేవరకు రాణివారిని శ్రమపడనివ్వకండి ఇట్లాగే కష్టపడిందంటే గర్భస్రావం అయ్యే సూచనలున్నవి జాగ్రత్త! రేపొద్దున మిగిలిన మందులుకూడా నూరి పంపిస్తాను మా శిష్యుడిచేత మీరు ఆమెగారి ఆరోగ్యం విషయం జాగ్రత్త పడండి ఆహారం నేను చెప్పినదే ఇవ్వండి"అనివెళ్ళిపోయాడు ఆయన.

ఆలోచిస్తూ కూచున్నాడు రాజవైద్యుల ఔషధ ప్రభావంతో ఆదమరిచి నిద్రపోతున్నది మహారాణి పైగా తనపక్కనే భర్తఉన్నాడన్న తృప్తి ఆమె మొహంలో కనిపిస్తున్నది.

ఆమె మొహంచూస్తూ వీరభద్రుడు జాలి పడ్డాడు. ఎంత అమాయకురాలు ఎంత సహృదయ, ఎంత నిష్కళంక ఎంత సాధువు. ఎంత పతివ్రత పూర్వజన్మలో ఎంత పుణ్యం చేశానో ఈ అమృతకలశాన్ని భగవంతుడు నాకిచ్చాడు, కానీ తీపి ఎక్కువ ఇష్టం లేదే తనకి ఈ అమృతాన్ని ఆస్వాదించలేదు తను. ఆస్వాదించతగడు కూడా.

మళ్ళీ వీరభద్రుడు మామూలు వాడయిపోయినాడు పురుషాహంకారం నిద్రలేచి బుసలుకొట్టసాగింది. ఈ రాజకీయ జీవితంలో జాలికీ మమకారనికి తావులేదు, అనుకున్నాడు నిర్దయగా. తన రక్తం పంచుకుని పుట్టిన బిడ్డ ముమ్మడమ్మ ముద్దుముఖం గుర్తుకొచ్చింది "క్షమించు పాపా నీకు అమ్మఅయినా ఉంటుంది. నాన్న అయినా ఉంటాడు. అంతే నువ్వు నోచుకున్నావు" అనుకున్నాడు, ఆలోచిస్తూనే ఆసనంమీద కూర్చున్నవాడు కూర్చున్నట్లుగానే నిద్రపోయాడు.

మరునాడు పొద్దున్నే భర్త తన మందిరంలో ఉండటం చూసి పొంగిపోయింది రుద్రమదేవి. ఈరోజు ఆమెచేత అన్ని కార్యక్రమాలు రద్దుచేయించాడు వీరభద్రుడు.



బలవంతానా నృత్య గీత వినోద కార్యక్రమాల ముందు కూచోబెట్టాడు. భర్త ఆజ్ఞలో ఉండటం ఆనందదాయకం కాగా, వాటిని హాయిగా ఆనందించిందామె, ముమ్మడాంబికను చెలులచేత తెప్పించి ఆ రోజంతా వదలలేదు. "మీ నాన్నగారితో ఏం మాట్లాడావురా ఏమన్నారు నీతో" అని మాటిమాటికీ మురిపెంగా అడుగుతూనేవుంది. తన సంతానాన్ని తండ్రి లాలించాలని ఆడదానికి ఎంత తపన? "మా నాన్నగారు నన్ను రుద్రదేవుడని పిలిచారు, నేను నిన్ను ముమ్మడయ్య అని పిలుస్తానురా, కన్నా. కొడుకు పుట్టేదాకా నువ్వే నా కొడుకువి, తరువాత నిన్ను ఆడపిల్లగానే పెంచుకుంటాను. తాతగారిలా కాదు" అని ముద్దాడింది కుమార్తెను.

ఆ సాయంత్రం గన్నారెడ్డి భార్య అన్నమాంబికని. మల్యాల గుండయ్య ప్రభువు భార్య కుప్పసానిదేవిని కబురుపెట్టి వనితాసేన వివరాలు అడిగింది. మూడు వందలమంది స్త్రీలు కత్తిపట్టటం నేరుస్తున్నారని విని సంతోషించింది. వాళ్ళని తీసుకుని వకుళ మంజులలతో కలిసి భద్రకాళీ దేవాలయానికి పట్టాశ్వం మీద వెళ్ళింది గన్నారెడ్డి సాహిణిని మటుకు తోడు రమ్మంది. రక్షణకోసంకాదు. అన్నమాంబికతో కలిసి వస్తాడు కదా అని.

"మీ ఇద్దరూ ప్రాకార ముఖ ద్వారం దగ్గర కాపలా ఉండాలి, మేము వెళ్ళి దైవ దర్శనం చేసుకుని వస్తాం" అంటూ లోపలికివెళ్ళిపోయింది అందరితో కలిసి రుద్రమదేవి.

భద్రకాళికి పూవుబెత్తులు పరిచింది సామ్రాజ్ఞిసేవలందుకుంటున్న అమ్మవారు సుప్రసన్న మందహాస దదీధితులు ఒలికించింది "అమ్మా

ఆదిశక్తి శిరస్సు మీది నెలవంక జిలుగు వెలుగులు చిలుకగా మాఆంధ్ర
సామ్రాజ్యాన్ని చల్లగా చూడు. కాకతీయుల ధర్మ నిరతికి భంగం రాని
వ్యూహం, వర్ణ, వర్గ మత వైషమ్యాలతో నిత్యం పోట్లాడుకునే జాతిని ఒకే
త్రాటిమీద నడిపించే శక్తిని ఇవ్వు. ఉత్తర హిందూస్థానాన్ని ముంచి
వేసింది యవన సేన. హైందవ ధర్మానికి పెట్టని కోటలా ఉన్న దక్షిణా
పథాన్ని ఒడ్డునే ఉంచు, జననీ, దుష్టశత్రువులను చీల్చిచెండాడు. సుహృ
ఆడదానివి కదమ్మా. రాజరాజేశ్వరీ. స్త్రీ రాజ్యాన్ని పాలిస్తున్నదంటే
ఎందుకు దేవీ, ఇంత ఆశ్చర్యం. అసహ్యం. క్రోధం. అందరూ నాతో
యుద్ధానికి ఉబలాట పడిపోతున్నారు. అంత లోకువా స్త్రీ అంటే" జగ
దీశ్వరీ. నీ శక్తిలో శత శతాంశమైనా నాలో నిక్షేపించు. స్త్రీశక్తిఏమిటో
స్త్రీ రాజ్య పాలన సామర్థ్యం ఏమిటో నిరూపించు. తల్లిగా, అక్కగా,
చెల్లిగా, సహచరిగా, వదినగా, మరదలిగా బిడ్డగా, అనుక్షణం దర్శన
మిచ్చే స్త్రీమూర్తిని ఎందుకమ్మా అంత నీచంగా భావిస్తాడు పురుషుడు?"
అని ఫాలస్థలాన కేలుమోడ్చి ప్రార్థించింది రుద్రమదేవి. ప్రక్కనే
వున్న కుప్పసానిదేవి రుద్రమని వాత్సల్యంగా చూసింది.

గుడి బయట కాపున్న గన్నారెడ్డి "అన్నమా గమనించావా?"అని
అడిగాడు. "ఆ-మీ అనుమానం నిజమే. ఆమె అతని మందిరానికి వెళ్ళి
రావటం గమనించాను. ఇట్లా ఎందుకు జరుగుతుందో తెలియటంలేదు"
అంది మెల్లిగా అన్నమదేవి.

"తెలియక పోవటమేమిటి? నిశ్చయంగా మహారాణిపై కుట్ర....
"ఆ- ఆ- నిదానించు అన్నమా"

"ఇట్లా అంతరంగికులే వెన్నుపోటు పొడవచూస్తే ప్రభువుని
ఎట్లా రక్షించుకోవడం?" అప్పుడే వస్తున్న రుద్రమదేవి వాళ్ళు ఎంత



మెల్లిగా మాటాడుకున్నా కొంత విన్నది "కుట్ర, ప్రభువుల రక్షణ
అంటున్నారు వీళ్ళు ఏం జరిగి ఉంటుంది?"అని ఆలోచిస్తూ ఉండగా ఆ
భార్యా, భర్తలిద్దరూ దేవి దర్శనం చేసుకుని వచ్చారు. ఆమె పురాభి
ముఖంగా కదిలింది. ఆ తరువాత వారందరితో కలిసి ఏకశిలానగరం
ఉద్యాన వనాలూ, ముఖ్య దేవాలయాలూ దర్శించి మందిరానికి తిరిగి
వచ్చింది.

"ఆగండి-ఆగండి" అని ఎర్రనీళ్ళు తీసుకొచ్చి దిగదుడిచి
పారబోసింది చంపకమాల "ఇదేమిటి?" అని ఆశ్చర్యపోయింది
రుద్రమ.

"అదేకాదు-ఇంకా ఉంది.ముందా బయటి కెళ్ళొచ్చిన బట్టలు తీసే
ద్దురుగాని పదండి" అని లాక్కెళ్ళింది మదనలేఖ.

"ఏమిటోయ్ ఏమిటీ హడావుడి" అంది రుద్రమ.

"రాజ మాతల ఆజ్ఞ-మీ గర్భ సంరక్షణకోసమే గదమ్మా మా
తాపత్రయం అంతా" అంటూ స్నానశాలకి తీసుకెళ్ళింది చంపకమాల.

"అయ్యో, ఇందాక స్నానంచేసే గుడికి వెళ్ళాగా"

"ఆ- ఏం స్నానం లెద్దురూ అన్నట్టు తమకు కాస్త ఓపికొచ్చి
నట్లుందే ఇవాళ పనులు మొదలుపెట్టేశారు. ఏమయినా మన రాజవైద్యులు
అఖండులు" అంటూ రకరకాల సుగంధ ద్రవ్యాలు కలిపిన నలుగుపిండి
ఒంటికి రాయటం మొదలుపెట్టింది. ఇంతలో ఎన్నడూలేనిది రాజతమా
లిద్దరూ సరాసరి స్నానశాలలోనికి "ఊ- చెప్పిన మాట వింటున్నారా,
యువరాజాగారు" అంటూ వచ్చారు

"ఓ-ఇవాళ వారు తమ మాట వినాల్సిందేగా అందులో అంతః
పుర పాలకులు తమరు. అమ్మాయిగారి ఆజ్ఞలిక్కడ సాగవు"అని కిసు

క్కిన నవ్వి బంగారు గిన్నెతో ఘమఘమలాడే సంపెంగనూనె అందించింది నారాంబకి మంజువాణి.

"ఏమిటీ ఆనందం"అని చెలులతోనూ "ఏమిటమ్మా ఆర్భాటం. నాకు నిద్రొస్తున్నదమ్మా"అని తల్లులతోనూ అంది రుద్రమ.

"ఒక్క గడియసేపు ఓర్చుకోమ్మా ఈ తతంగం పూర్తయిపోతుంది. రేపు సూర్యోదయందాకా నిద్రపోదువుగాని, తెల్లవారుజామున నిన్నెవరూ లేపరు, ఎందుకంటే రేపుకూడా రాజకార్యాలు పరిష్కరించనక్కరలేదులే" అంది పేరాంబ.

"అయ్యో ఇవాళ పూరుకున్నందుకే చాలా పని పేరుకుపోయి ఉంటుందమ్మా రేపుకూడా అంటే దేశికులవారు కూడా వూళ్ళో లేరు-ఎలా!" అన్నది ఆందోళనగా. రుద్రమ.

"దేశికులవారు లేకపోతే వారి కుమారులు నరసింహులుగారున్నారు మీ వకుళ ఉంది. దిగ్గజాలవంటి తమ అనుంగు సహచరులున్నారు. మీ రింకేం మటాడడానికి వీలులేదు అమ్మగార్లు చెప్పినట్లువింటూ ఉండండి. నేనిప్పుడే వెళ్ళి వీరభద్ర ప్రభువును ఆహ్వానించి రావాలి. అమ్మో నాకింకా చాలా పనుంది. ఏమర్రా త్వరగా కానివ్వండి" అని మిగిలిన చెలులను కేకవేసి పరిగెత్తినట్లె వెళ్ళిపోయింది వకుళ.

నారాంబ చేతిలోనికి చమురు తీసుకొని "అమ్మ కడుపు చల్లగా. అత్తకడుపు చల్లగా నీ కడుపు చల్లగా వెయ్యేళ్ళు వర్ధిల్లు తల్లి" అంటూ మూడుసార్లు రుద్రమ తలమీద అంటింది.

తరువాత పేరాంబకూడా అలాగే చేసింది.

"అమ్మాయీ ఇప్పుడు నీకు సీమంతం చేయబోతున్నాము. నిన్ను



నువ్వు అల్లుడుదరిని చాలా గాబర పెట్టేవుట వకుళ చెప్పింది. మూడవ నెలలోనే పుంసవనం చెయ్యకపోవటం పొరపాటయింది. అప్పుడు మీ తండ్రిగారు పరమపదించిన కొత్త కూడాను- చెయ్యబుద్ధికాలేదు. పుంసవనం చేస్తే మగబిడ్డ పుడతాడంటారు- పైగా గర్భరక్షకూడా జరిగేది. మీ తండ్రిగారు నీ కడుపున అవతరించాలని మా కోరిక కనీసం ఇప్పుడైనా సీమంతం చెయ్యనీ" అంది నారాంబ

"నువ్వు ఒప్పుకోవేమో అని భయపడ్డాం నేనూ అక్కయ్యాను, లేకపోతే ఈపాటికి గణపాంబని పిలిపించేవాళ్ళం మిమేనత్తలు కుంబాంబ మైలమాంబలు వచ్చేవాళ్ళు ఇప్పుడప్పుడే మనింటిలో వచ్చే వేడుకలేమున్నాయి ఇంక" అంది పేరాంబ.

"రాజమాతలు మన్నించాలి యువరాణి ప్రసవించాక శిశువుకి బారసాలలేదూ?" అంది మదనలేఖ విస్మయంగా చూస్తూ

"అమంగళం శమించునుగాక ఏమిటో అట్లా అన్నాను" అంది దిగులుగా పేరాంబ.

"అమ్మా విచారించకండి అన్నింటికీ ఆ పరమేశ్వరుడే వున్నాడు. శుభాశుభాలకు మనం కర్తలమా? చెప్పు. దిగులు పడకు నా కెందుకో నా కడుపులో బిడ్డ చిరాయువనే తోస్తున్నది ఏదీ మన చేతల్లోలేదులే అయినా" అంది రుద్రమ నిబ్బరంగా-

ఆమె దగ్గరికివచ్చి శిరస్సు మూర్కొని, మెటికలు విరిచింది నారాంబ "నా బంగారుతల్లి" అంటూ

అమ్మా తొందరగా ముగించండమ్మా ఇదంతా రేపు ఎవరగానైనా తోటి రాజులకు తెలిస్తే నవ్వుతారేమో రాణి సీమంతం చేయించుకుంటున్నదని చీ నాకు సిగ్గేస్తుంది" అంది రుద్రమ-

"ఏం వాళ్ళు పిల్లల్ని కనరా? ఎందుకునవ్వటం? అయినా నువ్వొప్పుకున్నావు అంతేచాలు రాత్రిలోపల పూర్తిచేసేయమూ రాజా తల్చుకుంటె దెబ్బలకి కొదువా" అంటూ హడావిడిగా వెళ్ళిపోయినారు నారాంబ పేరాంబ పేరంటం ఏర్పాట్లు చేయడానికి "త్వరగా అమ్మాయికి స్నానం చేయించండి లేకపోతే జలుబు చేస్తుంది" అని చెలులని హెచ్చరించి మరీ వెళ్ళారు.

"అలాగే" అని గువ్వకోలుగా నవ్వుకుంటూ రుద్రమదేవికి తలంటి పోశారు చెలులు. చివరలో శ్రీరామరక్ష నూరేళ్లాయుష్షు, వెయ్యేళ్ల అయిదోతనం అన్నారు. వెంటనే మాడుమీద కాస్త పసుపు రుద్ది, అగరు సాంబ్రాణి ధూపాలు వేసి తడి ఆర్పారు. వేణీబంధం సవరించిజాజిపూల సరాలు చుట్టారు. మెడలో జాతిరత్నాల త్రిసరాలుంచి, మధ్యలో మంచి ముత్యాలమాల సవరించి శరత్కాల చంద్రకాంతిలా వెన్నెలలు కురుస్తున్న కాశ్మీర దేశపు వెలి పట్టుచీర కట్టి, చేతులకు వంకీలు, ముంజేతులకు సన్నని కంకణాలు అలంకరించి కాళ్ళకి పల్చని అందెలు పెట్టి చెవులకు నవరత్నాల తాటంకాలు, చెంపసరాలు గదియించి, కనులకు కాటుక నుదుట కస్తూరి బొట్టుతో రుద్రమదేవిని నడయాడే బంగారు బొమ్మగా అలంకరించారు చెలులూ- పరిచారికలూ గబగబా.

సుగంధాల ఘమఘమలు సోడుముడుతుంటే చిరునవ్వుతో వీరభద్రుడు విచ్చేశాడు. మరి పుట్టబోయే తన బిడ్డకు అంగరక్ష ఈ ఉత్సవం.

రాజమాతలు అల్లుడ్ని మర్యాదచేసి కూర్చోబెట్టారు. పీటల మీద వకుళా చంపకమాలా అంతర్వత్ని అయిన రుద్రమదేవిని మెల్లిగా నడిపించుకు వచ్చారు భర్త పక్కనే పీటలమీద కూర్చుంటూ పెళ్ళి నాటి కంటే ఎక్కువ సిగ్గుపడిందామె



ఆ పూటతో మంచి ముహూర్తం పోవటమేకాదు ఇక నుంచీ మూఢమి కూడా వస్తున్నది. అందుకే ఇంత త్వరగా అనుకోకుండా దీన్ని ఏర్పాటు చేశారు రాజమాతలు.

రాజ పురోహితుడు క్రియాకలాపం నడిపించసాగాడు. వీరభద్రుడు ఓరగా చూశాడు భార్యని.

"తర్వాత గ్రుక్కిళ్లు మింగుదురు గాని ముందు పురోహితులు చెప్పినట్లు చెయ్యండి" అంది సన్నగా రుద్రమ మెల్లిగా నవ్వుతూ అతని కొక్కడికే వినిపించేట్లు.

భార్య మాటలకి వీరభద్రుడికి నవ్వొచ్చింది "చూశావటె చంపకమాలా! రాజ దంపతులిద్దరూ ఎంత ముచ్చటగా నవ్వుకుంటున్నారోను! మనం గమనించలే మనుకుంటున్నారు. హుఁ" అని నవ్వింది మంజువాణి రాజమాతల కంట సంతోష బాష్పాలు.

మహామంత్రి శివదేవయ్యగారు వూళ్లోలేనప్పుడు అకస్మాత్తుగా నిర్ణయించారు రాజ మాతలు సీమంతాన్ని తరువాత ఇప్పటిలో మంచి రోజులులేవని ఒకటి ఆ రోజు రుద్రమ గర్భస్రావం కాబోయిందనీ తప్పనిసరయి ఏర్పాటుచేశారు.

శివదేవయ్యగారి సతీమణి పార్వతమ్మ-కోడలు అన్నపూర్ణకలిసి ఊళ్లోని బ్రాహ్మణ స్త్రీలని పేరంటం పిలిచారప్పటికే. అన్నమాంబిక- కుప్పాంబిక కలిసి రాజోద్యోగుల భార్యలను పేరంటానికి పిలిచారు. పెద్దసెట్టిగారి భార్య లీలావతి కూతురు సరోజిని కలిసి వైశ్య స్త్రీలను పేరంటానికి పిలిచారు వనితాసేన వారు మిగిలిన స్త్రీలను పిలిచారు. పిలవటమేమిటి ఉన్నవాటిలో మంచి నగలు పెట్టుకుని మంచి చీరలుకట్టుకుని పిల్లల్ని వెంటపెట్టుకుని చేతనయిన కానుక తీసుకుని ముచ్చటముడులలో

పూవులు తురుముకుని నగరమంతా లక్ష్మీ వైభవంగా స్త్రీలందరూ త్వరగా పేరంటానికి బయలుదేరారు. ఇంకో గడియలో దుర్ముహూర్తం వస్తుంది మరి. కానుకలు తేలేనివారు పసుపు కుంకుమల పొట్లాలు తెచ్చారు. కొంత మంది ఫలాలు తినుబండారాలు తెస్తే కొందరు గాజులు పూలు తెచ్చారు.

"ఓహో ఏమి సందడి ఏమి సంరంభం పారాడుతున్న ఘుమఘుమలు తళతళలు కళకళలు ఏమి కులుకు—ఏమి హొయలు—ఏమి సంబరం మీ జాతి వ్యక్తి రాజ్యంచేస్తున్నందుకేనా" అని భర్తలు పరిహాసమాడారు వాళ్ళువెళుతుంటే.

పేరంటాళ్ళకి విలువయిన వాయనాలు సిద్ధంచేశారు పరిచారికలు వచ్చిన వాళ్ళని మర్యాదచేసి కూచోపెడుతున్నారు సఖులు పసుపుకుంకుమలిచ్చి చెంపలకి గంధం రాస్తున్నారు కొందరు చెలులు—

"ఆడవాళ్ళ పేరంటం కదా మనకి ఆటవిడుపు బహుశాగొడవలేం రావు" అని నిశ్చింతగా అప్రమత్తంగావున్నారు అధికారులు శివదేవయ్య గారి కుమారుడు నరసింహుడు ఇంటిలోనే వుండి తను రాస్తున్న సిద్ధోద్వాహమనే కావ్యాన్ని పూర్తిచేయటానికి పూనుకున్నాడు

"అమ్మయ్య కొత్త వ్యవధిలో సరిగా చెయ్యగలమో లేదో అనుకున్నాం కానీ చాలా బాగా జరిగింది ఉత్సవం" అని తృప్తిగా విశ్వసించారు రాజమాతలు ముఖ్య సఖులు

మంగళహారతి ఇచ్చారు దంపతులకు ముత్తయిదువలు "వానొస్తున్నట్టుంది మబ్బులు కమ్ముకున్నాయి అమ్మో నేను వంటచేసి రాలేదమ్మోయ్ పిల్లలేడుస్తారు చీకటి పడింది" అంటూ పేరంటాళ్లు చాలామంది ఇంటిముఖం పట్టారు—



"అమ్మాయి చాలా అలిసిపోయి ఉంటుంది ఇక లేవదీయండి దంపతుల్ని" అన్నారు రాజమాతలు "ప్రభువులుమటుకు అలిసిపోలేదా ఏం అదే పీటల మీద కూర్చుని" అని పరిహాసం చేసిందివకుళ ఆ చమత్కారానికి ముసిముసిగా నవ్వుకున్నారు గడుసు మహిళలు

వీరభద్రుడి అంగరక్షకుడు ఆదిత్య వరదుడు వచ్చి ఆయనకి చెయ్యి అందించి లేపాడు రుద్రమవేపు చిలిపిగా చూసి వెళ్ళిపోయినాడు వీరభద్రుడు అంతఃపురంనుంచి ఇక ఆడవాళ్ళు ఏ వేడుకలయినా చేసుకోనీ వాళ్ళమధ్య తనెందుకని పురోహితుడు కూడా వెళ్ళిపోయినాడు ఆడ మలయాళం మటుకే మిగిలింది,

అన్నాంబికా వకుళా రుద్రమదేవిని లేపబోయినారు లాంఛనంగా చెయ్యి పట్టుకుని సగంలేచిన రుద్రమ వెనక్కి విరుచుకు పడిపోయింది అక్కడున్న ఆడవాళ్ళందరికికూడా ఒక్కక్షణం మత్తుకమ్మినట్లయింది— ఎక్కడ్నించో కుక్క అరుపు వినిపించినట్లయింది "అమ్మో కుక్క" అంటూ స్పృహలో కొచ్చారంతా అంతక్రితందాకా కళకళలాడిన అంతఃపురమంతా ఆలగోలు బాలగోలుగా అయిపోయింది కుప్పమాంబ తెలివి తెచ్చుకొని రాజ భిషగ్వరులకి వర్తమానంపంపింది ఇంతలో రాణీగారిని పువ్వులాగా ఎత్తి శయనాగారం చేర్చారు సఖులు

నిమిషాలమీద అమాత్య పుత్రుడు నరసింహుడూ రాజవైద్యులు అక్కడికి వచ్చారు—

"అమ్మో! ఎంత కుక్క శుద్ధాంతంలోకి శునకం ఎలా జొరబడింది భయంకరంగా ఉంది. దాన్నెవరూ తోలరేం" అని అరిచి మళ్ళీ స్పృహ తప్పిపోయింది రుద్రమ

రాజమాతలు గ్రుడ్ల నీరు గ్రుడ్ల కుక్కుకుంటూ స్వయంభూ స్వామి నిర్మల్యమూ మంత్రించిన విభూతి తెప్పించి కూతురికి పెట్టారు.

వేరే రాచకార్యములేవో పరిశీలిస్తూ అంతఃపుర రక్షణని అశ్రద్ధ చేసిన ప్రాసాదాదిత్య నాయకుడు, గన్నారెడ్డి: త్రిపురంతకదేవుడు-అంబదేవుడు ఆడిదమ్మలు దోషుల్లా తలలు వంచుకుని వచ్చారు.

రుద్రమదేవి పక్కమీద గిలగిలా కొట్టుకుంటున్నది. మధ్యమధ్య "అమ్మో కుక్క" అని అరుస్తున్నది.

నరసింహుడికి తెలిసింది యువరాజుల కెవరో ఉన్మత్తభైరవం ప్రయోగించారని సమయానికి నాన్నగారు లేరు. దీనికి విరుగుడు తను నేర్చుకోలేదు. ఎంత పొరపాటయింది. ఇంటికెళ్ళి తాళపత్ర గ్రంథాలు ప్రాచీనమైన వన్నీ వెతకాలి, దొరుకుతుందేమో" అనుకుంటూ వెళ్ళాడు.

కాకతీయుల కాలంలో గోళకీ మఠాలు ప్రసిద్ధి చెందినాయి అరవై నాలుగు కళలకీ ఆలవాలాలు గోళకీ మఠాలు. అక్కడ ప్రసూతిశాలలు సైతం ఉండేవి. పాశుపత శివాచార్యులు గోళకీ మటాలకు అధ్యక్షులుగా ఉండేవారు వారు మంత్ర తంత్ర పారంగతులు శివపూజా ధురంధరులు త్రిపురాంతక దేవుడు హుటాహుటిన వెళ్ళి అనుచరుడికి చెప్పారు పాశుపత శివాచార్యులవారిని పల్లకిలో కూర్చుండబెట్టుకుని సగౌరవముగా అంతఃపురమునకు తీసుకురావలసిందని.

రుద్రమదేవి దుస్థితి చూసి కనులు చెమరించినాయి పార్వతమ్మకి "అమ్మా మేము వెళ్ళిరామా"అనిఅడిగింది రాజమాతలని.



"అందరూ వెళ్ళిపోయినా మీరుండండి తల్లి మహా మంత్రులులేని కొరత మిమ్మల్ని చూస్తే తీరుతుందనిపిస్తున్నది మనిషిసాయం ఉన్నా, మాటసాయం చేద్దురుగాని" అని ఉంచేశారు వాళ్ళు.

అమ్మా నాయనమ్మల వెనకాల పేరంటాని కొచ్చాడు బాలశివయ్య అతని స్నేహితుడు ఇందులూరి అన్నయకూడా అతడితో వచ్చాడు.

"నా మనుమడు యౌగంధరాయణుడంతవాడవుతాడు" అనేవారు శివదేవయ్యగారు జాతకంచూస్తూ-

నాయనమ్మ కొంగుపట్టుకుని వదలకుండా ఉన్న ఆ పిల్లవాణ్ని చూసి చంపకమాల ఒక మిటాయివుండ చేతికిచ్చి "అల్లరి చేయకుండా ఇదితింటూ కూచో" అంది అది సరిగా అందుకోలేదేమో అతని చేతిలో నుంచి జారి దొర్లుకుంటు రాణిగారి మంచం కిందికి పోయింది.

దానికోసం మంచం కిందికి దూరాడా పిల్లవాడు అతనితోపాటు అన్నయా దూరాడు. వాళ్ళనెవరూ పట్టించుకోలేదు, వాళ్ళ గోలలో వాళ్ళు వుండి.

మళ్ళి బయటికొచ్చారిద్దరూ...."ఏరా అన్నయా నీ లడ్డుండ బానే ఉంది. కానీ నా లడ్డుండ ఏ మూలకి పోయిందో కనిపించటం లేదురా... కొంపదీసి ఆ కుక్కగాని తినేస్తుందో ఏమిటో" అన్నాడు.

"కుక్క" అనేమాట వినబడి అంతా చూశారు. అతనివంక అన్నపూర్ణకి ఒళ్ళు మండిపోయింది. అవతల యువరాణివారికి బాగోలేక నానా కంగారు పడుతుంటే వీడి గోలేమిటి" అని "నోర్ముయ్ భడవా

బయటికిపోయి ఆడుకో ముందు ఎక్కడ కొచ్చినా తిండిగోలానువ్వు"అని కసిరింది.

"కాదమ్మా ఇందాక రాణిగారికి కనిపించిందిగదా నాకు కనిపించ లేదేమి టనుకున్నా పోనిలే కుక్కలకి నేనంటే భయంగదా అందుకు కనిపించలేదేమో అనుకున్నా... అందుకే మంచం కింద దూరికూచుంది ఎంతపెద్ద కుక్కో! నల్లగా దున్నపోతంత ఉంది. ఏదీకర్ర ఉండాలే నీపని పడతా మా రాణీగార్ని ఇంత భయపెడతావా" అంటు అటుఇటు చూసి కర్ర లేకపోవడంతో బయటికెళ్ళి గన్నారెడ్డి చేతిలోని కత్తినిఊర బెరుక్కుని వచ్చాడు ఆ పిల్లవాడు.

"బాబూ అల్లరి చేయకూడదు రాణిగారు లేచారంటే నిన్ను శిక్షిస్తారు" అంటు కత్తి లాక్కోబోయింది మదనలేఖ.

"హా రాణీగారా, నన్ను శిక్షించడమా ఏయ్ అమ్మాయ్ మంచం కిందున్న కుక్కను కొడితే నన్నే మెచ్చుకుంటారు చూడు" అని ఆమె జేతిలోనించి కత్తి లాక్కున్నాడు మళ్ళి.

నల్లగా భూతంలా ఉన్న మహాకాయుడొకడు మంచం క్రిందినుంచి బయటికి వచ్చాడు.

అతణ్ణి చూసి బాలశివదేవయ్యకి నవ్వొచ్చింది, "అరె! వీడు కుక్క కాదే-దున్నపోతా! కాదు, పందికొక్కు కాబోలు" అంటూ ఒక్క ఉదుటున కత్తిని విసిరేశాడు. అది ఆ మనిషి వీపుకు తగిలి క్రింద పడింది.

ఆ ఆగంతకుడు భయంకరంగా గర్జించి బాలుణ్ణి ఎత్తుకుని పారిపో జూశాడు.



"ఏయ్! భారతంలో కుంభకర్ణుడి మల్లె ఏమిటా అరుపులు? పిచ్చె కిందా ఏం? చూడమ్మా! ఈ జంతువు నన్నెత్తుకుపోతున్నది. తాతగారు రాగానే చెప్పు. ఒరే, అన్నయ్యా. ఏడవకురా!" అంటున్నాడు చినశివ దేవయ్య స్నేహితుడితో.

మంజువాణి, చంపకమాలలు కత్తుల దూశారు. మెరుపులా లోప లికి దూకాడు గన్నారెడ్డి. అతని పేరు వంది భూపాలుడు. అందరూ పేరంటం హడావుడిలో ఉండగా తెలుగు రాణిని చంపాలని ఆమె మంచం క్రిందనే నక్కాడు. అతని ఉపాయం బెడిసికొట్టి గన్నారెడ్డి కత్తికి ఎర అయ్యాడు.

చినశివయ్యని ఎత్తుకుని ముద్దాడి దించారు నారాంబ, పేరాంబ. ఎంత సూక్ష్మ దృష్టి ఈ బాలునిదని అంతా ఆశ్చర్యపోయినారు. పెద్ద వాడయితే తాతగారి కంటే కీర్తి సంపాదిస్తాడనుకొన్నారు, ఎన్నో కానుక లిచ్చారు. కానీ, పసివయ్య వాటిని ముట్టలేదు. "అమ్మా! ఈ ద్రాక్ష పళ్ళ గుత్తి, ఈ బొమ్మ తీసుకోనా" అని తల్లి అనుజ్ఞ అడుగుతుంటే అందరికీ ముచ్చటేసింది.

"తీసుకోరా, నాయనా!" అంది అన్నపూర్ణ. ఇంతలో రుద్రమ కళ్ళు తెరిచింది. "అయ్యో! ఈ కుక్క నింకా తోలనేలేదా? దాని మొహం అంత భీకరంగా..." కెవ్వున అరిచి మళ్ళీ మూర్ఛపోయింది.

అప్పుడే ఎవరో పాశుపత శివాచార్యులయ దగ్గరుండి పిలుచు కొచ్చారు. రాగానే అయన ఏదో మంత్రం జపిస్తూ రాణి మంచంచుట్టూ ముగ్గేశారు. కాస్త ఇవతలగా కూర్చుని ఏదో జపం మొదలుపెట్టా రు

కాని, అదేమి చిత్రమో శివాచార్యుల గారి జపం తీవ్రతరం అవు తున్న కొద్దీ రుద్రమ మొహంలో కళ రావడానికి బదులు క్షీణించిపోతు న్నది.

ఆ మర్నాడు ఏకశిల వాసులకు గుండె నిండా దిగులే. అత్యంత సమర్థురాలయిన తమ రాణి బ్రతుకుతుందో, లేదో అని భయమే. నగరం లోని సహస్ర స్తంభ దేవాలయములో మహా రుద్రాభిషేకం చేయబడు తున్నది. భద్రకాళి గుడిలో, స్వయంభూ దేవుని ఆలయములో, ఏక వీరా దేవి మందిరంలో, మైలారు దేవుని నిలయంలో అనేకమైన పూజలు, అఖండ ధూప దీపాది అర్చనలు జరుగుతున్నాయి. రుద్రమదేవి పేరిట.

○ ○ ○ ○

అన్నమాంబ కారోజు పండుగ రోజే భర్తగారు ఈ మధ్య మరీ ఇంటిపట్టున ఉండకుండా ముఖ్య రాజకార్యాల్లో మునిగి తేలి నానా హైరానా పడుతున్నారు. ఒక్కొక్కసారి రాజప్రాసాదంలోనే భోజనాలు రాత్రిళ్ళు రాణీగారికి కాపలాలు, ఇల్లాలితో మాట్లాడటమే కుదరటంలేదు గన్నారెడ్డికి. అట్లాంటిదిఇవాళ ఇంటికొస్తాననీ, రోజంత ఇంటి దగ్గరే ఉంటాననీ కబురు చేశాడు భార్యకి. "ఏలిన వారి దయ ఇన్నాళ్ళకయినా కలిగింది. నా మగనిని ఇంటికి పంపుతున్నారు" అనుకుంది. నిజంగానే రుద్రమదేవి ఆ రోజు గన్నారెడ్డి బాధ్యతలన్నీ అడిదమ్మ సేనాని కప్ప గించింది. నువ్వు ఇంటికెళ్ళి విశ్రాంతి తీసుకురావయ్యా, రెడ్డి" అని పంపింది కావాలనే. ఇంకేముంది? రాచరికపు కోరల్లో చిక్కుకున్న భర్తలు గల దురదృష్ట భార్యలకు అతను దయ చేసిన రోజు పండుగే కదా!



అన్నమాంబికా దేవి అంతఃపురం కళకళలాడుతున్నది. అగరు కస్తూరుల పరిమళాలు, సాంబ్రాణి సువాసనలు, అందెలగలగలలు,మట్టెల సవ్వడులు, దుకూలాల రెపరెపలు చుట్టుముడుతుంటే అంతఃపురమే ఒక అమ్మాయి అయినట్టుంది.

శయన మందిరాన్ని అలంకరించటంతో, చదరంగపు పావులు పరచటంతో, కేళీ కందుకాలు నిర్మించడంలో అన్నమదేవి చెలికత్తెలకి ఊపిరాడటం లేదు. వాళ్ళు సతమతమైన పిమ్మట కావి గుప్పిటలో ఇమిడే ఆకాశం రంగు నీలం చీరె నచ్చలే దామెకి. ఆ చీరె అంచుగా జానెడు వెడల్పయిన బంగారు హంసలు కుట్టి ఉన్నాయి. చీరంతా సన్న సన్నని వెండి చుక్కలు ఉన్నాయి. వెండి బంగారాల మేలి కలయిక అయిన ఆ చీరె కట్టుకుని, గులాబి రంగు పైఠిణీ రవికె ధరించి, తెల్లని మంచుపొరలాంటి మేలి ముసుగు వేసుకుంటే ముచ్చటపడ్డారు చెలులుఆమె అందానికి. మెడలో పద్మరాగాల త్రిసరాలు వేశారు వాళ్ళు. శిరస్సున సూర్య చంద్రులను ఉంచారు. ఎర్రని కుంకుమ బొట్టు పెట్టారు. కాళ్ళకి లత్తుక దిద్దుతూనే ఉన్నారు. వచ్చేశాడు గన్నారెడ్డి. ఇల్లాలి సంరం భాన్ని చూసి చిన్నగా నవ్వాడు. వెంటనే మంత్రించినట్లు మాయమై నారు చెలికత్తెలు.

కోరమీసం అలవోకగా స్పృశించి, కళ్ళలో కొంటెదనాన్నొలి కించి, "దేవీ!" అని చేతులు చాచాడతను. చిరు సిగ్గులూ, ఎల నవ్వులూ కలబోసిన కుందనపు బొమ్మ అన్నమ "ఛీ-పొండి" అంటూ సిగ్గుతో చేతుల్లో మొహం దాచుకున్నది.

"పోనా అయితే యువరాజు సేవకి" అని బయటికి వెళ్ళబోయా డతను.

"ఏహుఁహుఁ" వెళ్ళొద్దన్నట్లు తల తిప్పింది అన్నమ.

"ఇంకా ఎంతకాలం సిగ్గుపడతావో ఏమో!" అని నిట్టూర్చాడు రెడ్డి.

"బ్రతికినన్నాళ్లూ" అందామె.

"ఆఁ! ఓరి, నాయనో! ముసలమ్మవైనా కూడా ఇట్లాగే సిగ్గుపడతావా ఏం కర్మ?"

"ఊఁ!"

"కొంటె పిల్లా!"

కిలకిలా నవ్విందామె. పరవశంగా చూశాడామె వైపు గన్నారెడ్డి.

"ఏమిటలా చూస్తున్నారు?"

"రోజు రోజుకీ మణి శలాకలా నాజూకులు తేలుతున్నావని"

"రాణిగారి దయ"

"ఏ విషయంలోనో అర్థమయి ఏడవటలేదు ఈ బుర్రకి."

"బాహు బల సంపన్నులకు, పరాక్రమవంతులకు సునిశిత విషయాలేవి అర్థమవుతాయి లెండి?"

"ఏమిటీ విసురు? ఏమిటీ అఘాయిత్యం! ఔరా!"

"మీమీదే!" అంటూ జడకుచ్చులతో అతని చెంప మీద కొట్టింది అన్నమ.

"ఆహాఁ... అంత ముద్దులాలూ ఇంత ప్రౌఢ అయిందన్న మాట" అంటూ ఆమెను గుచ్చి పట్టుకుని ఎదకు హత్తుకున్నాడు రెడ్డి.

నవ్వుతూ నవ్వుతూనే విడిపించుకుంది అన్నమ.



"ఇంతకీ తెలిసిందా? అదేనండీ, స్వామీ! వనితా సేన మాటా, వ్యాయామం మాటా మరచిపోయినారా? ఇంట్లో కూచుని తిండి తినే ఆడవాళ్ళు లావు అవుతారు గానీ..."

"ఔను కదూ! మరిచిపోయినాను నేను రాజుగారి కొలువుకు వెళ్ళినప్పుడల్లా నీకు వనితా సేన కొలువు కదూ! నీది స్వచ్ఛంద సేవనుకుంటాను. ఎందాకా వచ్చిందేమిటి ఖడ్గచాలనం? పరిశీలించనా?" అంటూనే ఒరనించి ఖడ్గం తీశాడు రెడ్డి.

మెరుపులా దాన్ని పడగొట్టింది అన్నమ.

అంతటి వీరుడూ దిగ్భ్రాంతుడయినాడు క్షణకాలం. అన్నమాంబ చేతిలోకి కత్తి ఎక్కడ్నించి వచ్చింది హఠాత్తుగా? గది గోడలకు వేలాడుతున్న పూలమాలలు కనిపించినాయి. తన ఇల్లాలు ముద్దొచ్చేసిందతనికి "ఓహో! మృదువైన పూలమాలల వెనుక కరకు కత్తులున్నవన్నమాట. అయితే, తమతో జాగ్రత్తగానే ఉండాలన్నమాట" అన్నాడు నవ్వుతూ.

"ఊఁ! మరి ఏమనుకున్నారు? అదోని రాజకుమార్తె, వర్ధమానపుర యువరాజ్ఞి, మహా వీరులయిన గన్నారెడ్డిగారి అర్ధాంగిని—నాతో జాగ్రత్తగా ఉండకపోతే ఎట్లా?"

"ఊఁ!"

"ఊఁ!"

"సరే, నేనొచ్చి ఎంత సేపైంది? నీ యుద్ధం మాటేమో కానీ, అంతశ్శత్రువైన మన్మథుడు నారి సారించి, వరసగా బాణాలు కురిపిస్తున్నాడు నా మీద. ఏయ్, అల్లరి పిల్లా" అంటూ పారిపోతున్న అన్నమ

కొసపాములాంటి జడ అందుకున్నాడతను.

"ఇంతకీ మీ వనితా సేన వివరాలు చెప్పనే లేదు" అన్నారు గన్నారెడ్డి. భార్య అందించిన విడెము అందుకుంటూ.

చదరంగం బల్ల సద్దుతున్నది అన్నమాంబ. "అబ్బ! ఆ అమ్మాయిగారికి, రాణిగారికి తప్ప మా సేన వివరాలు ఎవ్వరికీ చెప్ప రాదు. ఇలాంటి ఎత్తులు మన దగ్గర పనికిరావుసుమా?" అందామె.

"మొగుడికూడా చెప్పకూడదా?" అలిగాడతను.

మొగుడికే కాదు, బ్రహ్మదేవుడికూడా చెప్పకూడదు మా నోటితో."

"అదోవి రాజకుమారికి బొత్తిగా పతివ్రతా ధర్మాలు తెలీవే"

"ఇదుగో-ఇదిగో మా పుట్టింటి వాళ్ళ నేమైనా అన్నారంటేనా?" మూతి ముడుచుకుందామె. దానికి మంచి బహుమానం ఇచ్చి చదరంగం మొదలు పెట్టాడతను నవ్వుకుంటూ.

అట్లా ఆలుమగ లిద్దరూ సరసోక్తులతో చదరంగంఆడుకుంటుంటే "గన్నారెడ్డి ప్రభువును అవసరంగా కలుసుకోవాలని ఎవరో నూతన వ్యక్తి వచ్చా"డని చెలులు వార్త తెచ్చారు.

వెంటనే ముఖ మండపములోనికి వెళ్ళాడు రెడ్డి.

"గన్నారెడ్డీ! మీతో రహస్యంగా మాట్లాడాలి" అని అటూ ఇటూ చూశాడా ఆగంతకుడు.

"నిరభ్యంతరంగా చెప్పండి మీరెవరో, వచ్చిన పనేమిటో" అన్నాడు రెడ్డి.



"మీరు రహస్యంగా మా మహారాజుకు సాయం చేస్తే కోటి దీనారాలు బహుమతిగా ఇస్తారు. ఒక ఆడది రాజ్యం చేస్తుంటే మీ వంటి వీర పురుషులు దానికి బాసటగా..."

అతని మాట పూర్తి కానేలేదు. ఆ ఆగంతుకుడి చెంప చెళ్ళు మనిపించాడు గన్నారెడ్డి.

ఖడ్గం అందుకునే లోపలే పారిపోయాడతను.

"పిరికిపంద! నువ్వా ఆంధ్ర సామ్రాజ్య లక్ష్మిని ఎదిరించేది?" అంటూ లోపలికి వెళ్ళాడు గన్నారెడ్డి.

"ప్రభూ! ప్రభూ!" అంటూ ఆందోళనగా ఎదురైంది అన్నమాంబిక.

"ఏం లేదు, దేవీ! ఎన్ని కుక్కలు మొరిగినా ఏనుగు మీదున్న వాళ్ళకేం భయం?" అన్నాడు రెడ్డి.

మరునాడు శివదేవయ్యగారి దగ్గరినుంచి కబురొచ్చింది గన్నారెడ్డికి గబగబా ఆయత్తమై వెళ్ళాడతను.

"రావయ్యా! మహావీరుడా!" అంటూ ఎదురొచ్చి ప్రియమారా ఆలింగనం చేసుకుని లోపలికి తీసుకెళ్లారు మహామాత్యులు. ఆయన ఆదరణకి ఉక్కిరి బిక్కిరి అయినాడు గన్నారెడ్డి.

"అమ్మాయినికూడా తిసుకురా ఈసారి వచ్చేటప్పుడు-లేకపోతేమా ఆవిడ ఊరుకోదు" అన్నాడు చనువుగా.

"బొనుగాపీ, అంత గట్టిగానటయ్యా కొట్టడం-మా అబ్బాయి చెంప చూడు ఎట్లా వాచిపోయిందో" అని చమత్కరించారు.

"మహామాత్యా! నేనేమిటి. తమ కుమారుణ్ణి కొట్టడ మేమిటి?" అని తల్లడిల్లాడు గన్నారెడ్డి.

చిన్నగా నవ్వుతూ "నరసింహా" అని పిలిచారాయన.

"ఏమిటి, నాన్నగారూ!" అంటూ వచ్చిన నరసింహుడి దవడ వాచిపోయి ఉంది. భయ సంభ్రమాలతో లేచి నిలబడి నమస్కారంచేసి అయోమయంగా చూశాడు గన్నారెడ్డి.

"సామంతులకి భుజబలమే కాదు. బుద్ధిబలమూ, సమయస్ఫూర్తి కూడా ఉండాలయ్యా, రెడ్డి వర్యా!" అన్నారు ఆయన.

"కోటి దీనారాలు నీకు బహుమాన మిద్దామని వస్తే. నువ్వేమో ఈ బహుమానం ఇచ్చావు రెడ్డి!" అని నవ్వాడు నరసింహుడు.

"అపచారం-అపచారం జరిగిపోయింది నాకు తెలియక-క్షమించండి" అని అగ్గగ్గలాడిపోయాడు గన్నారెడ్డి.

"క్షమించటమా? అయితే, నిన్ను పరీక్షించటానికి అబద్ధాలాడిన మమ్మల్ని నువ్వే క్షమించాలి" అన్నారు తండ్రి, కొడుకూ కలిసి.

మంత్రిగారు ఈ పద్ధతిలో విశ్వాసపాత్రులను ఎన్నుకుంటారన్న మాట. ఔను మరి, లేకపోతే నమ్మదగిన వారెవరో, నమ్మదగని వారెవరో తెలీక రాజ్యం క్లిష్ట పరిస్థితిలో పడుతుంది. "కాకతీయ సామ్రాజ్య రక్షణకి మీ వంటి యువకులే కావాలయ్యా.

మేము ముసలి వాళ్ళమై పోయాందా మాత్రం పని అయిపోయినట్లే-మీ తరం యువకులు నడుం కట్టి ముందుకొచ్చి దేశాన్ని కాపాడాలి



సుమా! ఇవాళ్టి నుంచి నువ్వు మా ఆంతరంగిక వర్గంలో ఒకడవి. కాకతీ సార్వభౌములకు నువ్వు చేసే సహాయం చరిత్ర మరిచిపోదు లేవయ్యా! ముందుతరాల వారు నిన్ను తలుచుకుని మురిసిపోవాలి-తెలిసిందా! రుద్ర దేవ దక్షిణ భుజాదండ అనేట్లు ప్రవర్తించు" అన్నారు శివదేవయ్యగారు.

నరసింహుడు రెడ్డిని కౌగలించుకుని "ఇవాల్టినుంచీ నువ్వు నా ఆప్తమిత్రుడివి. మనిద్దరం నాన్నగారి దగ్గిర ఖడ్గ విద్యలో మెలకువలు నేర్చుకుందాం. అప్పుడప్పుడు వస్తూ ఉండు" అన్నాడు ఆదరంగా

"ఖడ్గ విద్యలో మెలకువలా?"

"ఆశ్చర్యపోతున్నావా, రెడ్డి వర్యా! నాన్నగారు ఎవరికీ చెప్పని మెలకువలు కొన్ని నేర్చుకున్నారు. అవి ఇన్నాళ్లూ గుప్తంగానే ఉంచారు. బ్రాహ్మణులేమిటి, ఈ యుద్ధ విద్యలేమిటి-అనా! ఖడ్గ తిక్కనగారూ, బ్రహ్మరుద్రయ్యగారూ, భారతంలో ద్రోణాచార్యుడూ వీళ్ళంతా ఎవరు? ఔను. నీకు తెలియదా? నవలక్ష ధనుర్ధారులయిన తెలుగు వీరుల్ని వెనుక ఉండి ప్రోత్సాహించే మహావీరులు నాన్నగారే" అన్నాడు నరసింహుడు నవ్వుతూ.

" " " "

వీరభద్రుని శయనాగారం పల్చని వెలుతురుల మధ్య నిద్రా ముద్రిత దశలో ఉన్నది. కానీ, జాగ్రత్తగా వింటే సన్నని గుసగుసలు వినిపించక పోవు.

"ఇదంతా బెట్టుసరేనా? అర్ధరాత్రయినా వస్తావు గానీ దూరంగా కూర్చుంటావు!" అంటున్నాడు వీరభద్రుడు.

"మీకు తెలిసిందేగా. మహారాజా! వివాహం కాకముందు నన్ను తాకితే కాబోయే భర్తకి ప్రమాదమని ఎందరో జ్యోతిష శాస్త్రవేత్తలు ఘంటాపథంగా చెప్పారని చెప్పాగా, అర్ధరాత్రిళ్ళు రావటమంటారా... తమరు సార్వభౌములు కాగానే నన్ను పెళ్ళి చేసుకుని సామ్రాజ్ఞిని చేస్తామని అంటే, రాక తప్పటం లేదు" అంటున్నది వకుళ.

ప్రాణం అంటే తీపి లేని దెవరికి? ఇంకాస్త దూరంగా జరిగాడతను.

"సరేలేగానీ, ఆంధ్ర ప్రజలు ఏం కానున్నారోగదా? బాగా అయిందిలే. లేకపోతే నా ముందరే నా పెళ్ళానికి కైవారాలా? ఆమెకు రాజభోగాలూ, వెల్ల గొడుగూనా? నేనేమో ఆమె ముందు ఏబ్రాసి మొహంతో చేతులు కట్టుకుని నిలబడాలా? అమ్మో! నిజం చెప్పు. వకుళా నేను రాజుని కావాలా? నా పెళ్ళాం రాజు కావాలా? ముసలి రాజుకి బుద్ధి లేకపోతే మంత్రి సామంతులకే మైంది? తీపరం! రాజ్యం అల్లుడి కివ్వమని చెప్ప లేరూ ఎవరూ? అందుకే-అందుకే ముసలి మంత్రిగారికే ఎసరు పెట్టబోతున్నాను. చూడు, వకుళ. నా తడాఖా ఇక. ముసలిరాజు ఎలాగో చచ్చిపోయినాడు. ఈ మంత్రి పీడ విరగడ చేస్తినా-రుద్రమ కోరలు తీసిన పామై పోతుంది. నేను చక్రవర్తినైన తరువాత ఈ తొత్తు లందరినీ పదవుల్లోంచి ఊడ బెరికి పారేస్తాను. మహా ధైర్యశాలివి గదూ రుద్రమ! అఖిలాంధ్ర క్షమా మండలాధీశ్వరి కదూ! మరేంపాపం అట్లా ఉందీ? ఎవడో కడుపు మండిన నాలాంటి వాడు ఏ ప్రయోగమో చేసి ఉంటాడు." మదిర ఎక్కువై ఏదేదో వాగుతూ దగ్గరికి వచ్చి పడబోయాడతను.

ఆఁ లెండి, లెండి, అరెరే. దెబ్బ తగిలిందా? ఆ తల మీద



బొప్పి కట్టినట్లుంది. ప్చ్!" అని దూరంనుంచే సానుభూతి చూపించింది వకుళ.

"నాకామెను తల్చుకుంటే ఒళ్ళు మండిపోతున్నది అందుకే ఆ కోపంలో ఏదన్నా చేస్తాను" అన్నాడు వీరభద్రుడు. తాగుడు ఎక్కువయి తూలిపడ్డానంటే కాబోయే భార్య ఏమనుకుంటుంది!

"మనం సంతోషంగా మాట్లాడుకోక ఆవిడ సంగతి ఎందుకులెండి ఎప్పుడూను" అంటూ అయిష్టంగా మొహం పెట్టి సెలవు తీసుకుంది వకుళ.

భవన ప్రాకారం దాటేటప్పటికి ఎదురయినాడు బావ ఎల్లన దేవుడు

"ఏం బావా, ఏమైంది?" అని అడిగింది వకుళ.

"చెప్తా, నీ పని ఎంతవరకూ అయింది?"

"ఇలా దగ్గరికి రా, ఆ చెవి ఇలా పారెయ్యి."

"ఆజ్ఞ .. ఇదిగో చెవి"

"అర్థమయింది.... మరి చెవేదీ?"

"ఏయ్! ఏయ్, అల్లరి మితిమీరుతున్నది."

"ఓహో, చీకట్లో కనిపించలేదులే-చెవి ఇక్కడ లేదు కాబోలు" నవ్వుకున్నది వకుళ.

"సరే, ఇప్పుడు ఏదీ? ఇది చెవేనా? నీ అనుమానం నిజమే, జైన వసతి వారే ఈ పని చేసింది"

తల పంకించింది వకుళ.

"వాళ్ళ అంతు చూస్తానుసరే. రాణిగారి దగ్గిర ఎవరెవరున్నారు?"

"పాశుపత శివాచార్యుల వారిని ప్రయోగం విరుగుడు చెయ్య

దానికి పిలిచారట. రాజవైద్యుల వారు కూడా శాయశక్తులా ప్రయత్నిస్తున్నారట. నీ పరిచారిక చెప్పింది" అన్నాడు ఎల్లన.

"అలాగా! అయితే, ఇంక రాణిగారికి భయం లేదు. ప్రత్యక్ష మహేశ్వరులయిన పాశుపత శివాచార్యుల వారికి అసాధ్యం అన్నది ఉండదు. రాజ భిషగ్వరులు కూడా అక్కడే ఉంటిరి. చంపకమాల వాళ్ళు కాపున్నారుగా?"

"అవును ఇప్పుడు నువ్వక్కడికి వెళ్ళక్కరలేదులే-మరి శివదేవయ్యగారికి కబురు పెట్టనా?"

"అవశ్యం! విశ్వాసపాత్రుడిచేత కబురు చేయించు-నేను జైన వసదులవేపు వెళతాను."

"కామసానీ!"

"బావా!"

"ఒక్కతెవూ ఎంత కష్టపడుతున్నావు? పగటి పూట సహాయం చేద్దామంటే నా ఉద్యోగ ధర్మం అవకాశమివ్వటం లేదు. సరే, నేను మహామంత్రిగారికి కబురు పంపించి, అటునించి వచ్చి నీతో కలుస్తాను. ఇద్దరం కలిస్తే వాళ్ళ నేల మాళిగలని తొందరగా కనిపెట్టవచ్చు. నే వచ్చేవరకూ నువ్వు భద్రం సుమా?"

"బావా ఏమిటీ గొంతు అలా అయిపోయిందేం కంట తడి పెడుతున్నావా పిచ్చి బావా"

"నువ్వుకూడా అలా అయిపోతున్నావేం కామసానీ" ఆదుర్దాగా అడిగాడతను.



"ఏంలేదు బావా, ఏం లేదు" మనసుని సంబాళించుకుంది వకుళ. మామూలుగా అయిపోయింది.

"ఏమిటో మన పెళ్ళికోసం కలవరించి కలవరించి అమ్మ చచ్చిపోయిందా? ఇద్దరం ఒంటరి పక్షుల్లాగా మిగిలాము పేరుగొప్ప పూరుదిబ్బ అని నేనేమో దండనాథుణ్ణి నువ్వు యువరాజుల ప్రధాన ఇష్టసఖివి. పదవుల గొప్పతప్ప బ్రతుకుల గొప్ప ఏముంది మనకి"

"బావా అన్నీ తెలిసినవాడివి అన్నమయ్య కవీశ్వరుల శిష్యుడివి, నీకు చెప్పేపాటి దాన్నా? మనలాంటి ఎంతమంది సామాన్యులు రక్తం ధారపోస్తే సామ్రాజ్యం సుస్థిర మవుతుంది సామాన్యుల జీవితాలే పునాదిగా కదా సార్వభౌమ సౌధం నిలబడేది"

"అవును చివరికి మనపేర్లు సోదిలోకి కూడా వుండవు బిరుదులతోసహా వాళ్ళ పేర్లు " "అందుకని మన కర్తవ్యం విస్మరిస్తామా"

"లేదులే ఇహ పద .." డింటూ చీకటిలో కలిసిపోయినాడు ఎల్లనదేవుడు.

o o o

ఎల్లనదేవుడు పంపిన కబురంది ప్రక్క గ్రామమునకు పనిమీద వెళ్ళిన విశ్వేశ్వర శివదేవయ్యగారు ఆందోళిత చిత్తంలో నగరానికి తిరిగి వచ్చేశారు. ప్రొద్దున్నే కాళ్ళు కడుక్కుంటుండగా కాకి అరిచింది.

"ఎవరో మనింటి కొస్తారట-కాకి అరుస్తోంది" ఆయన పాదాలు

తరి ఒత్తుతూ అన్నది పార్వతమ్మ.

ఇదివరకైతే ఆయన "మీ పుట్టింటివాళ్ళెవరన్నా వస్తారేమో" అని వేళాకోళం ఆడేవాడు కానీ ఇప్పుడు అన్య మనస్కంగా విని ఊకొట్టారు పరిస్థితి అర్థంచేసుకున్న పార్వతమ్మ రాణిగారి పరిస్థితినీ వివరించటం మొదలు పెట్టింది "నిన్న అర్థరాత్రిదాకా అక్కడే ఉండి వచ్చా"మని చెప్పింది.

నిట్టూర్చారు శివదేవయ్యగారు. అప్పుడే నిద్రలేచి ఇవతలి కొస్తున్న మనుమడు బాలశివయ్య "తాతయ్యా" అంటు సంతోషంతో వచ్చి చంకనెక్కాడు. నాయనమ్మ చెబుతున్నది విని "అసలు నువ్వుంటే రాణిగారికి ఉష్ణం వచ్చేదేకాదు తాతయ్యా" అని తన నిశ్చితాభిప్రాయం చెప్పేశాడు. అప్పుడే సరిగ్గా వాకిటిలో బండి ఆగింది.

అందులోనుంచి బ్రహ్మతేజస్వి అయిన ఒకాయనదిగాడు. ఆయన చెవులకు కుండలాలు వేళ్లాడుతున్నాయి. ఆయన వెనకే భార్య కాబోలు బండి దిగింది. ప్రయాణంలో అలిసినట్లున్నారు.

కళకళలాడుతోంది ఆవిడ ముఖం..

నవ్వుతూ గబగబా ఎదురువెళ్లారు శివదేవయ్యగారు. పార్వతమ్మగారూ వచ్చారు వంటింటిలో పనిచేసుకుంటున్న అన్నపూర్ణ కాళ్ళకి నీళ్ళు తెచ్చింది.

"రండి వదినగారూ కాళ్ళు కడుక్కోండి ఎంత కాలానికి మా ఓరుగల్లు పావనమైంది అన్నయ్యగారూ బాపున్నారా" అంటూ సంతోషంగా పలకరించింది పార్వతమ్మ.



వాళ్ళ పలకరింపులయినాక

"ఆ .. మరే ఏదీ మా అబ్బాయి పెళ్ళికి మీ రెవరు రాలేదుగా" నిష్ఠురం ఆడింది పార్వతమ్మ

"ఏం చెయ్యమంటారు వదినగారూ మహామంత్రుల భార్యలమవటం మన తప్పు ఈ రాజ కార్యాల మనుషులు తీసుకొస్తారా ఏమన్నానా అందులో ఈమధ్య యజ్ఞంకూడా చేశారు ఇహ చెప్పక్కర్లేదు" అంది ఆవిడ నవ్వుతూ_

ఆవిడ పేరు ఆనందవల్లి. ఆయన తిక్కన సోమయాజి "ఇంతకీ మా చెల్లెల్ని లోపలికి రానిస్తావా? లేకపోతే వాకిటిలోనే అంతా మాట్లాడేస్తావా?" అన్నారు శివదేవయ్యగారు,

ముసిముసిగా నవ్వింది పార్వతమ్మ.

"ఇదిగో వదినగారూ మీరన్నట్లె వీళ్ళది ఇదీ వరస" అంటూ ఆప్యాయంగా చెయ్యిపట్టుకుని లోపలికి తీసుకెళ్ళిందావిడని.

"బావగారూ అట్లా ఉన్నారేమిటి?" అని అడిగారు తిక్కనగారు.

తన మనసులోని బాధ చెప్పుకోడానికి తగిన మనిషి దొరికేసరికి ఇక ఆగలేక రాణిగారి పరిస్థితి అంతా చెప్పాడు శివదేవయ్యగారు.

తిక్కనగారు ఆలోచనలో పడ్డారు.

"పదండి బావగారూ! ముందు వెళ్లి రాణీగారినిచూద్దాం" అనట

గోళకీ మఠాధ్యక్షులయిన శివాచార్యులవారు ఉన్మత్త భైరవాన్ని లొంగ దీయలేక పోవడమేమిటి?" అన్నారు.

"నేనూ బయలుదేరుతున్నాను మీరూ వచ్చారు పదండి, మిగిలినది దారిలో మాట్లాడుకుందాం" అన్నారు శివదేవయ్యగారు.

అంతఃపురం చేరుకొని గోన గన్నారెడ్డిని దగ్గరికి పిలిచి రహస్యముగా ఏదో చెప్పి, తిక్కనగారి చేయందుకుని లోపలికి నడిచారు శివదేవయ్యగారు.

వాడిపోయిన పువ్వులా హంసతూలికా తల్పంమీద పడి వుంది మహారాణి ఆమె పరిస్థితి నిన్నటికంటే క్షీణించింది. అది చూసిన శివదేవయ్యగారికి "ఇదంతా నీ అశ్రద్ధ ఫలితమే" అని ఎవరో కొరడాతో కొట్టినట్లయింది.

ఆయన వెంటనే శివాచార్యులవేపు నిశితంగా చూసి అమాంతం అతని రెక్క పట్టుకుని నిలబెట్టి "ఎవరునువ్వు?" అని ప్రశ్నించారు.

విదిలించుకుని పారిపోబోయాడు అతను.

"పులిబోనులోకి జొరబడిపారిపోదా మనుకుంటేకుదురుతుందిట్రా" అంటూ బయట సిద్ధంగా వున్న గన్నారెడ్డి అతడ్ని పట్టుకుని మంత్రిగారి దగ్గర నిలబెట్టాడు.

"ఓ వీడా! నగరంలో మారణహోమాలు చెయ్యటంలో ప్రసిద్ధికెక్కినవాడు కదూ! జైన వసతి నుంచి ఎంత ధైర్యంగా వచ్చాడో, గన్నారెడ్డి ఇతడ్ని తీసుకుపోయి ఈ నేరం ఎవరు చేయించారో



కనుక్కో" అని హుంకరించారు మంత్రిగారు.

"చేతబళ్ళ శ్వేతయ్యా! ఇక పద ముందున్నదిలే ముసళ్ళ పండుగ, కోటచుట్టూ ఉన్న కందకంలోని మొసళ్ళకాహారం అవుదువు గానిలే" అని లాక్కుపోయాడు గన్నారెడ్డి.

క్షణాలమీద మంచం చుట్టూవున్న ముగ్గుని కడిగేశారు- పరిచారికలు. అతను పెట్టిన విభూతిని తుడిచేశారు. అప్పుడు కదిలింది రాణి కాస్త అశాంతిగా.

ఇంక ఆలస్యం చేయలేదు తిక్కనగారు. స్నానంచేసి వచ్చి చంపకమాల కృష్ణాజినం పరవగా జపం మీద కూర్చున్నారు కాసేపటికి రాణి మొహాన ప్రశాంత చిహ్నాలుకనిపించాయి. అంతలో నరసింహుడు స్వయంగా వెళ్ళి అసలయిన గోళకీ మఠాచార్యులయిన పాశుపతి శివాచార్యులవారిని తీసుకుని వచ్చాడు, ఓరుగల్లులోని విప్ర సంఘ మంతా వచ్చింది ఆయన వెనక! ప్రతి దేవాలయములోనూ పూజలు ఇబ్బడి ముబ్బడిగా అయ్యాయి

రెండు ఘడియలకి కళ్ళు తెరిచింది మహారాణి "ఈ ఆర్భాటం అంతా ఏమిటి? అంతా నాచుట్టూ చేరారేమిటి? తేజస్సుతో ప్రకాశించే ఈయన ఎవరు మదనరేఖా?" అని ఆశ్చర్యంగా అడిగింది.

"స్వయంభూదేవా! గట్టెక్కించావా, తండ్రీ పరమేశ్వరా" అని చేతులు మోడ్చి దేవాలయంవేపు తిరిగారు దేశికులు. ఆమె స్వస్థురాలయితే అంతఃపురమేకాదు ఏకశిలా నగరమే కాదు, యావదాంధ్రము గట్టెక్కిందన్న మాటే.

ఇంటికి వెళ్ళాక "తిక్కనామాత్యా మీరు చేసిన ఈమహోపకారం మరువలేనిది" అని కౌగలించుకున్నారు అమాత్యులు,

"ఇందులో నేను చేసిందేమున్నది, బావగారూ! అంతా పరమేశ్వరుడి కృప" అన్నారు తిక్కనగారు.

"అదిగో-అదిగో-ఆ వినయం చూస్తుంటేనే . "

"బావమరుదు లిద్దరూ పరస్పరం పొగుడుకుందురుగాని ముందర భోజనానికి వస్తారా అపరాహ్ణం దాటిపోతోందికూడా" అంది పార్వతీదేవి వచ్చి.

ఇష్టాగోష్టితో భోజనాలయ్యాక కాసేపు నడుం వాల్చారు తిక్కనగారు. ఆయన లేచేటప్పటికి మహామాత్యుల భవనం ముందు అనేకులు గుమిగూడి పుండటం చూసి ఆశ్చర్య పోయారు.

ముఖమండపంలోనికి వచ్చిన తిక్కనని చూసి జనం ఒకరొకరుగా వచ్చి ఆయన పాదాల మీద పడటం ప్రారంభించారు. ఆయనతల్చుకుంటే గ్రహబాధలు నశించిపోతాయని, భూత ప్రేత పిశాచాలు పారిపోతాయని, రోగాలు తగ్గిపోతాయని ఒక నమ్మకం ఏర్పడిపోయింది ప్రజలకు,

"మంత్రి పదవికంటే భూతవైద్యం లాభసాటిగా కనిపిస్తోందండీ బావగారూ" అని నవ్వి "వీళ్ళంతా ఇట్లా పట్టిందారేమిటి నన్ను "అన్నారు తిక్కనగారు.

"మరి ఏమనుకున్నారు ప్రజలంటే? మహారాజును కాపాడినవారు



సామాన్య దనుకుంటున్నారా మహాశయా? మేం మటుకు వదిలిపెడతామటయ్యా" అన్నారు శివదేవయ్య దేశికులు.

ఇద్దరు మిత్రులు చలోక్తులాడుకుంటున్నారు. హజారం నుంచి ముత్యాల పల్లకీ వచ్చింది పార్వతమ్మగారిని తీసుకెళ్ళటానికీ, పార్వతమ్మ ఆనందవల్లి అన్నపూర్ణా రాణీగారి పరిస్థితి ఎలావుందో చూడటానికి వెళ్ళారు.

అక్కడ రాజమాతలు, సఖులు కంగారుగా ఉన్నారు ఒక్కముద్ద అన్నం తినమని బ్రతిమలాడుతున్నారు మహారాణిని మహానసశాఖాధ్యక్షులు సమీపంలోనే చేతులు కట్టుకుని నిలబడి ఉన్నారు.

"రాణిగారికి బొత్తిగా అన్నం సయించటం లేదుట అదేమిటో ఇప్పుడు హటాత్తుగా వేవిళ్ల వచ్చినాయి" అనుకుంటున్నారు చెలులు.

తాను నెల్లూరులో మనుమసిద్ధి రాణీగారితో చనువుగా మసలడం గుర్తుకు వచ్చింది ఆనందవల్లికి.

మెల్లిగా పార్వతీదేవితో "వదినగారూ మనం ప్రయత్నం చేయవచ్చునా?" అని అడిగింది.

"తప్పకుండాను మహారాణి దగ్గిర భేషజాలు లేవు ఆమె మనసు నవనీతం".

"భలే తెలివయిన వారమ్మా తమరు మాకు విషయం తట్టలేదు" అన్నారు రాజమాతలు.

"సరే మేం ఇంటికి వెళ్ళి వస్తాం" అని బయలు దేరింది

ఆనందవల్లి.

వెళ్ళగానే కాసిని బియ్యం పొయ్యిమీద పడేసి చింతకాయ పచ్చడి నూరింది అన్నపూర్ణ మడికట్టుకుని నిమ్మకాయ ఊరగాయ బయటకు తీసింది. ఇంటిలో వండిన కూర. పప్పు పులుసు, కాసిని వడియాలు వేయించి, అవన్నీ అంతఃపురానికి తీసుకు వెళ్లారు ఇద్దరూ కలిసి

ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే మహారాణి ఆ వంటను ప్రీతికరంగా భుజించింది. ఎన్నడో రామప్ప ఇంటిలో సుందరమ్మగారి వంట తిన్నప్పటి అనుభూతికి లోనయిందామె కానీ అసలు విషయం ఆనందవల్లి కనిపెట్టింది. మహారాణిగారి ఆహారంలో విషం కలిపే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆమెకి అనుమానం వచ్చింది. అందుకారోజు ఆమె ముద్ద నోట పెట్టలేదు.

"మహారాణీ మా మనవి వినండి తమకి వేవిళ్ళు తగ్గేదాకా మా మహామంత్రి అన్నగారింట్లో నుంచే భోజనం వస్తుంది" అని ధైర్యంచేసి విన్నవించింది ఆనందవల్లి.

ఆమోద సూచకంగా తల పంకించింది. మహారాణి ఆమె బ్రాహ్మణాభిమానానికి విస్తుపోయినారు అంతా "ఆమెకు కాదు ఆమె కడుపులో వున్న శిశువుకి బ్రాహ్మణాభిమానం-శుద్ధ సాత్వికం" అన్నారుకొందరు నవ్వుతూ,

వంటవాళ్ళ తలలు వాలిపోయినాయి. అంతలో రాజయ్య అనే అతను మెల్లగా జారుకున్నాడు.



"సమయానికి వచ్చి మీ భర్తగా రొక విధంగా, మీరొక విధంగా మా రాజ్యాన్నీ, మా మహారాణినీ కాపాడారు, తల్లీ!" అని ఆనందవల్లిని అంతా శ్లాఘించారు.

గన్నారెడ్డి కథ

వకుళ, ఎల్లనదేవుడూ కలిసి ఓరుగల్లులోని అనేక జైన వసతులలో జరుగుతున్న కుట్రలను నాశనం చేయసాగారు.

వీరశైవ మతస్థురాలు రుద్రమదేవి ఆంధ్ర చక్రవర్తిని కాబోతుంటే జైనులకు కన్నెఱ్ఱగా ఉంది. "మతం ముఖ్య కలహ కారణమై ప్రజలను ఉన్మాదులను చేయటం ఎప్పుడు మానుతుందో, ఎన్నడు ప్రజలంతా ఐక్యమత్యం వహించి సుహృద్భావంతో అన్నదమ్ముల్లా మెలగుతారో-ఈ పోట్లాటలు దేనికి? కూడు పెట్టేనా, గుడ్డ పెట్టేనా? ఎందుకొచ్చిన సంఘర్షణలో ఇవి? ఈ స్థితిని దాటి మానవజాతి కల్యాణపథానికి ఎప్పుడు చేరుకుంటుందో" అంటూంటుంది రుద్రమదేవి వకుళతో అంతరంగికంగా, అప్పుడు వీరశైవులకూ, వీర వైష్ణవులకూ నిరంతరం సంఘర్షణే జరుగుతుండేది. తరచుగా రక్తపాతాలు జరుగుతుండేవి. వీరికీ, జైన బౌద్ధాలకీ మళ్ళీ సంఘర్షణ-వీరు ఓడితే వారి మత గ్రంథాలను తగలపెట్టేసేవారు. సన్యాసులందరినీ నిర్దాక్షిణ్యంగా చంపేసేవారు-వారు ఓడితే గుళ్లూ గోపురాలూ నాశనం చేసేవారు. పిల్లలూ, ఆడవాళ్లూ ప్రాణాలు అరచేత పెట్టుకొని బ్రతకాల్సి వచ్చేది. సైన్యానికి ఈ పరిస్థితిని చక్కచేయటం కష్టంగా ఉండేది. కాకతీయులి వంటి సమర్థుల పరిపాలనలో కొంతవరకూ నయమైనా పూర్తిగా మాసిపోయా

యని చెప్పటానికి వీల్లేదు. రాణిని గద్దె దించి, అధికారం తమ హస్తగతం చేసుకోవటానికి జైన వసతుల్లోని రహస్య నేలమాళిగల్లో యుక్తి కుట్రలు జరుగుతుండేవి. ఆమె దాయాదులయిన హరిహర, మురారి దేవులకు వేరే మార్గం లేక రాజ్యంకోసం జైనులను ఆశ్రయించవలసి వచ్చింది.

సీమంతం రోజున రుద్రమని దీవించే నెపం మీద జైనస్వామి ఇచ్చిన మంత్రాక్షతలు చల్లారు వాళ్ళిద్దరూ ఆమె నెత్తిన "రాజ బంధువుల వారి నెవరు అనుమానిస్తారు? అందులో వారు కత్తి. కటారు లేం ధరించి రాలేదు. కేవలం అక్షతలే గదా" అనుకున్నారు చెలులు.

వకుళా, ఎల్లనా ఈ రహస్యం సంగ్రహించి దేవేరికి విన్నవించ వచ్చేసరికి అంతఃపురంలో కావలసినన్ని గందరగోళాలు జరిగినాయి.

బ్రతికి బయటపడిన రుద్రమదేవిని కళ్లారా చూసుకుంది వకుళ.

"ఎందుకు, వకుళ, ఆ కన్నీళ్ళు?" అడిగింది వీరనంగానవ్వుతూ రుద్రమ.

"నా తల్లి రుద్రమదేవిని ప్రాణాలతో చూసుకోగలిగాను అందుకు—సరేగానీ, మీరు త్వరగా మహారాజ పట్టాభిషేకం చేసుకోవాలి" అంది వకుళ.

"ఎందుకో?"

"ఇంక ఆగవద్దమ్మా! నా మాట వినండి. శత్రువుల తోక జాడింపులప్పుడు కుదరవు"



"నువ్వు నన్ను సామ్రాజ్ఞి అనే పిలుస్తున్నావుగా?"

"పోండమ్మా; వెక్కిరించకండి"

"వకుళ! సమస్త సామంతులూ నా అధికారాన్ని ఒప్పుకున్నాకనే, శత్రువులు లేకపోయినాకనే నేను పట్టాభిషేకం చేసుకుంటాను"

"మీ ఇష్టం-నేను చెప్పేది చెప్పాను. తమ అనుగ్రహం-మేమంతా మిమ్మల్ని ఇకనుంచీ అష్టమ చక్రవర్తి రాయగజకేసరి వీరరుద్రదేవ సార్వభౌముడిగానే భావిస్తాము" అన్నది వకుళ.

వీరభద్రుడు మదిర తాగకపోతే భార్యను ఏమీఅనలేదు-అప్పుడు ఎంతో బుద్ధిమంతుడిగా, భార్య యందు అనురక్తి కలిగిన భర్తగా ఉంటాడు. తాగాడా-ఇక కలిపురుషుడు కూడా అతనిముందు పనికిరాడు ఈ ద్వంద్వ ప్రకృతి ఆశ్చర్యపోయిన వకుళ అతనికి దగ్గరయిన తరువాత అసలు సంగతి కనిపెట్టింది.

మదిరాపానమత్తుడయి పల్లవ కొప్పెరుంజింగడికీ, రాజేంద్రచోళుడికీ, పాండ్యరాజులయిన జటావర్మ సుందరపాండ్యుడికీ,అతని సోదర్యుకీ ఆంధ్ర చక్రవర్తిని పైకి దండెత్తి రమ్మని చారుల ద్వారా వార్తపంపాడు చాళుక్య వీరభద్రుడు. ఆ సంగతి వకుళతో చెప్పేశాడు కూడాను. "అమ్మో! వీళ్ళలో ఒక్కొక్కరు దిగ్దంతుల్లాంటి పృథ్వీపతులు!అందర్నీ ఒకేసారి ఎదుర్కోవడం నా రాణికి భారం అవుతుంది-అసలే గర్భవతి ఈ మధ్య అనారోగ్యం.

పల్లవ కొప్పెరుంజింగణ్ణీ చోళ, రాజేంద్రుణ్ణీ అమ్మవారుచూసు

కుంటారు. ఈ పాండ్య సోదరుల పనినేనెందుకు పట్టగూడదు? అను కుంది వకుళ.

మురారి, హరిహర దేవులు జైనులతో చేతులు కలిపి దేశ నాశ నాన్ని కోరుతున్నారన్న సంగతి రాణికి చెప్పలే దామె. చెప్పకముందరే మహామంత్రి వాళ్ళ బెడద శాశ్వతంగా వదిలించేశారు.

విశ్వేశ్వర శివదేవయ్యగారి దగ్గరికి బయలుదేరింది సంగతి చెబ దామని.

జైనుల సంగతి చెప్పేటంతలో అక్కడికి తిక్కనగారు వచ్చారు

"ఆర్యా! తమరేనా తిక్కన కవీశ్వరులు? మహారాణిని బ్రతికిం చిన వారు తమరేనా?" అని భక్తిగా చేతుల మోడ్చింది వకుళ.

చిరునవ్వుతో ఆశీర్వదించా రాయన. "నీ మేధాశక్తి, నీ రాజ భక్తి అద్భుతమైనది. ఏం సమస్య తీసుకొచ్చావు మా బావగారికి" అని అడిగారు శివదేవయ్యగారు.

"నీటిలో జాడలు తీయగల తమవంటి మేధా సంపన్నుల ముందు నేనొక లెక్కా స్వామీ?" అంటూనే సంగతి చెప్పింది.

"భేష్! నీ ఉపాయం బావుంది" అన్నారు మంత్రివర్యు లిద్దరూ.

"కత్తితో బనులు కలంతో శత్రువులను గెలవడం బావుంది." అని వకుళకు ఒక శ్లోకం ఇచ్చారు. తిక్కనగారు చెబుతుంటే వకుళ తాళ పత్రం మీద గంటంతో వ్రాసుకుంది ఆ శ్లోకాన్ని.



దాని సారాంశమేమిటంటే-"ఓ పాండ్య సోదరులారా! ఓరుగంటి పీదికి మటుకు ఎప్పుడూ యుద్ధానికి రాకండి సుమా! అక్కడ జాజ్వలమా నమైన రెండు ఆడ కళ్ళు ఉంటాయి. పులి కళ్ళలా మెరుస్తూ-అవి మీ పౌరుషాన్ని హరించివేస్తాయి-జాగ్రత్త!!" అని.

ఆ శ్లోకం రాసిన తాళపత్రాన్ని అందుకుని భక్తిగా కళ్ళకు అద్దు కుని సెలవు తీసుకొని వెళ్ళిపోయింది వకుళ.

స్వస్థులైన వీరరుద్రదేవులు సభ తీర్చారు. తిక్కనగారిని వెంట బెట్టుకుని సభకు వెళ్ళి ఆయన్ని ఉన్నతాసనంమీద కూర్చోబెట్టారు. శివ దేవయ్యగారు.

సార్వభౌముల ప్రాణాలు కాపాడిన తిక్కనగారిని ప్రశంసించారు శివదేవయ్యగారు. తరువాత ఆ సభ నలంకరించి ఉన్న అచింతేంద్ర యతి, కవి చక్రవర్తి, బాలభారతి, త్రిభువన విద్యా చక్రవర్తి మొద లయిన విద్వత్కవులు తిక్కనగారిని ప్రశంసించారు. చక్రవర్తిని ఆశీర్వదించారు.

తరువాత తిక్కనగారికి అనేకమైన కానుకలు కొనిరాబడినాయి రాజభటులచేత, వీరరుద్రదేవుడు చేమ్ముట్టి వారికి పంపించారు.

కానీ, తిక్కనగారు అనాసక్తంగా ఉన్నారు అది గ్రహించిన మహారాజు "తమ మనసులోని అభిమతం సెలవియ్యండి. మహాపురుషా! కాకలు తీరిన కాకతియోధులు సిద్ధంగా ఉన్నారు" అని మందస్మితం చేశారు.

"తమ రెరుగని విషయము, మహాప్రభూ! మనుమసిద్ధి మహారాజు రాజ్యాన్ని కోలుపోయి వనవాసం చేసే ధర్మరాజు లాగా దురపిల్లుతుంటే, శిరిశ్రేయోభిలాషిని, మంత్రిని అయి వుండి ఈ మర్యాదలం కోవడానికి నాకు మనసొప్పటం లేదు. మన్నించండి! తమ అభయానికి కృతజ్ఞుణ్ణి" అన్నారు తిక్కనగారు.

మందహాసం చేశారు ప్రభువు.

"తెలుసు, కవీశ్వరా! తమరు ఓరుగల్లును పావనంచేసినారంటేనే అర్థమైంది. మా సామంతుడయిన మనుమసిద్ధిని మళ్ళీ సింహాసనం అధిష్ఠింపజేస్తాం. కొన్ని కొన్ని కారణాలవల్ల ఆలస్యం చేశాం. మమ్మల్ని మన్నించాల్సింది మనుమసిద్ధి మహీశ సమస్త రాజ్య భార ధౌరేయులైన తిక్కనామాత్యులవారు" అన్నారు.

తృప్తిగా నిట్టూర్చి చక్రవర్తిని ఆశీర్వదించారు తిక్కనగారు.

పెదవి చివర నవ్వు దాచుకుంటూ ఆనందంగా "ఎల్లవదేవా" అని పిలిచారు శివదేవయ్యగారు.

"ఆన" అని కత్తి దూసి నిలబడ్డారు దండనాథుడయిన ఎల్లనదేవుడు.

తగిన సేనా సమూహంతో విక్రమ సింహపురాన్ని ముట్టడించి, గెలిచి, మనుమసిద్ధి మహారాజుకు సింహాసనం అప్పగించి రావలసిందని చక్రవర్తి మాటగా చెప్పారు మంత్రిగారు.



తిక్కనగారిని "మామా!" అని పిలుస్తాడు మనుమసిద్ధిరాజు. అతడు విక్రమ సింహపురాన్ని పరిపాలించే వాడు తిక్కనగారు ఆయనకు మంత్రీ, గురువూ, సమస్తమూలు. విక్రమ సింహపురమంటే నేటి నెల్లూరు.

"మామా! నాపై తమకెంత వాత్సల్యం" అని మనుమసిద్ధి పొంగిపోతున్నట్లుతోచి తిక్కనగారి కళ్ళు చెమర్చినాయి.

ఆనాటి మధ్యాహ్నం భోజనాల వేళ ఒకటే సల్లాపాలు శివదేవయ్యగారింట.

"అవునుగానీ, బావగారూ! తమరు ఆనందాన్ని వదిలి ఉండలేరుట గదా!" అన్నారు దేశికులు నవ్వుతూ.

"అవును—జీవికి సదానందానుభవమే గమ్యం కదండీమరి" అన్నారు తిక్కనగారు.

"ఆ సంగతేదో అందరికీ తెలిసేటట్లు ఒక చక్కని ప్రబంధం రచించరాదుటండీ?"

నవ్వేశారు తిక్కనగారు.

"ప్రపంచానికి తెలియాలంటారా?"

"ఇదిగో—మన తెలుగు వాళ్ళు అనవసర వైరాగ్యం పెంచుకుని ఇట్లా అయిపోయారు. అవునుగానీ, బావగారూ! మీ అక్క ఏదో అంటున్నది వింటున్నారా?" అన్నారు దేశికులు నవ్వుతూ.

"ఏమనో?"

"ఆనందాన్ని వదిలి తమరు ఉండలేరుట గదా! ఆనందాన్ని వదిలి

ఎందుకు ఉండాలి? జీవితానికి ఆనందానుభవమే ప్రథమ లక్షణం గదా! ఎవరుమటుకు ఆనందాన్ని వదిలి దుఃఖాన్ని కోరుకుంటారు–చెప్పండి?"

"ఈ సంగతి తెలియడానికి ప్రబంధమేమన్నా రాయకూడదటండీ?"

ఎందుకు? అలాంటివి పెట్టుకునే మన తెలుగు వాళ్ళు ఇట్లా అయిపోయారు"

"ఎట్లాగంటారు?"

"సరియైన చారిత్రకజ్ఞానం లేకుండా"

"అరమరుగు మేలి ముసుగులో నందగించు ఆంధ్ర చారిత్రసుమనోహరాంగి భంగినోచువారు రసజ్ఞత మోచువారు"

"పోనిద్దురూ! అదీ అంతమేగా"

"భేషుగ్గా సమర్థించి, తప్పులనిపించుకున్నారు, బావగారూ!"

"అయినా, మన చేతిలో ఏముంది, స్వామీ! ఇచ్ఛా శక్తి జ్ఞాన శక్తి, క్రియాశక్తి స్వరూపిణి అయిన లలితా భట్టారిక చేయాలిగానీ"

"ఇంతకీ లలితా భటారిక తమచేత మహాభారతాన్ని ఆంధ్రీకరింప జేస్తుందా లేదా? అది చెప్పండి చాలు"

"బావగారు!"

"అట్లా నిర్ఘాంత పోతారేమిటి, మహానుభావా!"

"నేను ... మహాభారతాన్ని ...."



"తెనుగు చెయ్యాలి."

"మీ కీ ఊహ ..."

"మీ లలితా భట్టారికే ఇచ్చింది. ఇప్పుడేగా మీరు లలితా భట్టారిక అన్నారు. వెంటనే నాకు నన్నయ భట్టారకుల వారు గుర్తుకు వచ్చారు దాంతో మహాభారతమూ గుర్తుకు వచ్చేసింది. వారు తెనిగించగా మిగిలిన భారతాన్ని మా బావగారెందుకు రాయకూడదూ? మా ఏకశిలకి ఎందుకు పుణ్యం పండకూడదూ అనిపించింది భారతం పూర్తయినాక భాగవతాంధ్రీకరణ కూడా జరగాలి ఎంత ముఖ్య విషయమైనా నవ్వులతో తేల్చి చెప్పటం ప్రజ్ఞ. బావగారు! కానీ, కానీ"

"సందేహించటం ప్రాజ్ఞుల లక్షణం కాదు.కవీశ్వరా! విజయసేన కావ్యంలో మొగ్గగా, నిర్వచనోత్తరరామాయణంలో అరవిచ్చిన పుష్పంగా దర్శనమిచ్చిన తమ కవిత్వం ఆంధ్ర భారత రచనలో ఆరి తేరి,పరిపూర్ణ వికసిత పుష్పమై, ఆంధ్రావళి జన్మ ధన్యమై దర్శన మిస్తుందని ఆశ బడడం తప్పంటారా బావగారూ! దయచేసి తెలుగు జాతికి భిక్షపెట్టండయ్యా! ఉభయ కవిమిత్రులూ, ఉభయ కావ్య ప్రౌఢి రచనాభి శోభితులూ తమరు. సందేహిస్తే మన భారతం పూర్తిఅయ్యేదెట్లా? బావగారూ అని అర్థింగా తిక్కనవైపు చూశారు శివదేవయ్యగారు.

మేరు సమానులైన శివదేవయ్యగారు అట్లా బతిమలాడుతుంటే విశ్చేష్టు లయినారు తిక్కనగారు.

తాంబూల పేటిక తీసుకుని ఆడవాళ్ళు కూడా వచ్చారక్కడికి.

"చెల్లెమ్మా! ఒకసారి ఇలా వచ్చి మీ ఆయన పక్కన నుంచో, తల్లీ!" అని ఆనందవల్లిని పిలిచి చేతిలో తాంబూలం పట్టుకుని "తిక్కన కవీశ్వరా! ఉభయకవిమిత్రా! ఆంధ్ర సార్వభౌములు స్వయంగా సమర్పించే తాంబూలంగా దీనిని పరిగణించి, పరిగ్రహించ కోరుతున్నాను ఆంధ్ర మహాభారత రచన ప్రారంభించమని అర్థిస్తున్నాను, కాకతీయుల కాలం విజేతలకే కాదు, మహాశిల్పులకే కాదు, మహా కవులకీ ఆలవాలం అని చరిత్రలో నిలిచిపోగలదు. నా ఆశలను వమ్ముచేయకండి బావగారూ" అంటూ తిక్కనగారి చేతిలో తాంబూలం పెట్టారు శివదేవయ్యగారు ఉత్కంఠతో. "ఏకశిలలో కవులున్నారు, వారి మార్గం వేరు, శైవ వైష్ణవ మత పరంగా కూడా చాలామంది రాస్తున్నారు కానీ, మాకు వైదిక ధ్యాయిత కావాలి" అన్నారు.

"మామయ్య గారూ। అయం ముహూర్తః సుముహూర్తోస్తు. యావదాంధ్రుల తరపున నేను అర్థిస్తున్నాను. మేము కత్తితో అరికట్టలేని పరిస్థితిని మీరు కలంతో సరిదిద్దగలరని ఆశిస్తున్నాను మామయ్యగారూ।" అన్నాడు నరసింహుడు.

"మహాభారం వహించమని బొత్తిగా మొహమాట పెట్టేస్తున్నారే" అంటూ మాట్లాడకుండా శయన మందిరానికి దారి తీశాడు తిక్కనగారు

ఆయన ఏదో ఆలోచిస్తుంటే ఆనందవల్లి నిశ్శబ్దంగా కాళ్ళొత్తుతున్నది.

తిక్కన ఆలోచిస్తుండగా కళ్ళ ముందు ఏదో తేజోలోకమా ఇది! జాగ్రదావస్థ కాదు. స్వప్నావస్థో, సుషుప్త్యవస్థో తెలియటం లేదు. తను ఎక్కడికో తేలి పోతున్నట్లుంది। ఎక్కడికి?



"తిక్కనా ... నాయనా తిరుక్కాళత్తి నాథా।" ఎవరిదా పిలుపు? తండ్రి ఒక్కడే శ్రీకాళహస్తీశ్వరుడి పేరు తనకి పెట్టి పిలిచేది ఆయనఒక్కడే తిక్కన ఎదద పులకించింది.

"తండ్రిగారూ: తమరా? తమరా। నమస్కారం."

"అవునోయి, తండ్రీ, నేనే. ఇదిగో ఇటుచూడు నేనేకాక ఇంకెవరొచ్చారో-నీ కవితా కన్య నర్తించటానికి స్వయంగా విచ్చేసిన స్వామివారిగో ధన్యుడివి నాయనా నీ వంటి ఉత్తముణ్ణి పొంది మనవంశం కూడా ధన్యమైంది." అన్నాడు కొమ్మనామాత్యుడు.

మరుక్షణం తిక్కనగారికళ్ళుచీకటైనట్లయింది. కోటిసూర్యసంకాశమానమహా ప్రకాశంమిరుమిట్లు గొల్పుతున్నది. శతకోటిమన్మధులసౌందర్య ప్రవాహం వెల్లువలౌతున్నది.

కరుణరసం జాలువార్చే శశిరేఖ కాంతి ప్రసారంతో ఇంద్రనీల మణిపాత్రలో హరిచందనం ఉంచినట్లు, బొడ్డున పద్మం మెరయగా, గురితైన చెరువున మెరసిన లోకరక్షణ మన గరళంబు చాయ తోప, కట్టిన పీతాంబరం పసుపు వన్నెలలు కురియ, గంగా యమునా సంగమానికి మల్లె ధవళ వర్ణుడైన పరమశివుడూ, నీరమేఘచ్ఛాయ గల మహావిష్ణువూ చెరిసగమైన పరతత్త్వమై తిక్కనామాత్యుని మనసుని ఆనందమగ్నం చేస్తూ సర్వేశ్వరుడైన హరిహరనాథుడు ప్రత్యక్షమైనాడు. శివకేశవుల అభేద స్వరూప కల్పన ఆయన. రెండు విభిన్న మతాల సమ్మేళనం ఆ దివ్యభావన. అట్లా భావించి మత సమైక్యత సాధించటం తిక్కన లాంటి కవిబ్రహ్మకే చెల్లింది.

సాక్షాత్కరించిన భగభంతుణ్ణిచూసి ఆనందబాష్పాలు జాలువార భక్తి నిభతాలాంజలి పటాడు తిక్కన సోమయాజి ఆయన్ని చూసి నవ్వి "కృతిపతిత్వ మర్థించి వచ్చితి తిక్కాశర్మ" అన్నాడు హరిహరనాథుడు వైదిక మార్గ నిష్ఠమైన వర్తనాన్ని కొనియాడుతుంటాను అందుకని ఆ ప్రకారంగా వ్యాసమహర్షి సంస్కృతంలోరచించినమహాభారతాన్ని నువ్వు తెలుగు చెయ్యవయ్యా తిక్కనార్యా! నా కెంతో సంతోషం కలుగుతుంది. మతాల పేరుతో కొట్టుకోవడం, మారణకాండ సృష్టించడం నాకు మిక్కిలి బాధ కలిగిస్తుంది. నీవంటి కవులే నాప్రజలకి ఈవిషయం తెలియజెప్పాలి నేనే శివుడిని, నే విష్ణువుని అని విశదంచేసి స్వామి అంతర్ధానమైనాడు

అప్పుడు తిక్కనగారు ఆంధ్రావళి మోదముం బొరయునట్లుగ, వ్యాస భగవానుని హృదయం సువ్యక్తమయ్యేట్లు, మహా కవిత్వ దీక్ష విధినొంది భారత రచనకుఉపక్రమిస్తున్నాను, అనుకున్నారు"ధర్మాద్వై తస్థితి కలిగి ఉండుటచేత పంచమ వేదమైన మహాభారతాన్ని ఆంధ్రీకరి స్తాను. మొదటిమూడుపర్వాలు మహితాత్ముడై న నన్నయ్యభట్టు దక్షతతో రచించినాడు నాలుగవది విరాటపర్వం నానారసాభ్యుదయోల్లాసం, అక్కడి నుండి మొదలు పెట్టిపదిహేను పర్వాల మహాభారతం తుదిదాకారచిస్తాను· కొత్త రత్నాన్ని పదహారు వన్నెల పసిడితో జతపరిస్తేనే అందం. పది హేనుపర్వాల మహాభారతాన్ని దేవదేవుడైన హరిహరనాథుడికి అంకితం ఇస్తేనే అందం. పండితులను నేను మెప్పించగలనో, లేదో కానీ, ఏమైనా నేనేర్చిన భంగి చెప్పెద వరణీయుడనయ్యెద భక్తకోటికిన్"అనినిశ్చయిం చుకున్నాడు ఉభారాధన విరాజి తిక్కన సోమయాజి.

జాగ్రత్స్వప్న సుషుప్తులకు సాక్షీభూతురాలగు పరాదేవత లలితా భట్టారిక చిరునవ్వు నవ్వుకుని ఉంటుంది.



"ఆనందా! ప్రేమమయీ ప్రతి ఆశ్వాసం చివరన నీ పేరుధ్వనింప జేస్తాను. ఈ తిక్కన ఆచంద్రార్కమూ ఆనందనాయికా, హృదయేశ్వరు దేనుమా"

"ఏమిటి కలవరిస్తున్నారు?" అని భర్తను కుదిపి వేసింది ఆనంద వల్లి.

తిక్కనగారు మెల్లిగా కళ్ళుతెరిచారు. కాసేపటిదాక ప్రకృతిస్థులు కాలేకపోయారు. ఆయన వదనం అలౌకిక దీప్తితో వెలిగిపోతున్నది. కనుల వెంట ఆనంద్రాశువులు జాలువారుతున్నాయి.

"ఏమిటండీ? ఏమైందండీ?" గాభరాగా ప్రశ్నలు కురిపించింది. ఆనందవల్లి.

"నా జన్మ రాహిత్యం అయింది. ఆనందా! హరిహరనాథుడు నాకు సాక్షాత్కరించి ఆవరం ఇచ్చాడు. ఆ అఖండానంద సంధాయకుడు మహా భారతాన్ని తెనుగుజేసి తన కంకితమిమ్మని అడిగాడు. మనం తరించి పోయినాం ధన్యులమైనాం."

పులకించి పోయిందా ఇల్లాలు. "ఎంత అదృష్టంనాది ఎంత పుణ్యం మీకు.అయితే భారతాంధ్రీకరణకు ఒప్పుకున్నట్లేనా మీరు?"అనిఅడిగింది

"పిచ్చిదానా నేను ఒప్పుకునే దేమిటే స్వామివారు ఒప్పించేస్తే- నా చేతిలో ఏముందింక "అన్నారాయన.

"ఆంధ్రుల ఇష్ట గ్రంథానికి మహాభారతానికి మళ్ళీ ఒక మహా

పురుషుడి చేత అంకురార్పణం జరిగిన రోజు ఎంత మంచిరోజు" అని సంతోషించిందామె.

ఆ రాత్రి దంపతులు నిద్ర పోలేదు.

"ఇది దీక్ష ఆనందా! ఇప్పుడే ప్రారంభం నన్నయ భట్టారకుల ఆ రోజులలో తెలుగు భాష విస్తృతంగా రూపు దిద్దుకోలేదు కనుక ఎక్కువ సంస్కృత పదాలు వాడవలసి వచ్చింది. ఇప్పుడు నేనే చాలా వరకు తెలుగు పదాలు వాడుతాను. చిన్నచిన్న పదాల్లో ఎక్కువఅర్థంవచ్చేటట్లు ప్రయత్నిస్తాను." అని చెప్పారు తిక్కనగారు

ఆనందవల్లికి పెళ్ళయినప్పటినుంచీ భర్త మహాపురుషుడే ఇప్పుడు భగవంతుడై పోయినాడు,

మరునాడు పొద్దున్న "భారతం సంగతి ఏం చేశారు బావగారూ!" అని అడిగారు శివదేవయ్యగారు.

"చెయ్యడాని కేముందీ రచించడమే" సంతోషంతో తిక్కన గారిని ఆలింగనం చేసుకున్నారు శివదేవయ్యగారు.

"సంతోషం బావగారూ ఆంధ్రజాతి చేసుకున్న సుకృత మిది. మా ఓరుగల్లూ, కాకతీయుల కాలమూ ధన్యమైనవి, తెలుగువారు మీ పేర్లతో కలిపి మా పేరు పునశ్చరణ చేస్తారు" అన్నారు శివదేవయ్య.

తనూ, ఆనందవల్లి ఏకశిలా నగరం రహదారులలో చూసిన బాధాకర మత వైషమ్య పూరిత దృశ్యాలను గురించి ప్రస్తావించారు



తిక్కనగారు. వీరశైవ, వీర వైష్ణవ, బౌద్ధ, జైనమతాల మధ్య జరిగిన సంఘర్షణలను అదుపులో పెట్టడానికి శాయశక్తులా కృషిచేస్తూనే ఉన్నాం, బావగారూ! రాజ్యంలో శాంతిభద్రతలు లేకుండా చెయ్యాలని శత్రువులు మతం పేరుతో ప్రజల్ని రెచ్చగొడుతున్నారు. అక్కడికీ మతం పేరుతో జరిగే కలహాలని నిర్దాక్షిణ్యంగా అణిచివేస్తూనే వున్నారు. దండనాథులు. నా ఉద్దేశ్యం కత్తికంటే కలం గొప్పదని, అందుకే భారతాన్ని ఆంధ్రీకరించమని తమరిని అర్థించాను. వీరశైవ, వీరవైష్ణవఘర్షణలని వైదిక మార్గం తప్పకుండా ఆపగలదు. మీరు శాంతి దూతలవుతారన్న మాట. మహామనీషా సమంచితులు మీరు శతాబ్దాలకుగానీ తమవంటికవిని తెలుగు జాతి పొందలేదు! మీ వంటి సమదర్శనులు జాతి శ్రేయస్సుకి శ్రీకారం చుట్టారు. శుభం" అన్నారు శివదేవయ్యగారు.

యుగంధరుడు తొంగిచూశాడు,

"ఏం తండ్రీ" అన్నారు మంత్రి.

"తిక్కన తాతగారూ తమ కోసం నెల్లూరునించి ఎవరోవచ్చారు" అని చెప్పాడు బాలశివయ్య.

ఆ వచ్చింది కుమ్మరి గురునాథుడు। తిక్కన సోమయాజి కతడు శిష్యుడు- తమ్ముడు-లేఖకుడు?

"భగవదిచ్ఛ మహాభారతానికి లేఖకుడు వచ్చేశాడన్న మాట!" అన్నారు తిక్కనగారు.

"కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకు అన్నట్లు" అందించారు దేశికులు.

"ఏం కలిసి రావటమో" అన్నారు తిక్కనగారు.

శివదేవయ్యగారు చిన్నగా నవ్వి ఆయన భుజంతట్టి "ఉభయ కవిమిత్రా మీరు మా కోరిక ఇప్పుడు తీరుస్తున్నారు... మేము మీ కోరికని ఎప్పుడో తీర్చేశాము సుమండీ" అన్నారు.

"అంటే ..?"

"చతుర్విధ బలాలతో వెళ్ళిన ఎల్లన దండనాయకుడు నెల్లూరును ఆక్రమించుకున్నాడనీ, మనుమసిద్ధిని మళ్ళీ మహారాజుగా ప్రకటించి తిరిగి వస్తున్నాడనీ చారులు కబురు తెచ్చారు"

"బావగారూ! నిజమా?"

"అవును మహాకవీ, నిజమే"

"అవును స్వామి ఆ కబురుచెప్పి మిమ్మల్ని తీసుకుపోదామనే వస్తిని" అన్నాడు గురునాధుడు.

"అదేం కుదరదయ్యోయ్! ఇప్పుడప్పుడే మేము తిక్కనగారిని వదలం" అన్నారు దేశికులు నవ్వుతూ.

o o o

ఆ పూట త్రిపురాంతక దేవుడనే సేనాని గన్నారెడ్డి బాధ్యతతీసుకోవటంతో ఇంటి కొచ్చేశాడతను.



ఆశ్చర్య సంతోషాలతో ఎదురు పరిగెత్తింది అన్నమాంబ,

"ఏమండీ మా పినతండ్రి కూతురు లక్కమ్మకి పెళ్ళటండి, ఇదుగో శుభలేఖ. మనం అక్కడికి వెళ్ళి అట్నించి మన రాజధాని వర్ధమానుకి (వర్ధమాన పురం)కూడా వెళ్ళివద్దామండి అత్తగారు మామగారూ ఎట్లా ఉన్నారో ఏమో? ఈ వయసులో కూడా మామగారికి రాజ్యభారం తప్పటం లేదు ఇంత ఎదిగిన కొడుకుండి పాపం. మరిది విఠలయ్యే నయం. చిన్నవాడయినా తండ్రిగారికి ఆసరాగా వర్ధమానులోలోనే ఉంటున్నాడు, మనం ఎప్పుడు వెళదాం ఇంతకీ?"

"కాస్త గుర్రాన్ని కట్టెయ్, వర్ధమాన పురాధీశ్వరీ- మహారాణీ పట్టం కట్టుకుందామని చాలా ఆశగా ఉన్నట్లుంది అయినా ఓరుగల్లు రాజకార్యాలు వదిలేసి మొగుడితో లేచిపోదామనా? అదేం కుదరదు, అంతగా అయితే నువ్వు వెళ్ళిరా, నాకు కుదరదు" అని ఖండితంగా చెప్పేశాడు గన్నారెడ్డి.

ఏమిటీ మీరు రాకుండానా? ఎప్పుడయినా అలా వెళ్ళానా?"ఆమెకి కళ్ళమ్మట నీళ్ళు తిరిగినాయి.

"ఏమిటిది పిచ్చీ"

"అయితే మీరు రారా?"

"వద్దామనే ఉంది అన్నమా కానీ నా కెలా కుదురుతుందిచెప్పు? మహారాజూ దేశమూ ప్రమాదంలో ఉండగా"

బుసకొడుతూ అన్నది అన్నమాంబ.

" మహారాజుకీ, దేశానికీ ఎప్పుడన్నా ప్రమాదం ఉండక పోవట మంటూ ఉంటుందాఅసలు? అందుకు జన్మాంతమూ మనసరదాలుచంపుకో వలసిందేనా? అయినా మీకో రాజ్యం ఉంది, దాన్ని వదిలేసి ఇక్కడెం దుకుంటున్నారు? వర్ధమానకు మీరు యువరాజులని మరిచిపోయారా మహారాణి ధ్యానంలో పడి"

మరుక్షణం అన్నమాంబ చెంప చెళ్ళుమంది.

"ఛీ- ఒళ్ళు తెలిసే మాటాడుతున్నావా" అని అరిచాడు రెడ్డి.

అతని తీవ్ర రూపాన్ని చూసి నాలిక కొరుక్కుంది అన్నమాంబిక, "అంటే బీజరూపంగా దురుద్దేశం ఉన్నదా? ఎందుకిలాంటి మాట తన నోటినుంచి వచ్చింది ఎంత పొరపాటు" అనుకుంటూ.

"వనితాసేన నిర్వాహకురాలివయి ఉండి ఇది నువ్వనవలసిన మాటకాదు, అన్నమా" ఆర్తిగా అన్నాడు రెడ్డి.

"అవునులేండి నేనొక మొగుడికి పెళ్ళానన్న సంగతి మరిచిపో వాలి ఎప్పుడూ దేశ సేవా. రాజసేవా చెయ్యాలి. నా భర్తను ప్రతిరోజూ కళ్లారా చూసుకుని, నోరారా మాటాడుకోవడానికికూడా లేదు"

"నువ్వు చాలా మామూలు ఆడదానిలా ఆలోచిస్తున్నావు"

"ఎందుకు ఆలోచించకూడదు? నా భర్త నా దగ్గిరే ఉండాలనుకో వటం తప్పా?"



"కాదుకాదు"

"మరి?"

"ఇలాగే అందరి భర్తలూ భార్యలతో హాయిగా వారి కళ్ళముందు కూర్చుంటే అదనుకోసం చూస్తున్న శత్రు సైన్యం అవలీలగా రాజ్యాన్ని ఆక్రమించుకుంటే అప్పుడు నీ భర్తా ఉండడు, ఎవరిభర్తలూ ఉండరు. చెరసాలలోనా కోట గుమ్మానికి వేలాడుతూనో ఉంటారు. ఆ తరవాత జరిగే హింసకీ, మానభంగాలకీ సిద్ధమామరి?"

"ఏమండీ?"

"నువ్వే ఆలోచించు, విధి నిర్వహణ ప్రధానమా కాదా? శ్రీకాకతి రుద్రదేవులు మకుటాభిషేకం చేసుకుని చక్రవర్తిగా ప్రకటించుకునే దాకా ఓపికపట్టు. ఆ తర్వాత మనం వర్ధమానపురం వెళ్ళిపోదాం అమ్మా వాళ్ళలకి విశ్రాంతి ఇద్దాం. ఏదో సరదా పడుతున్నావుగా మన పట్టాభిషేకం కోసం .. అదీ జరుగుతుంది. చక్రవర్తి జరిపిస్తారు. అప్పుడు మన రాజ్యాన్ని విశ్వాసపాత్రులయినవారు పరిరక్షించవద్దూ! వాళ్లూ మనలాగే తిట్టుకుంటే? తప్పు, అన్నమా అలా అనకూడదు. ఆ ఇల్లాలు భర్త అనాదరణతో ఎంత బాధపడుతున్నదో నీకూ తెలుసు. రుద్రమాంబాదేవి మహా పతివ్రత. నీ బదులు నేను చెంపలు వేసుకుంటానులే. ఒక్క ఏడాది లోపల చాలాసమస్యలు తేలిపోతాయి" అన్నాడు నిదానంగా స్థిరంగా, గంభీరంగా గన్నారెడ్డి.

"క్షమించండి...ఏదో బాధతో అన్నాను. కానీ మహారాణిగారి సంగతి నాకు తెలియదా? కానీ మనం సుఖపడటం లేదన్న దుగ్ధ పోవ

టం లేదండీ నాకు" కన్నీరు నించింది అన్నమ.

ఆమెను దగ్గరికి తీసుకుని, చిన్న పిల్లలా బుజ్జగించాడు రెడ్డి.

సుఖాని కంత మెక్కడ. అన్నమా పోనీ అఖండ ఆంధ్ర మండలాధీశ్వరి శ్రీ రుద్రమదేవి వారేమన్నా సుఖపడుతున్నారా. నీ ప్రకారం ఆవిడకంటే మనమెంతో నయం. ఎప్పుడూ మనకంటే ఎక్కువసుఖపడే వాళ్ళతో కాదు, తక్కువ సుఖపడేవాళ్ళతో పోల్చి చూసుకోవాలిగాని, ఇంకా మనం ఈ మాత్రం హాయిగా ఉన్నాం. సంతోషించు"

ఆ తర్వాత శయనాగారం ఘుమఘుమలతో ప్రకాశించింది. అన్నమాంబని చాలాసేపు బ్రతిమాలి, ప్రసన్నంచేసుకోవాల్సి వచ్చింది గన్నారెడ్డి.

ప్రసన్నమయిన అన్నమదేవి మహోత్తుంగ తరంగంలా రాజిల్లింది.

భర్తకి వీణ మీటి వినిపిస్తుండగా ఇద్దరిమధ్యా ఒక బాణం వచ్చి పడింది. ఆ బాణానికి ఒక లేఖ గుచ్చి ఉంది. మెరుపులా దాన్ని అందుకున్నాడు రెడ్డి.

"సాహిణీ నేటి రాత్రి అన్ని టపాదారులనూ కాపలా కాయించు. విద్రోహులు శత్రువులకు పంపబోయే లేఖలుబయల్పడగలవు జాగ్రత్త

ఇట్లు
శ్రేయోభిలాషి"

అన్నమాంబికకి మళ్ళీ దిగులు ముంచుకొచ్చింది, 'కాసేపయినా



మా ఇద్దర్నీ హాయిగా వుండనివ్వరా ఏం' అని అంతలో అతనన్న మాటలు గుర్తుకొచ్చినాయి. "శత్రువులు గ్రామాలని ఆక్రమించుకుని, తగులబెట్టి ఆడవాళ్ళ నెత్తుకుపోయి, పొలాలని పాడుచేస్తుంటే అప్పుడు-మహారాజు కాపాడనిది రక్షణ ఎక్కడిది శాంతి భద్రత లెక్కడివి" గబగబా కవచాదులు తెచ్చి అతనికి అందించింది అన్నమ.

గన్నారెడ్డి కళ్ళలో నుంచి అనురాగం, సంతోషం గాఢంగా ఉబికి వచ్చినాయి.

ఆమెని ఒక చేత్తో ఎదకు హత్తుకుంటూనే రెండోచేత్తో ఆయుధాలు అందుకున్నాడతను.

"అన్నమా నేను వెళ్ళొస్తాను ఇధిశివదేవయ్యగారి కబురుకావచ్చు అన్నట్లు ఏ ప్రమాదమయినా రావచ్చు కత్తితిప్పగల ధైర్యశాలివి. వనితా సేన నిర్వాహకురాలివి. అంతే చక్రవర్తులకు పరోక్ష రక్షకురాలివి. విధిని మరచిపోకు అవసరమయితే మహా మంత్రులను కానీ కుప్పమాంబికగారిని కానీ కలుసుకో" అంటూనే అదృశ్యమైనాడు రెడ్డి,

° ° °

ఈమధ్య తరుచు రుద్రమ దేవి భవనానికి వీరభద్రుడు వస్తున్నాడు ఆరోజు అంతఃపురానికి వచ్చిన భర్త అన్యమనస్కంగా ఉండటము చూసి "అలా ఉన్నారేమిటి" అని అడిగింది.

"ఏం లేదు-మీ మీద హత్యా ప్రయత్నాలు" అంటూచటుక్కున ఆగిపోయాడు.

"భయంలేదు, ప్రభూ అఖండ మేధా సంపన్నులూ, మంత్రదీక్షాపరులూ అయిన శివదేవయ్యగారి అభేద్యమైన వజ్ర పంజరంలోఉండగా నాకే అపాయం జరగదు. ఒకవేళ నా కేదన్నా అయినా ఆంధ్రదేశానికి ఓరుగంటి వజ్ర సింహాసనానికి ఇంకా సుమారు డెబ్బయి అయిదు సంవత్సరాల దాకా భయం లేదని కార్తాంతికులు ఘంటాపథంగాచెపుతున్నారు" అన్నది రుద్రమదేవి.

వెలవెలబోయే మొహానికి నవ్వు పులుముకుని "సంతోషం దేవి భావి సామ్రాట్టులు ఏమంటున్నారు" అంటూ ఆమె గర్భాన్ని అలవోకగా స్పృశించాడు.

ఎర్రబడిన మొహాన్ని వంచుకుని "మీరన్నట్లు భావి సామ్రాట్టు ఉదయించదేమో తమరి కింకో పుత్రికామణి కలుగుతుందేమో" అందామె.

వాళ్ళ గదిలోనే ఓ పక్కగా ఆడుకుంటున్న ముమ్మడమ్మ పరిగెత్తుకుంటూ వచ్చి "భావి చామరాత్తు అంటే ఎవరు నాన్నగారూ నా నా బొమ్మలలో ఉంటే నేనిస్తాను అమ్మగారికి" అన్నది ముద్దుగా.

ఫకాలుమని నవ్వాడు వీరభద్రుడు.

"బాల వాక్యం బ్రహ్మ వాక్యం అంటారు నాకు కొడుకు పుట్టడు కాబోలు ఆడపిల్లను రాజును చెయ్యటం నాకిష్టంలేదు, కనుక ముమ్మడమ్మ కొడుకు తన మనమడే రాజవుతాడేమో" అనుకుంది రుద్రమ.

వీరభద్రుడు ఆమె ఆలోచన గమనించాడు. "నీబొమ్మల సామ్రా



ట్టుకాదమ్మా. మీ అమ్మగారి బొజ్జలో ఉన్న తమ్ముడు సామ్రాట్టు మాట అడిగానులే సరేనువ్వు పోయి ఆడుకో" అన్నాడు కూతుర్ని ముద్దుపెట్టుకుని.

"దేవీ పరిష్కరించ వలసిన రాజకీయ సమస్యలేమైనా ఉన్నాయా" అని భార్యని అడిగాడు.

రుద్రమ ఏదో చెప్పబోయింది కానీ, చెప్పకపోవటమే మేలను న్నది మళ్ళీ. రాజకార్యాల్లో ప్రాణమిత్రులను కూడా నమ్మకూడద గురువుగారు శివదేవయ్యగారు చెప్పటం గుర్తుకొచ్చింది

"ఏం లేదు. నీకేమైనా సాయం చేద్దామని అడిగాను. అవును రుద్రమా! మన కాల్బలం ఎంత ఉంది?" యథాలాపంగా అడిగినట్లు అ గాడు ఆయన.

కానీ, ఆ మాట ఎట్లా చెబుతుంది తను? భర్తగానీ భగవంతుడుగా తన నోటితో చెప్పకూడదు.

"ప్చ్! మహారాజా! ఆ లెక్కలన్నిటినీ చూసుకోవటానికి దండనా ఉన్నారు గదా! నాకంత గుర్తుండదు. మీరున్న కాసేపు కూడా ఈ రా కార్యాలేనా. ఏదన్నా కాస్తసరదాగా మాట్లాడుకుందాం. విసుగు తగ్గుతుం అన్నది రుద్రమ

ఆమెకి నిజంగా తెలియదో, తెలిసీ చెప్పటంలేదో తెలీలేదు వీ భద్రుడికి. తన ఎత్తులేం పారలేదు మొత్తానికి ఏదైతేనేం.

"నువ్వే చెప్పు దేవీ! ఏమన్నా కబుర్లు అన్నాడు నవ్వి

"ఏమో మహారాజా! ఏం చెప్పను? మనిద్దరం, మన పాప బిడ్డలు హాయిగా ఇల్లాగే ఎప్పుడూ ఉంటే బాగుండుననిపిస్తుంది వేరే వ్యాపకాలేం ఉండకూడదు. పోనీ, జీవితపు చరమాంకంలోనైనా ఈ రాజ్య భారం వారసుడి మీద మోపి, వానప్రస్థం స్వీకరించి, ఏ పల్లె పట్టులోనో కాలం గడుపుదామా ఇద్దరం" అన్నది రుద్రమ ఆర్తిగా.

ఆమె ఆశ అడియాశ అనీ, అతి తొందరలోనే ఆమె వానప్రస్థం అవలంబించబోతుందనీ ఆమెకప్పుడు తెలీదు.

ఇటు సామ్రాజ్య వైభవం, పదవీ వ్యామోహం, అటు భార్యా కుటుంబమూ దేన్నో ఒకదాన్ని వదులుకోవాలి తప్పదు. వీరభద్రుడికి ఒక్క క్షణం ఊపిరాడలేదు, "దేవీ! దేవీ" అంటూ రెండు చేతులతో చుట్టి ఎదపై తల దాచుకుని ఆమెని ఉక్కిరిబిక్కిరి చేసి వెళ్ళిపోయినాడు వీరభద్రుడు.

భర్త కనుమరుగవుతూ ఉంటే, చూస్తూ నుంచుంది రుద్రమదేవి. ఎందుకనో అతను కనుల బడటం అదేఆఖరిసారి అనిపించింది. అమంగళం శమించుగాక అనుకుంటూనే అతణ్ణి కళ్ళనిండుగా చూసుకున్నదామె.

అది అరణ్య ప్రాంతం. నిశీధ సమయం ఇద్దరు అశ్వికులు మహా వేగంతో పయనిస్తున్నారు. చెట్లమీద పొంచి ఉన్న ఎనిమిది మంది వీరులు హఠాత్తుగా ఆ అశ్వికుల్ని అడ్డగించారు ఊహించని ప్రమాదానికి బిత్తరపోయిన అశ్వికులు నిలదొక్కుకునేసరికి వాళ్ళ చేతులు సంకెళ్ళలో ఉన్నాయి.

ఆ వీరులు వాళ్ళ దగ్గరున్న వస్తువులు వెతికారు. అందులో ఒక



ఉత్తరం దొరికింది అనుకున్నట్లే.

"శ్రీ కాప్పెరుంజింగ మహారాజుకు స్వస్తి

మేము ఇదివరకు పంపిన లేఖ అందియే యుండును. మీ దండయాత్రకిది మంచి అదును. సన్నాహము లొనరించ వలసినది, పైగా నిచటి ముసలి మంత్రి ఆగడములు తుదిముట్టించ వలసి యున్నది, శివదేవయ్య తోడున్నంతవరకు వీరభద్రదేవు దజేయుడు.

ఇట్లు-
వీరభద్ర "మహారాజు."

అది చదువుకుని తల పంకించారు వాళ్ళు,

తరువాత రెండు రోజులకి శివదేవయ్యగారి మనుమడు బాలయుగంధరుడని ముద్దు చేసే బాలుడు కనిపించటం లేదని గగ్గోలు చెలరేగింది. నగరంలో ఏదేదో అలజడి ఒక్కసారిగా రకరకాల వదంతులు.... దొంగలు ఊరిమీద పడబోతున్నారనీ, సన్యాసులు పిల్లల్ని ఎత్తుకెళ్ళి బలి ఇస్తారనీ, రుద్రమదేవి ఇక పరిపాలించలేదనీ.

అవును, ఆడది రాజ్యం ఏలుతుంటే అన్నీ అనర్థాలే జరుగుతాయి అన్న ముక్తాయింపు చివర చేర్చబడేది. ప్రజలు భయభ్రాంతులైనారు.

మహారాణికీ వార్త అశనిపాతంలా తోచింది, సీమంతం రోజు పేరంటానికి వచ్చిన ముద్దులు మూటకట్టిన మంత్రిగారి మనుమడు కళ్ళలో మెదిలాడు. పెద్ద కళ్ళు, విశాలమైన నుదురు, ఎగుభుజాలు తేజోవంతమైన పసివాడి స్వరూపం మర్చిపోలేక పోతున్నదామె.

"ఒకసారి ఏమోయి బాలకా పెద్దవాడివై నాకు మంత్రిత్వం చేస్తావా?" అని పరిహాసం చేస్తే నిజమే ననుకున్నాడా బాలుడు.

"ఓ! చేస్తాను మిమ్మల్ని ఎవరయినా ఎత్తుకెడితే నేనెళ్లి పట్టుకొస్తాను... తెలుసా" అన్నాడు గర్వంగా.

తనకి నవ్వొచ్చింది

"ఎత్తుకెళ్ళటమేమిటి" అన్నది.

"మేమంతా అంటే మా విద్యానాధుడూ, ఇందలూరి అన్నయా లాంటి. పిల్లలమంతా కలిసి మంచి ఆట ఆడుకున్నాంలే పొద్దున రాజాగార్ని దొంగలెత్తుకెడితే నేనూ, విజిగాడూ వెళ్ళి విడిపించుకొస్తామన్న మాట అదీ ఆట. బాగుంది కదూ" అన్నాడు.

ఆ పిల్లవాడి మాటలు గుర్తొచ్చి గుండె బరువెక్కి పోయిందామెకి.

"నన్ను విడిపిస్తా నన్నావేమిటి తండ్రీ! నిన్నే ఎత్తుకెళ్లారా నీచులు" అంటూ మండిపడింది. సకల దండనాథులనీ పిలిచి చిన శివదేవయ్యని తొందరగా వెతికి తీసుకురమ్మంది. వారికి మంచి బహుమానం ప్రకటించింది. నగరమంతా కట్టుదిట్టమైనా కాపలా పెట్టించింది. తనే స్వయంగా మహామంత్రి గారింటి కెళ్ళి అందరినీ ఓదార్చి వచ్చింది.

గోన గన్నారెడ్డి దొర నిద్రహారాలు మాని రాత్రింబవళ్ళు తిరిగి నగరంలో అబద్ధపు ప్రచారాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులను చేసిన ఇరవైమంది గూఢచారులను పట్టుకున్నాడు ఉప్పల సోముడినీ, తుద ముట్టించాడు.



కాకపోతే శివదేవయ్యగారి మనమణ్ని ఎవరెత్తుకెళ్లారో ఎవరికీ తెలియదు. సత్రురాజులు విస్తు పోయినారు-తమకంటే ముందరే ఎవరెత్తు కెళ్లారు? అని.

"అంటే, ఆ పసిపిల్లవాడి భద్రతకు తగిన ఏర్పాట్లు జరిగినాయన్న మాట. అందరూ తమని అనుమానిస్తున్నారు" అని మల్లగుల్లాలుపడ్డారు

నిజానికీ ఆ బాలుణ్ని ఎత్తుకుపోయిదాచేసింది మల్యాల గుండయ్య ప్రభుమి భార్య కుప్పసానమ్మ పేనవారు టపా దారుల్లో కాపగా కాని ఆయా ఉత్తరాలు చదివి విషయం అర్ధం చేసుకుని మళ్ళీ వాళ్ళని విడిచి పెట్టారు.

శత్రువులు చేద్దామనుకున్న పనులేమిటో అర్ధం చేసుకుని వాటికి ప్రతీకారం చేశారు వాళ్ళు,

మల్యాల గుండయ్య ప్రభువుకు ముగ్గురు కొడుకులు. వాళ్ళతో హాయిగా ఆడుకుంటున్నాడు చినశివదేవయ్య. ఇంటికెళతానని ఎప్పుడైనా ఏడిస్తే ఏదో సర్ది చెప్పుతున్నది కుప్పసానమ్మ. రకరకాల కథలు చెప్పేది. పిండి వంటలు చేయించి పెట్టేది.

ప్రజలు వారివారి పిల్లల నందరినీ జాగ్రత్త పెట్టుకోడం జరిగింది. దీనివల్ల శత్రువుల ప్రచారాలు ఒక విధంగా మేలే అయిన వనుకున్నది కుప్పసానమ్మ.

రెండు రోజులాగి రుద్రమదేవిని సందర్శించి విషయమంతా వివరించిందామె.

ఏమిటీ! ఆ బాలుడిని శత్రువులు ఎత్తుకు పోదామనుకునేంతలో మీరే దాచేశారా? రాజభక్తి పరాయణుడయిన గుండయ్యగారికి తగిన ఇల్లాలు మీరు . మంచి పని చేశారు కానీ ."

"ముందే ఎందుకు చెప్ప లేదంటారా? ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకని..."

సెలవివారా నవ్వింది రుద్రమ. గుండె మీది నుంచి పెద్దబరువు దించినట్లయింది. ఎందుకనో ఏమో! ఆ పిల్లవాడు కాకతీయ వంశాన్ని కాపాడుతాడన్న ఆలోచన ఏమైనా పెద్ద ఇబ్బంది గట్టెక్కిందని అనుకుంది.

"అయితే, ఈ ధనాన్ని మీ వనితా సేన వారికందరికీ బహూకరించండి. వనితలు చేస్తున్న ఈ సమయాన్ని రుద్రమ ఎప్పుడూ మర్చిపోదని చెప్పండి. పితాలిచ్చినంత మాత్రాన వారు చేసిన సేవకి ప్రతిఫలం ఇచ్చినట్లు కాదు" అని ధనం బహూకరించింది మహారాణి ఆనందంగా. ఆమె నట్లా చూసిన పరిచారికలు కూడా ఆనందపడ్డారు.

రుద్రమదేవి ఈ శుభవార్తను మహామంత్రి కుటుంబానికి విశ్వాసపాత్రురాలయిన పరిచారికతో కబురు చేసింది. ఆ మాత్రం సంతోషంగా ఆమె ఎంపకుండాలన్నట్లు ప్రాసాదాదిత్య నాయకుడు ఆమెకొక సమాచారం అందించాడు.

మనసు కలగుండు పడుతుంటే రుద్రమ ఆలోచనా మందిరానికి వెళ్ళి తలుపులు వేసుకుంది. చివరికి చంపకమాలకీ, మదనలేఖకీ కూడా



ప్రవేశం ఇవ్వలేదు.

అయిలే తను అనుమానించినట్లుగానే ఉందన్నమాట వకుళ ప్రవర్తన. ఉత్తముడైన ఎల్లన దేవుడిని చేపట్టబోతూ వకుళ ఇట్లా ఎందుకు చేస్తున్నట్లు తన ప్రాణసఖి అంత కుసంస్కారికాదే! మరి చాలా సార్లు అర్ధరాత్రివేళల వీరభద్రులవారి మందిరానికి వెళ్ళి వస్తుందని అంతఃపుర గూఢచారులు విదర్శనాలతో విన్న విస్తున్నారంటే

ఎందుకిలా చేస్తోంది వకుళ? కోరికోరి కొరివితో తలగోక్కున్నట్లు రాజ్ఞీత్వాన్ని ఆశిస్తున్నదా? ప్చ్! పదవీ వ్యామోహం, ఐశ్వర్యవాంఛా ఎంత చెడ్డవి? నవ యువకుడైన ఎల్లన్నను కాదని నడి వయస్కులైన వీరభద్రులను కోరటానికి అదేనా కారణం?

ప్రతిసారీ తను ఆయన గురించి ఆలోచిస్తున్నప్పుడల్లా, నిరీక్షిస్తున్నప్పుడల్లా తీసుకు రాగలిగిందంటే.... ఔను నిశ్చయంగా అంతే అయి ఉంటుంది ఆమె పెదవి చివర నవ్వు, ఇంతలో ఏవో మంగళతూర్య నాదాలు వినిపించాయి. ఆలోచన అక్కడితో ఆపి గవాక్షం దగ్గరికి వెళ్ళి చూసింది రుద్రమ. విజయలక్ష్మిని చేపట్టి వెల్లూరి నుంచి తిరిగి వస్తున్నాడు ఎల్లన దండనాయకుడు. తరువాత నిండు సభలో ఎల్లన దేవుడిని ఘనంగా సత్కరించింది, ఆమె కనుసన్న ననుసరించి సర్వ సైన్యాధిపతి అంబదేవుడు వచ్చి ఎల్లన్న మెడలో నవరత్న హారం ఉంచి అభినందించాడు.

తరవాత మహామంత్రి లేచి "ఈ మహావీరుడికి ఉపహారంగా మరొక హారంకూడా బహూకరిస్తున్నారు వీరరుద్రదేవులు" అని ప్రకటించాడు.

వకుళాదేవి చేతికి పుష్పహారం ఇచ్చి అతని దగ్గరికి నడిపించుకొచ్చారు చెలికత్తెలు వాళ్ళిద్దరి మొహాలలోని తత్తరపాటు చూసి రుద్రమదేవి కనుచివరల మందహాస రేఖ విసిరింది. చెలికత్తెలు సంబరంగా అక్షతలు పంచుతున్నారు. ఆస్థాన గాయకుడు సీతమ్మ పెళ్ళికూతురాయెనే రామయ్య పెళ్ళి కొడుకాయెనే, అని వీణానాదం చేస్తున్నాడు.

అంతా అర్థమైన ఎల్లనదేవుడు ఈశుభసమయంలో తన తల్లి లేకుండాపోయినందుకు చింతించాడు. తన మెడలోని నవరత్న హారం తీసి వకుళాదేవి మెడలోవేశాడు. ఆమెపుష్పహారాన్ని అతని మెడలో వేసింది "అయం ముహూర్త స్సుముహూర్తో స్తు" అని శివదేవయ్యగారు తన చేతిలోని అక్షతలను వాళ్ళిద్దరి శిరస్సుల మీద ఉంచారు. మరుక్షణం వధూవరుల మీద అక్షతలు కురుస్తున్నాయి. పూవులు చల్లబడుతున్నాయి. వాటితోబాటు ఇంకో వస్తువుకూడా పడబోవటంచూసిన వకుళ గబుక్కున మహారాణి కడ్డంవెళ్ళింది. కనురెప్పపాటులో ఆమెని తోసేసి మహారాణి లాఘవంగా దాన్ని ఒడిసి పట్టుకున్నది. అది ఏమిటంటే, పూలచెండుతో కట్టబడిన విషపూరితమైన చిన్న కత్తి.

సభ అంతా హాహాకారాలతో నిండిపోయింది. "గన్నారెడ్డీ, అంబదేవా. అడిదమ్మా, ఆదిత్యవరదుణ్ణి బంధించండి" అనిగర్జించింది రుద్రమదేవి మహావీరులు తప్ప అతణ్ని జయించి పట్టుకోలేరు. పైగా అందుకు రాజాజ్ఞ కూడా కావాలి. ఆదిత్యవరదుడు సామాన్యుడు కాదు. వీరభద్ర మహారాజుల వారి ప్రధాన అంగరక్షకుడు. "నా ప్రాణాలు కాపాడరా విరరుద్ర మహారాజులు" అని తరతర లాడింది వకుళ.

"నువ్వు నా బహిః ప్రాణానివికూడా, వకుళా! నా అభిమాన



పుత్రికవు నిన్ను కాపాడి నన్ను నేను కాపాడుకున్నాను. ముమ్మడమ్మ నా ప్రథమ పుత్రిక. ఆమె తరువాత ప్రపంచంలో నాఅభిమానంచూరగొన్నది నువ్వే. అందుకే నువ్వు నా ద్వితీయ పుత్రికవు ఈరోజునుంచీ" అంటూ ఆ సభలో ఆసీనులై ఉన్న వీరభద్ర మహారాజును ఓరగా చూసింది రుద్రమ. ఆయన మొహం మాడిపోయి ఉంది అప్పటికీ ఏం చెయ్యలేక వకుళ వంక కోర చూపులు చూస్తున్న వాడల్లా, భార్య అట్లా చూసేసరికి తల వంచుకోవాల్సి వచ్చిందతనికి. వకుళ తనకు కూడా కూతురేగా అయ్యేది మరి ఈ లెక్కన. వకుళకూడా వీరభద్రుడి వేపు చూసింది. "రా, బావా! నా తల్లిదండ్రులైన రాజదంపతులకు దణ్ణంపెడదాం" అంటూ ఏలనవ్వుతో ఎల్లనతో కలిసి రుద్రమాంబకీ, వీరభద్రుడికీ నమస్కారం చేసింది.

తేలు కుట్టిన దొంగకు మల్లే కిక్కురు మనలేదు వీరభద్రుడు. ఏం చేసేందుకు వీలులేని సభాముఖం అది. అక్కడికి తను నమ్మినబంటు, కుడిభుజం అయిన ఆదిత్యవరుడు నమ్మకద్రోహి అయిన వకుళను అంతమొందించడానికే ప్రయత్నించి పాపం మృత్యువుకి ఎర కాబోతున్నాడు.

తప్పని సరై మొహం గంటు పెట్టుకొని వీరభద్రుడు ఆశీర్వదించినట్లు చెయ్యి పెట్టాడు వాళ్ళ నెత్తిన. "అనుకూల దాంపత్య ప్రాప్తిరస్తు ఇతోధిక సౌఖ్య ప్రాప్తిరస్తు" అని నిండు మనస్సుతో దీవించింది రుద్రమదేవి. ఆమె సమయస్ఫూర్తికీ, దూర దృష్టికీ, లాఘవానికీ, నైపుణ్యానికీ, సౌజన్యానికీ సభాసదులు ముగ్ధులై పోయినారు.

ఒక చెలికత్తెను దత్తపుత్రికగా స్వీకరించుటే కాదు, ఎన్నో కానుకలిచ్చి, ఆమెమనసెరిగి నచ్చిన వరునితో సభాముఖంలో వివాహం

చేయించట మంటే మాటలుకాదు. ఏ చక్రవర్తి ఇంత ఉదారబుద్ధిని చూప గలదు

"యస్యాపి తీర్ణం కిలచిన్తయన్తి
చిన్తామణిః స్థావరతాంజగామ
యస్యాయశ స్స్వామ్య కునాశ్రయసీ

దేనుశ్చ దివ్యా సురభిర్బభూవ" అని కీర్తించారు రుద్రమదేవిని. "రుద్రమదేవి యొక్క దానమును చూచి చింతామణీ రత్నం నిలకడ గలిగిన దైనది. ఆమె కీర్తితో సరితూగలేక కామధేనువు సురభి జంతువు గాఉండెను." అని ఆ శ్లోకం అర్థం.

రాజగురువు శివదేవయ్యగారి మనుమడిని మళ్ళీ భద్రంగా ఆయన కప్పు చెప్పింది కుప్పమాంబ.

పేరోలగంలో శత్రువుల పన్నాగమూ దాన్ని మల్యాల కుప్పాంబిక విఫలం చేసిన తీరూ, ఆ కష్టం గట్టెక్కాక బాల శివదేవయ్యని మళ్ళీ అప్పగించిన తీరూ వివరించింది చక్రవర్తిని. ఆ సందర్భంగా మల్యాల కుప్పమాంబా, గుండయ సేనానులకు కాకతీయ గరుడధ్వజాన్ని బహూకరిస్తున్నట్లుగా ప్రకటించింది.

"మల్యాల రెడ్లు తమ భుజబలపరాక్రమములతో, అసమానమైన స్వామి భక్తితో మా తాతగారైన రుద్రమదేవులనూ, తండ్రిగారైన గణపతి దేవులనూ మెప్పించి పెదముట్టుగండ, ద్వీపీలుంటాక బిరుదములు పొందారు. ఇప్పుడీ కాకతీయ రాయగరుడాంకమూ అందుకున్నారు



అందుకు వారికి నా అభినందనలు" అన్నది రుద్రమదేవి

విశ్వేశ్వర శివదేవయ్యగారి మనమడు దొరకగానే ఇల్లంతా ఆనంద భరితమై పోయింది. తిక్కనగారు ఆంధ్ర మహాభారతమును ప్రారంభించారు.

"శ్రీయనగౌరి నాబరగు చెల్వకు చిత్తము పల్లవింప భద్రాయిత మూర్తియైన హరిహరంబగు రూపము దాల్చి విష్ణురూపాయ నమశ్శివాయ యని భక్తజనంబు వైదికధ్యాయిత కిచ్చమెచ్చు పరతత్త్వము గొల్తు నభీష్ట సిద్ధికిన్" అని మొదట హరిహరనాథుడికి నమస్కారం చేసి భారతము రచించసాగారు. రాజకీయాలవైపు బుద్ధి చెదరకుండా కవిత్వం పైనే దృష్టిని కేంద్రీకరించారాయన. నెల్లూరులో యజ్ఞం చేసేటప్పుడు ఆయన యజ్ఞదీక్షితుడు. ఇప్పుడు కవిత్వదీక్షితుడు.

మహారాజ్ఞి అభ్యర్థనపై అంతఃపురానికి వెళ్ళి తాను తెనిగించిన భాగాన్ని ఆమెకి వినిపించి వచ్చేవారు. ఆస్థానం నించి పల్లకీ వచ్చేది ఆయన కోసం.

రాజకీయ కల్లోలాలు నివురు గప్పిన నిప్పులా కొన్నాళ్ళు ప్రశాంతమైనాయి. తెలుగు భారతాన్ని శ్రద్ధగా వినేది రుద్రమ. ఆమె కామాత్రం ప్రశాంతం చిక్కితే ఎటా అన్నట్లు ముంచుకొచ్చింది యుద్ధవార్త.

పల్లవరాజు కొప్పెరుజింగడు ఆంధ్రదేశంలో రాజ్యం ఏలుతూన్న

ఒక ఆడపురుగును నేలబెట్టి కాలరాయడానికి ప్రచండ వేగంతో వచ్చి పడుతున్నాడు. ఆ వార్త విన్న ఆంధ్రరాజ్ఞ వదనం జేవురించింది మహారుద్రుడు మూడవ కన్ను తెరిచాడనిపించింది. సకల సామంత దండనాథ బృందాలకు, ఆయుధాలు పదును పెట్టబడుతున్నాయి.

ప్రజలెప్పుడూ యుద్ధాలు కోరుకోరు. శాంతినే కోరుకుంటారు. భయంకర మారణకాండ ఏ మనుషులు కోరుకుంటారు, భోగభాగ్యాలులేక పోయినా, కడుపులో చల్ల కదలకుండా కష్టార్జితం తిని బతికితే చాలనుకుంటారుకానీ.

వనితా సేన సమావేశమైంది. ఎరుకలసాని వేషాల్లో, సివిరాంధ్ర వేషాల్లో, పుష్పలావికల వేషాల్లో బయలుదేరి దుష్ప్రచారాన్ని అరికట్టి ప్రజలకి ధైర్యం చెప్పారు వనితలు.

రక్తపాతం జరగకుండా, తన బలాలు నాశనం కాకుండా శత్రువులను లొంగ దీయటం మంచిదని రుద్రమ ఉద్దేశం తప్పనప్పుడు తప్పనే తప్పదు. తప్పినప్పుడు రక్తపాతం తప్పించటమే. శత్రువుల పన్నాగాన్ని వృద్ధుడయిన మేనమామ జాయప సేనాని తన చారులద్వారా తెలుసుకున్నారు. అది విని ఆలోచనలో పడింది రుద్రమదేవి.

ఎల్లనదేవుడితో కలిసి ప్రజయ వీథుల్లో విహరించమనీ, ఈ రాజకీయాల గోల కనీసం కొన్నాళ్ళయినా పరిహరించమనీ వకుళకి చిలక్కి చెప్పినట్లు చెప్పింది రుద్రమదేవి. వారి విలాస విహారాలకు ఉద్యానవనంలో ఉన్నత భవనాన్నిచ్చింది. ఇప్పుడప్పుడే ఈ భవనంలోంచి



బయటికి వస్తే ఊరుకోను సుమా అని చమత్కరిస్తూ కోప్పడ్డది కూడా.

కట్టుదట్టమైన కాపలా గల ఆ సుందర మందిరంలోకి వకుళనీ, ఎల్లననీ తీసుకువెళ్లారు చంపకమాలాది చెలులు, నవ్వులు రువ్వుతూ

అదిచూసి ఎల్లన ఆలోచనలో పడ్డాడు "కామసానీ! ఇదేమిటి? మహారాజుల ఉద్దేశం అర్థం అయిందా నీకు? బయట తలుపులు వేసి పోయినా రేమిటి? "ఆశ్చర్యపోయినాడు.

వకుళ మాట్లాడలేదు ఏదో ఆలోచిస్తూంది నిజంగా ఇది చెరసాల" అయితే. ఎందుకు ఎన్నాళ్ళదాకా జీవితాంతమూనా ఎందుకిలా"

ఎల్లన ఆమె ఆలోచన పసిగట్టి ఏదేదో మాటాడుతూ ఆమెనుఅలరించసాగాడు "అబ్బ! ఎంత బాగుంది వకుళ, ఈ మందిరం! రాణివాసం ఇంత రమణీయంగా ఉంటుంది కాబోలు! నాకిన్నాళ్లూ తెలియదు సుమా ఈ మూల లతలు ఎంత బాగా అల్లుకున్నాయో చూడు హంస తూలికా తల్పం ఎంత మృదువుగా ఉంది! ఈ తలగడల మీది చేతి పనితనం— ఓహో!" భర్త ప్రేమలో మునిగి, అతని కాగిలిలో కరిగి జీవితంధన్యమైందనుకున్నది వకుళ కానీ, మహారాణి గురించిన ఆలోచనవదల్లేదామె.

అర్ధరాత్రివేళ పెనవేసిఉన్న భర్త చేతులుతొలగించిమెల్లిగాలేచింది వకుళ. అటూఇటూ పరికించి, చీర గోచీ పెట్టి గవాక్షం దగ్గరికి వెళ్ళి దూకబోయింది. గబుక్కున వచ్చి పట్టుకున్నాడు ఎల్లన.

కంగారు నలుచుకుంటూ నవ్వుతోయి "బావా లేచావా" అన్నది.

"లేవక ఇంకా నిద్రపొమ్మంటావా, కామసానీ చెప్పు అసలు నీ ఉద్దేశమేమిటి? సరిగా కాపరం చేద్దామనేనా"

"ఎంత మాటన్నావు బావా?"

మరి ఏమనమంటావు చెప్పు ఎక్కడికి నాకు చెప్పకుండా ఇంత అర్ధరాత్రి రహస్యంగా గోడదూకి పోతున్నావు? నీ మనసులోని మాట నాకెందుకు చెప్పవు నిన్ను వదిలి నేను బ్రతకగలనా?" తరతరలాడి పోయినాడు ఎల్లన.

'బావా నువ్వు నిద్రలేచే లోపల తిరిగి వచ్చేద్దామనుకున్నాను. ఒక్కసారి రాణిగారిని చూసి వచ్చేస్తాను' ఆర్ధింపుగా అన్నది వకుళ.

సరే పద నేనూ వస్తాను.

ఈసారికి నన్ను వెళ్ళనీ, బావా ఇద్దరం వెళితే కాపలావాళ్ళు అనుమాన పడవచ్చు లేనిపోని రభస జరుగుతుంది. నా బంగారు కొండ కదూ ఈ ఒక్కసారి నేను వెళ్ళొస్తాను.

నిట్టూర్చాడు ఎల్లనదేవుడు

○ ○ ○

చిమ్మ చీకటి ఎక్కడో తప్ప కాగడాల వెలుతురు లేదు అటు



వంటి వేళ రాచనగర్లోనికి దూకారు కొప్పెరుంజింగడూ, రాజేంద్ర చోళుడూ, 'ఆ ఈ వంటింటి కుందేలుని పట్టడం ఎంత సేపులే ఇంతోటి ఆడదాన్ని గెలవడానికి సైన్యాలు కూడా ఎందుకు దండగ అన్నాడు కొప్పెరుంజింగడు. సరే అన్నాడు రాజేంద్రచోళుడు. వాళ్ళిద్దరూ మహా యుద్ధ విశారదులు. అద్భుత బల సంపన్నులు. ఖడ్గవిద్యా నిపుణులు.

ఇప్పుడు రుద్రమదేవి పూర్ణ గర్భిణి సమయం అర్ధరాత్రి ఉన్నది ఋద్ధాంతం కనక గన్నారెడ్డిగానీ, గుండయసేనానిగాని అంబదేవుడు గానీ ఎవరూ సాయం వచ్చే అవకాశంలేదు. వకుళాదేవి కొత్త పెళ్ళి కూతురు అయినా ఆ ప్రాంతాల లేదు చంపకమాలాది సఖులున్నా పెద్ద లెక్క చెయ్యవలసిన పనిలేదు.

ఇట్లా బలాబలాలు నిర్ధారించుకొని ఆ వీరులు కాకతీయ రాణితో పోరుకి తలపడ్డారు.

ఆరోజు రుద్రమదేవి ఒనర్చిన ఖడ్గ చాలనం మున్నెన్నడూ ఎరగరు చంపకమాలాదులు. ఆహా తమ ఏలిక కాత్యాయనీ దేవియా అనుకున్నారు. వాళ్లుకూడా యధాశక్తి ఆమెకు బాసట అయినారు. అరగడియ పోరు తరవాత గర్భవతి కనుక రుద్రమదేవి నీరసించి పోయింది.

అప్పుడామెకి వకుళ గుర్తువచ్చింది- వకుళ వకుళ అనుకున్నది

అంతలోనే ఆ వకుళ అక్కడ ప్రత్యక్షమైంది. కాసెకోకబిగించి అక్కడున్న కత్తి నందుకుని మహారాణి మీరు తప్పుకోండి అంటూ విజృంభించింది.

ఆమెను గెలవటం అసాధ్యమే అయింది. శత్రువులకి ప్రస్తుతం

బందీగా ఉన్నప్పటికీ.

అంతవరకూ వారికి తోడు నీడగా వ్యవహరించిన వాడు వీరభద్రుడు, రాణాంతఃపురపు గుట్టు మట్టులన్నీ వారికెరుక పరచినవాడు విభ్రముడు. అంతిదాకా ఎంచుకు అంతఃపురానికి దారిచూపి తీసుకు వచ్చిందికూడా అతడే రుద్రమదేవి యుద్ధం చేస్తున్నంత సేపూ అతడు విర్నిమేష దృష్టితో చూస్తున్నాడు వకుళ రాగానే ఓసి పిశాచి నన్ను మోసంచేస్తావా అన్నాడు.

కత్తితోనే ఆయనకు నమస్కారం చేసింది వకుళ.

తండ్రిగారూ నేనేం చేసినా అమ్మగారికోసమే చేశాను. మీద్రోహ బుద్ధిని కనిపెట్టటానికి అంతకంటే ఉపాయం కనిపించలేదు మన్నించండి అన్నది.

నిస్తేజుడయి నిలబడిపోయినాడు వీరభద్రుడు వకుళ వ్యక్తిత్వం హిమాలయ సదృశమైతే ఆమె ముందు తానొక పిపీలికమై నేలలోకి కుంచించుకు పోతున్న భావన కలిగిందాయనకి.

తను ఇంత క్రితం శత్రువులతో చేతులు కలిపిందేగాక వారికి మార్గదర్శకుడై మరీ తన ఇల్లాలు నివసించే అంతఃపురానికి తీసుకు వచ్చిన సంగతి మదిలో మెదిలి ఇల కరుచుకు పోయినాడు.

రాజ్యం ఏలటం అబలల వల్ల ఏం అవుతుందిలే అని లొట్టలువేసుకుంటూ వచ్చారు. రాజేంద్రుడూ, కొప్పెరుంజింగడూ అంతఃపురంలోకి మదిరా వివశత్వంలో ఏం మాటాడుతున్నారో వాళ్ళకి తెలియటంలేదు,



ఓహో కాకతీయ శిల్పుల పనితనం ఎంత బాగుంది అంతఃపురం ఆ తల్పాలన్నిటి ఎండా అమ్మాయిలేకదూ నిద్రపోతున్నారు. ప్రమీలా నగరంలా ఉందిక్కడ భేష్, మనకి గుబురుపెట్టి రప్పించి ఎంత పుణ్యం కట్టుకున్నారు, చాళుక్య వీరభద్రులు. ఆయనే లేకపోతే ఈ అంతఃపురమూ ఇందులోని అందమూ దక్కేవి కావు మనకి అని కోలాహలంగా వెక్కిరింతలుగా నవ్వుతూ త్రుళ్ళుతూ పేలుతూ కుదా తంలోకి జొరబడ్డారు శత్రురాజులు. వాళ్ళకి దారిచూపిస్తున్న వీరభద్రుడు ఇక సహించలేకపోయినాడు.

ఏమిటి మీరు మాటాడేది రాణివాసం శీలం మాట మీకనవసరం ఆ మాట ముందే చెప్పాముగా అంతఃపురం చుట్టు కాపలా పెట్టించేస్తే చాలు మీరు రాజ్యం వశమై పోయినట్లే. రాజ్యం పాలించాలంటే పురుషుడే కావాలి. స్త్రీ చేతకాదు అని నిరూపించి సింహాసనం నాకప్పగించి వెళ్ళిపోండి మీ దేశాలకి. ప్రతిఫలంగా మీకిస్తామన్న రాజ్య భాగం తీసుకోండి అన్నాడు.

కహకహ నవ్వారు వాళ్ళు

భలేవాడివయ్యా వీరభద్రా నీకు రాజ్యంకావాలా ఎంత ఆశ తాడి తన్నే వాడుంటే వాడి తలదన్నే వాడు ఇంకొకడుంటాడు అంతదూరం నించి విపరీతంకా డబ్బు తగలేసి సైన్యాలను పోగేసుకుని మేము వచ్చినది నీ పట్టాభిషేక సంబరం చూసి మురిసిపోడానికా ఇలాంటి వార్ని విన్న రాజనీతి వేత్రి అని పేరొందిన రుద్రమ్మ ఎలా భర్తగా మన్నిస్తుందో. ఛీ .. అద్దుతప్పుకో పిరికిపందా రేపట్నించి సౌందర్యమూ

చాతుర్యమూ రాజనీతి కలబోసి తయారయిన రుద్రమ్మ మా దేవేరి కాగలదు రేపే మేము విశాలమైన ఆంధ్రదేశానికి చక్రవర్తులమవుతాం. నీకుమల్లే మేమూ మా పట్టమహిషిని తృణీకరించి అవమానించం రత్నాన్ని రాయిగా భావించే మూఢుడివి నువ్వుగాని మేంకాదు. అంటూకత్తుల దూసి వీరభద్రుడి గుండెకి మోహారు.

కళ్ళముందున్న చీకటి తెరలు ఒక్కసారిగా చీలినట్లయింది వీరభద్రుడికి.

ఆగారేం రాజేంద్రా నాకు తగిన సన్మానంఇది కానీ ఒకసంగతి గుర్తుపెట్టుకోండి నా భార్య నా రుద్రమదేవి దుర్గాదేవిలా విజృంభించి మీకు తగిన శాస్తిచెయ్యక మానదు. మీ నాలుకలు చీల్చక మానదు అన్నాడు.

ఎంత మాటన్నావురా నీచుడా అంటూ ఆయన్ని అక్కడున్న ఒక స్తంభానికి బంధించి కత్తి ఎత్తాడు కొప్పెరుంజింగడు.

మరుక్షణంలో వీరభద్రుడి తలా మొండెమూ వేరు కావలసిందే కానీ హంసతూలికా తల్పంమిదినుంచి చెంగున దూకింది రుద్రమాంబ జేవురించిన వదనంతో నిప్పులు రాలే కళ్ళతో చేతిలో చంద్రహాసం చివరపలతో. ఆ వెంటనే మంచాలనించి మిగిలిన స్త్రీలు సాయుధపాణులయి దిగారు రాజేంద్రచోళుడు బయట వేచిఉన్న తమ కొద్దిపాటి సైన్యాన్ని రమ్మని సౌజ్ఞ చేశాడు, చండీ శక్తుల్లాఉన్న అంతఃపుర స్త్రీలకి సైన్యానికీ పోరు తీవ్రంగా జరిగింది.



శత్రురాజు లిద్దర్నీ ఏకకాలంలో ఎదిరించి పోరాడుతున్న రుద్రమదేవికి సహాయంగా ఎక్కణించో వకుళ ఊడిపడింది.

"అమ్మయ్య" అనుకున్నాడు వీరభద్రుడు. "క్షణంలో ఎంత ఘోరం తప్పింది. చేజేతులా భార్య శీలానికి ఆపద తేబోయిన తను మటుకు ఇక బ్రతక కూడదనుకున్నా డాయన. నర రానా పశ్చాత్తాపం పొంగి పొరలింది.

"ఓహూ! నారీశిరోమణీ! ప్రజ్ఞాధురీణా! చారచక్షూ! రుద్రమదేవి! నిన్ను చూసి గర్విస్తున్నాను. నిన్ను చెట్ట పట్టి ధన్యుణ్ణి అయినాను. ఇప్పుడు నా కళ్ళు తెరిపిడి పడినాయి. నీ అపసర్ప గణాలు ఎంత జాగరూకాలు! అర్ధరాత్రి శత్రువులు అంతఃపురంలోకిప్రవేశించ బోతున్నారని వార్త పంపినాయిగదూ. అందుకే ఖడ్గంతో సహా సిద్ధంగా ఉన్నావు. చాళుక్యుల కోడలా. ఎదురుగా భర్త ఉండికూడా ఏంచెయ్యలేని అసహాయ స్థితిలో క్రుగ్గుతుంటే, నీ శీలం నువ్వే కాపాడుకున్నావా? అవునులే సీతాదేవి శీలం రాముడు కాపాడాడా? ద్రౌపది శీలం పాండవులు కాపాడారా?"

నిమిషంలో శతకోటి ఆలోచనలుచేస్తున్న భర్తను చూసి ప్రళయ కాల అగ్ని శిఖా సదృశ్యంగా మండిపడింది రుద్రమదేవి. రాజేంద్రచోళుడినీ, కొప్పెరుంజింగడినీ, వీరభద్రుడినీ బంధించి కారాగారానికితీసుకెళ్ళారు స్త్రీ సైనికులు వారి నేరాలు తరువాత విచారించ బడతాయి.

పూర్ణ గర్భవతి వీరవిహారం చేసిందేమో కిరకిర లాడిపోయింది రుద్రమదేవి. శారీరక బాధకు తోడు భర్తగారి దుశ్చేష్టితాలు చూసిన

మానసిక బాధతోడై ఆమె అతలాకుతలమై పోయింది. వకుళ ఆమెకి శ్రద్ధగా పరిచర్యలు చేసింది. తెలతెలవారుతుండగా నారాంబ, పేరాంబ ఆదుర్దాగా వచ్చారు రాత్రి జరిగిన విషయం తెలిసి కుమార్తెను అక్కున చేర్చుకుని వీపు నిమిరి, ముసలి దాది చేత దిష్టి తీయించారు. మనసు లోలోపల వాళ్ళ బాధకూడా పట్టశక్యంకాకుండా ఉంది అల్లుడుగారి అఘాయిత్యం తెలిసి సోదరుడు జాయనసేనానినిపిలిచి తరవాత కర్తవ్యం నిర్ణయించారు జరామాతలు:

చెరసాలలో వీరభద్రుడు తన తప్పిదాలన్నింటినీ పునశ్చరణ చేసుకుని బాధ పడ్డాడు. చివరికి ఒక నిశ్చయానికి వచ్చి భార్యకొక లేఖ రాశాడిలా.

"ప్రియపత్నీ, తెలుగురాణీ, నేను బ్రతికి ఉండటం కంటే లేక పోవడమే మంచిది. ఈదుర్మార్గుణ్ణి నువ్వు క్షమించలేవని తెలుసు క్షమించవద్దుకూడా, నాపాపాని కొకింతైన నిష్కృతి కలగాలంటే నువ్వు విధించిన శిక్ష సంతోషంగా అనుభవించటమే. రాజుచేతిలో శిక్ష అనుభవిస్తే నరకంలో శిక్ష ఉండదుకదా కాని నేను నరక బాధలకు అర్హుణ్ణి.

పుట్టిన బిడ్డకీ, పుట్టబోతున్న బిడ్డకీ తండ్రి ఆశీసులు అందజెయ్య మహానుభావులైన తిక్కయజ్వల ఆశీర్వాద రక్షతో. శివదేవయ్యదేశికోత్తముల మంత్రాంగ బలంతో, గన్నారెడ్డి, గుండయాది ఉత్తమ సామంతుల సహకారంతో, వకుళాది సఖీ మణుల ప్రాణ స్నేహంతో, గోళకీమఠాధిపతుల వాత్సల్యంతో, వనితా సేవఅండదండలతో, మేనమామ జాయప సేనానిగారి తోడ్పాటుతో స్వయంభూదేవుడి అభయ హస్త ఛాయన చిరకాలమూ వర్ధిల్లు, రుద్రమదేవి. గణపతి దేవుల పట్టధృతీ. తెలుగు కీర్తి



దిశల నింపు నీకు భద్రమౌతుంది.

ఏ జన్మలో నేను చేసిన పుణ్యమో నీకాలంలో పుట్టాను. పుట్టటమే కాదు నిన్ను చెట్ట పట్టాను. కానీ, కానీ, రుద్రమా! నన్ను మర్చిపో నీ విజయ దీపపు ధగధగల వెనుక నున్న క్రీనీడను మందభాగ్యుణ్ణి ఈవీర భద్రుణ్ణి శోకంచేత కూడా మరిచిపోనివ్వు. నా చరిత్ర ముగిసింది. నా గురించిన ప్రస్తావన వద్దు. దేవి, ఇది నాఅభ్యర్థన సుమా, ప్రాణప్రియా నేను సెలవు తీసుకుంటున్నాను.

ఇట్లు...
నీ వీరభద్రుడు"

ఉత్తరం లిఖించి కనబడేటట్లు పెట్టి వేలికున్న వజ్రపు టుంగరం తీసి మింగబోయినాడు.

కావలా భటులు రివ్వునవచ్చి ఆ ఉంగరం లాక్కున్నారు. "ఓహో నీ గూఢచార దళాల సామర్థ్యం మరిచిపోయినానులే, దేవీ. నీ పసుపు కుంకుమ ఇంకొంత కాలం ఉండాల్సి ఉంది కాబోలు" అని నిశ్వసించాడు వీరభద్రుడు.

○ ○ ○

శివదేవయ్యగారి ఇల్లు యధాప్రకారం మంచి సందడిగానే ఉంది ఈ రోజుకూడా. భోజనాల సమయం.

ఆడవాళ్ళు వెండి పూలున్న పీటలు పరిచారు భోజనాల గదిలో

అరిటాకులు వేశారు. రాగి ఉద్ధరిణెలు, పంచపాత్రలూ సిద్ధం చేశారు. వెండి చెంబులతో నుంచి నీళ్ళు ఉంచారు.

స్నానమూ, పూజ పూర్తి చేసుకుని శివదేవయ్యగారూ, తిక్కనగారూ నరసింహుడూ అతిథుల్ని వెంటబెట్టుకుని భోజనశాలకి వచ్చారు. భోజన ప్రారంభకాలంలో మహేశ్వర స్మరణ చేసి అందరూ కర్పూర భోగి అన్నంలో పప్పు కలుపుకున్నారు. ఘుమఘుమలాడే నెయ్యి చెయ్యి చురుక్కుమనేట్లు వడ్డించబడింది రెండోసారి

"కాకతీయ సామ్రాజ్యానికి సగం బెడద" వదిలింది మొత్తానికి" అన్నాడు నరసింహుడు.

"మిగతా సగమూ మహారాష్ట్రులేగా?" అన్నాడు తిక్కనగారు.

"ఔను మిక్కిలి బలవంతులు కూడాను" అన్నారు శివదేవయ్యగారు

"జైతుగి కాలంనుంచీ వాళ్ళు కాకతీయుల శత్రువులే గదా. మామయ్యగారూ" అన్నాడు నరసింహుడు,

"మరే" అన్నట్టు తలాడించారు అతిథులు.

"అందులో ఇప్పటి యాదవ రాజైన మహదేవరాజు కళ్ళు మరీ ఆకాశంలో ఉన్నాయిలెండి. ఎంతో శ్రమతో ధన వ్యయంతో విపరీతమైన సైన్యాన్ని సమకూర్చుకున్నాడట ఆయనగారు మనతో యుద్ధం కోసం. పైగా ఓరుగంటి తెనుగురాణి చేత కాళ్ళు పట్టించుకుంటాను చూడమని గొప్పలు చెప్పుకుంటున్నాట్ట"



"చిన్న సవరణ చేస్తే సరిపోలా నరసింహా." అన్నారు తిక్కన గారు.

"తెనుగురాణి కాళ్ళు పట్టుకుంటాను చూడమనా?" అన్నాడు నరసింహుడు నవ్వుతూ.

"ఔను"

"ధన్యులం బావగారూ మీ నోటి వెంట సత్యం వెలువడింది."

"నోటివెంట అంటున్నారు మహామాత్యా తిక్కనగారు నోటితో ఏమీ అనలేదే." ఒక పండితుడు అందించాడు.

"ఓహూ. ఇది ధ్వని అన్నమాట" అన్నారాయన నవ్వి.

"అల్పార్థముల అనల్పార్థ రచనలంటే ఏమిటి మరి?" పండితుల మెప్పులు.

"నన్ను మరీ మునగచెట్టెక్కిస్తున్నారు" అన్నారు తిక్కన.

"ఇంత వినయం మీకే తగును. బావగారూ. ఏదీ ఈ మధ్య రాజకార్య లెక్కువై భారతామృతాన్ని కరపుటాలలో దొప్పదోగి ఆస్వాదించటానికి కుదరలేదు. ఏదీ కాస్త అందుకోండి ఉత్తరత గోగ్రహణంలో బృహన్నల విశ్వరూపం" అన్నారు శివదేవయ్యగారు.

"ఆ పద్యం మీరు చదువుతుంటే మరీ బాగుంటుంది, మామయ్య గారూ."

"సింగంబాకటితో"...అని చదివారు తిక్కనగారు. "ఎన్ని సార్లు

వింటారు. బావగారు!" అని నవ్వారు.

"భారతం ఎన్ని సార్లు వింటే తృప్తి. మహాకవి! అదుగో మహా వనం వింటీ నేతితో గారెలు వేడి వేడిగా వస్తున్నాయి. అవిపుచ్చుకుంటూ మరి కాసేపు కావ్య గానం చేసి మమ్మల్ని మీ కవితా మరంద ధారలో ముంచెయ్యండి" అంటూ తానొక గారె అందుకున్నారు మహామంత్రి.

"అయ్యో! మీ ఏకశిల వచ్చినప్పట్నించి నన్నిట్లా చంపుకుతింటు న్నారేమిటి, స్వామీ" అన్నారు తిక్కనగారు.

అర్ధ నిమీలిత నేత్రాలతో గారెల రుచిని అల్లం పచ్చడితో కలిపి ఆస్వాదిస్తూ "నేను చంపుకు తినట్లేదయ్యా, బావగారూ! మిమ్మల్ని పచ్చడి నంచుకు తినమంటున్నా!" అని ఛలోక్తి విసిరి "భోజనం దగ్గర మొహమాట పడకూడదండీ" అన్నారు శివదేవయ్యగారు.

"వహ్వా! ఏమి గారెల కవిత్వం" అన్నారెవరో

కాను గారెలెక్కువ రుచిగా ఉంటాయా భారతం ఎక్కువ రుచిగా ఉంటుందా? చెప్పగలరా ఎవరన్నా?" అని అడిగారు శివదేవయ్యగారు.

"ఆహాహా! ఏమి స్వారస్యంగా సెలవిచ్చారు బావగారూ. ఇంకో వెయ్యేళ్ళకి పుడతారేమో మళ్ళీ తమ వంటి రసపారీణ హృదయులు." తిక్కనగారు ఎన్నడూ లేనిది పకపకా నవ్వారు.

"నా రసజ్ఞత అర్థమైంది కదా?"



"ఆహా విశేషంగా శివతత్వ సారం అర్థం కాదా?" తిక్కనగారు.

"తింటే గారెలే తినాలి వింటే భారతమే వినాలి"

"శభాష్ భారతానికీ, గారెలకి పోలిక తెచ్చిన తమ చమత్కారం మూరేళ్ళా వర్ధిల్లును గాక"

"నూరేళ్ళే ఏం? ఆచంద్రతారార్కమూ వర్ధిల్ల కూడదా?"

తథాస్తు . తథాస్తు.

o o o

రక్తపాతం,జననష్టం లేకుండా కొప్పెరుంజింగాదులను బంధించి వీరరుద్రదేవ ప్రభువు విజయోత్సవ సభ తీర్పు వలసినదే. వ్యక్తిగత మైన సుఖ దుఃఖాలు అందుకు అడ్డు రారాదు ఆ రోజే రాజద్రోహుల శిక్షలు విధించాల్సి ఉంది.

రుద్రమదేవి శుద్ధాంతంలో కుమిలి పోతున్నది. తను సాధించిం విజయమా? ఓటమా? రాజుగా తను గెలిస్తే గెలవచ్చు గాక స్త్రీగా,భార గాలను ఓడిపోయింది. దారుణంగా నష్టపోయింది. ఏ వైభవమూ, ఏ అ కారమూ ఇప్పుడు తనకి భర్త నివ్వలేదు. ఈ రాజ్యం కోసం కాకపో భర్తకి తనతో వైరమే లేదు. అయ్యో. ఇప్పుడాయనికి శిక్ష విధించాలి తప్పదు స్వయంభూదేవా నీ శ్రీచరణాలే నాకు శరణు. ఈ విపరీత ప స్థితి నెదుర్కొనగల ఆత్మశక్తిని ప్రసాదించు. తండ్రీ. అమటున్న

నిరీహ మానసంతో. ముమ్మడాంబని చూస్తే గుండె చెరువౌతుంది. భర్త రాజబంధువు గనుక చిత్రహింస కాకపోయినా మరణ దండన అయినా విధించక తప్పదు. ఆమెకి కరళ్ళు కరళ్ళుగా దుఃఖం పొంగి వచ్చింది. "తన కడుపులోని బిడ్డ ఇంకా కళ్ళు తెరవలేదు తండ్రిని కన్నతల్లే హతమార్చబోతున్నది అయ్యో దైవమా ఇంక గత్యంతరంలేదు. రాజద్రోహిని ఎట్టి పరిస్థితులలోనూ వదిలి పెట్టి పక్షపాతం చూపించలేదు. చూపించలేదు దేశాన్ని పర రాజులకి అప్పగింత పెట్టలేదు. దేశ ప్రజల క్షేమం కోరి తండ్రిగా రప్పగించిన ఈ గురుతరమైన బాధ్యతను కడదాకా భరించ వలసిందే

ఎంత నిబ్బరం వహించి ఆమె సభావేదిక మీదకి వస్తుంటే వంది మాగధుల కైవారాలు మిన్ను ముట్టినాయి.

"సమధి గత పంచ మహాశబ్ద మహా మండలేశ్వర.

అనుమకొండ పురవరాధీశ్వర. వీరలక్ష్మీనిజేశ్వర, స్వయంభూ దేవ శ్రీపాదపద్మారాధక.

మూరురాయ జగదాళ, విదిత విక్రమశీల, పరమ మహేశ్వర, రాయ గజకేసరీ, అష్టమ చక్రవర్తి

చలమర్తిగండ, కదనప్రచండ, వరబల సాధక శ్రీవీరరుద్ర దేవ సార్వభౌమా జయీభవా దిగ్విజయీ భవా."

రుద్రమదేవిమనసులోనే పేలవంగానవ్వుకున్నది మొదటరాజనర్తకి



వచ్చిహలాహల భక్షణంనృత్యం ప్రదర్శించింది. చూస్తూ తనమనఃస్థితి లాగే ఉన్న దనుకున్నది రుద్రమ.

తరవాత సభలో నించి ఒక కొత్త వ్యక్తి లేచిఆమెకు ప్రణమిల్లి ఇలా చదివాడు.

"నవ లక్ష ధనుర్ధరాధినాథే

పృథివీం శాసతి వీరభద్ర దేవే

అణవత్సర మగ్రహారపీడా" ఆయన శ్లోకం పూర్తి కాకుండానే "కుచకుంభేషు కురంగ లోచనానాం" అనిపూర్తిచేశాడు ఓరుగల్లుకిచెందిన ఒక కవి, నాలుగోపాదం మారేటప్పటికి అర్థమంతా అద్భుతంగా మారి పోయింది.

"తొమ్మిది లక్షల మంది విలుకాండ్రకు అధిపతి అయిన వీరరుద్ర దేవ ప్రభువు భూమిని పరిపాలిస్తుండగా అగ్రహారములకు పీడకలుగు తున్నది సుమా" అని ఆ అగ్రహారీకుడు తన బాధలు వెల్లడించుకుంటూ ఉంటే, ఓరుగంటి కవి ఎట్లా చమత్కరించినాడంటే, తొమ్మిది లక్షల మంది విలుకాండ్రకు అధిపతి అయిన వీరరుద్రమదేవ ప్రభువు భూమిని పరిపాలిస్తుండగా స్త్రీల కుచముల మీది హారములకు మిక్కిలి రాపిడి కలిగినది" అనే అర్థం వచ్చేటట్లు. అంటే ఆస్త్రీలువిపరీతంగా తారహారాలూ ముత్యాల సరులూ మెడలో వేసుకుంటున్నారన్న మాట. ఒక హారానికీ, ఇంకో హారానికీ రాపిడి తప్పదు గదా మరి-నగ లెక్కువయితే ఎంత

వైభవంగా ప్రజలు బ్రతుకుతున్నారో. అని అర్థం.

ఏదో వింటూంది కానీ, రుద్రమదేవి అంత చమత్కారానికి తన రసహృదయానికి తగినట్లు ఆనందించలేకపోయింది. రాజగురువు శివదేవయ్యగారు కల్పించుకొని ఓరుగల్లు కవి చమత్కారానికి తగినబహుమానం ఇప్పించారు. ఆ అగ్రహారీకుడిని కరణానికి చూపించి, వాళ్ళ ఊరి కష్టాలేమిటో కనుక్కొని వాటిని తొందరగా పరిష్కరించవలసినదిగా ఆదేశాలిచ్చారు. ఆ అగ్రహారమే కాదు, ఇకనించి ఏఅగ్రహారాలలోనూ సమస్యలు రాకుండా కట్టుదిట్టం చేశారు.

మౌనగంభీరంగా సింహాసనంమీద బొమ్మలాగా కూర్చుని ఉన్నది రుద్రమదేవి. పదవాక్య ప్రమాణ ప్రమేయ విచిత్ర కవిత్వ తత్వజ్ఞుడయిన మయూరసూరి లేచి ఆమెను ఆశీర్వదిస్తు పద్యం చదివాడు రామదేవుడూ, మంచి భట్టోపాధ్యాయుడూ ఆమె విజయ ప్రశస్తిని అభినందించారు.

సహాయపడిన వీరులను ఉచితరీతిని సన్మానించింది రుద్రమాంబ వకుళను విందు సభలో కౌగలించుకుని అనర్ఘ రత్నాభరణాలూ. పట్టు జలతారు వస్త్రాలూ వాటితోపాటు గుంటూరు మండలంలోని అలపాడు అనే గ్రామమూ బహూకరించింది. రాణీగారి ప్రస్తుత మనఃపరిస్థితి తెలిసిన వకుళ సానునయంగా ఊరడిల్లమన్నట్లు చూసింది. తన కళ్ళలో తిరిగే కన్నీళ్ళను బలవంతాన దిగమింగింది.

తరవాత రాజద్రోహులు కొనిరాబడ్డారు. తగిన శిక్షలు విధించడమైంది. ఇక మిగిలింది నిరవద్య పురపాలకుడయిన చాళుక్యఇందుశేఖర



మహారాజు తనయుడు వీరభద్రుడు. అంతవరకూ తీక్షణ గంభీరంగా వినదించిన రుద్రమాంబ కంఠం మూగపోయింది. ప్రాడ్వివాకుల వైపు సాభిప్రాయంగా చూసింది. వీరభద్రుడిని శిక్షించే అధికారం ఇచ్చినట్లు.

తన రాజత్వం తన పురుషుడిని శిక్షించడానికి పనికివస్తున్నదంటే రుద్రమ హృదయం రంపపు కోతగా వున్నది.

ప్రాడ్వివాకులూ, అధికృతులూసాధ్యమైనంతఉదారంగానే తీర్పునిచ్చారు. కేవలం యావజ్జీవ కారాగారశిక్ష విధించారు. చేజేతులా తమ సామ్రాజ్ఞి నుదుటి కుంకుమ తుడిచివెయ్యటానికి మనసెట్లా ఒప్పుతుంది.

అంతవరకూ తల వంచుకునిఉన్న వీరభద్రుడు శిక్ష వింటూనే అప్రయత్నంగా తలఎత్తాడు. భార్యవేపు చూశాడు. ఆమె ఆయన్ని చూసింది. చూసిన ఒక్క చూపులో వేయి అర్థాలు. మరుక్షణం చూపు మళ్ళించుకున్నదామె. వీరభద్రుడికింకా చూడాలనే ఉన్నది. కాని ధైర్యం చాలలేదు, జ్వలితాగ్ని శిఖ ముందర శలభంలా అయినాడు. ఆ భార్యాభర్తలిద్దరి మనస్సులలోనూ పాత సంఘటన మెదిలింది. "యావజ్జీవమూ నీ బాహు బంధంలో బంధిస్తానని కారాగారంలో బంధిస్తున్నావా ప్రియా! నీ వంటి స్త్రీని ఇల్లాలిగా బడయగలిగికూడా నే నెంత హీనుడినై పోయినాను. బుద్ధి ధర్మానుహారిణి అంటే ఇదే కదా. అర్థాంగలక్ష్మి. సెలవు. నిన్ను వదలలేక పోతున్నాను. ఈ వియోగంకంటే మరణ శిక్షవిధిస్తేనే మేలుగా ఉండేదేమో. చేతులు కాలాక ఆకులు పట్టుకుని ఏం లాభం"

రాజభటులు తీసుకెళ్ళిపోయినారు. వీరభద్రుడిని తనూ. ఆయనా పరస్పరం చూసుకున్నప్పుడు పెళ్ళినాడు మొట్టమొదటిసారి తెరమీదనించి పురోహితుడు చూడమన్న శుభముహూర్తంలో చూసుకున్న చూపులు గుర్తుకొచ్చినాయి. వీరభద్రుడు మంగళసూత్రం కట్టటం, పుస్తెలు తొడగటం, సన్నెకల్లు తొక్కించటం అంతా గుర్తుకొచ్చింది

బంగారు పానకం బిందెలో వెండి ఉంగరమూ, మరకతాంగుళీయకమూ వేసి తమని తియ్యమంటే తనే మూడుసార్లూ పచ్చల ఉంగరం తీసింది. భర్త ఓడిపోవటం భరించటం లేక రెండు సార్లు కావాలని దాన్ని వదిలేసి వెండి ఉంగరమే బయటికి తీసింది. కాని ఇప్పుడు- ఇప్పుడేం చెయ్యగలదు?

ఆమె మనసును వేరే వ్యాపకాలవేపు మళ్ళించకపోతే కష్టం అనుకున్నారు శివదేవయ్యగారు. సాభిప్రాయంగా సభలో వున్న కవిగారికేసి చూశారు. ఆ కవి లేచి-

"మందాచల వ్యాకులితస్య సింధో
రపత్యతా దోష మపాచి కీర్షుః
అక్షోభ్య సత్త్వాదుది యాను తస్మాత్
రుద్రాంబికేతి ప్రథయా స్వయంశ్రీః"

అని చదివాడు. సముద్రుని కంటే అధికుడైన గణపతిదేవునికి రుద్రాంబిక అను పేరుతో సాక్షాత్తు లక్ష్మీదేవియే పుట్టినది. అని ఆశ్లోకానికి అర్థం తరవాత మరికొంతసేపు కవి గాయక వంది వాగ్మి వయితాళికుల చమత్కారాలు సాగినాయి. పట్టుబలవంతాన వాటిని ఆకర్షించి సభ



చాలించింది రుద్రమాంబ. ఎలా వెళ్ళిందో అంతఃపురానికి తెలీదు. వెళ
తూనే తల్లుల చేతిలో వాలిపోయింది.

o o o o

శరన్నవరాత్రులు సమీపిస్తున్నాయి.

ఆనందవల్లి వాకిటిలో ముగ్గు పెడుతున్నది. సందె చిలుకు వే
"చూశావుటమ్మా చెల్లెలా బావగారి ఈ పద్యం" అంటూ వచ్చారు శి
దేవయ్యగారు.

"చెప్పుకోండి బావగారూ నాకేం భయమా? మా ఆవిడమీద
కవిత్వం రాయబోతున్నాను" నవ్వారు తిక్కనగారు.

"ఏమిటీ?"

"ఔను మరే, మీ చెల్లెలి అసలుపేరు..." అంటూ భార్య వే
చూశాడు తిక్కనగారు.

"ఆనందవల్లి గౌరీదేవి" అన్నదావిడ.

"వాళ్ళ నాయనమ్మ పేరూ, అమ్మమ్మ పేరూ కలిపితే అంతచిన
పేరయిందిలేండి" అన్నారు తిక్కనగారు.

పుట్టింటివారి పేరెత్తేసరికి చిరుకోపం వచ్చింది ఆనందవల్లికి "వొ
లెండి మీరు పెద్ద పేరుతోనే పిలుస్తున్నారుగా" అన్నది.

"పిలవటమే గాదు నేను రెనిగిస్తున్న భారతంలో ఆశ్వాసాంత పద్యాలూ, ప్రారంభ పద్యాలూ చూసుకోండి. మా ఆవిడ కనిపిస్తుందో లేదో" అన్నారు తిక్కనగారు.

"రాసిందిగాక దప్పుకొట్టుకుంటూ ఈ తిరగట మేమిటి బాబూ! మీరు మరీను నన్ను తలెత్తుకోలేకుండా చేస్తున్నారు" సిగ్గు చిరుకోపంగా అన్నది ఆనందవల్లి.

"తలెత్తుకోలేకపోవడమేమిటి? తల వంచుకోలేక బాధపడాలి కాని శాశ్వతంగా కవిత్వంలో నిలిచే అదృష్టం సామాన్య మనుకుంటున్నావా ఏం?" అంటూ ఇట్లా చదివారు తిక్కనగారు.

"శ్రీవిలసనత్వగురుగా
రీవిభ్రమ రమ్య చాతురీ స్వీకృత స
ద్భావ నిరూపాధికానం
దావహ కరుణానుభావ హరి హరనాథా!"

○ ○ ○ ○

పరమ మహేశ్వరులూ, రాజ గురువులూ, మహా మాత్యులూ అయిన శివ దేవయ్యగారింటిలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఆనవాయితీ తప్పకుండా జరిగినాయి. చివరన సువాసినీ పూజ రోజున ఆనందవల్లికి పరోక్ష సత్కారం చేయాలని తలపెట్టారు పురస్త్రీలు రాణిగారి సూచన మేరకు.



అన్నమాంబిక, కుప్పసానిదేవి మొదలయిన స్త్రీలంతా శివదేవయ్య గారింటికి వచ్చారు, ఏముందింక? నలుగురు స్త్రీలు కలిస్తే నవ్వులూ, పకపకలూ.

"ఆనందవల్లిగారూ! సాహిత్యాకాశంలో శాశ్వత తేజస్సుతో వెలిగే వశిష్ఠారుంధతులు తల్లి మీ దంపతులు" అని ప్రశంసించింది ఇందులూరి అన్నయ నాయనమ్మ అయిన పెద్ద ముత్తైదువ.

"గారూ అని మన్నిస్తారేమిటమ్మా ఆనందా అనండిచాలు" అన్నది ఆనందవల్లి.

"అమ్మమ్మా అదెట్లా. ఆపిలుపు తిక్కన కవిశ్వరులకి సొంతం" అన్నది అన్నమాంబ ముసిముసి నవ్వులతో.

ఆమెవేపు తిరిగి "ఇంతకీ మీ వారి పేరేమిటో?" అని అడిగింది ఆనందవల్లి తనూ నవ్వుతూ.

సిగ్గుపడింది అన్నమదేవి పక్కనున్న కుప్పమాంబను మోచేతితో పొడిచింది.

"పైగా ఇదొకటా? ఇంటిదగ్గరయితే మా తమ్ముడ్ని గన్నా కన్నా! గన్నారెడ్డి" అని పదేపదే పిలుస్తూంటుందికాని, పేరుచెప్పటానికి ఇక్కడ సిగ్గొచ్చిపడింది కాబోలు" అంది కుప్పమాంబ. కిలకిల నవ్వింది ఆనందవల్లి "వద్దు వద్దని వారిస్తున్నా వినకుండా ఆమెని పీఠంమీదకూర్చో బెట్టింది పార్వతీదేవి. మెట్టుపెట్టి సరిగంచు చీరా, రవిక బట్టా చేతిలో పెట్టింది.

అన్నపూర్ణ పసుపు రాసింది ఆనందవల్లికి, వచ్చిన అందరికీ. అన్నమాంబిక లేచి చనువుగా ఆనందవల్లికి గంధం రాసింది "ఏం అమ్మడూ చెంపలకి బాగా రాశావా?" అన్నది పార్వతీదేవి.

"ఉండండమ్మా చెంపలకి రాశాగానీ ఇంకా ముక్కుకి రాయాలి" అంది అన్నమ.

"ముక్కుకా?" అంటూ సుతారంగా నవ్వారందరూ.

"ఏమో తల్లీ! ఏం రాస్తారో ఏమిటో! కానివ్వండి కాదంటే మీ వదినెగారు కొట్టేట్లున్నారు" అంది ఆనందవల్లి.

అన్నమ "అమ్మయ్య! ముక్కుకి అలంకారం పూర్తయింది" అంటూ ఇవతలికి వచ్చింది ఆనందవల్లి ముక్కున కట్టాణి ముత్యాల బేసరి మెరుస్తున్నది.

"సామాన్యురాలు కాదమ్మో మా మరదలు" అంటూ లేచింది కుప్పమాంబ. ఆనందవల్లి తలలో పూవులు తురిమి. తను తెచ్చిన పసిడి జడబిళ్ళ ముడి మధ్యలో అమర్చింది ఆ సంరంభాన్ని బెదురు బెదురుగా చూస్తున్నది ఏకవీర. ఆమె అంబదేవుడి నూతన వధువు. "లేమ్మా కొత్త పెళ్ళికూతురా! ఈ పన్నీరు చిలికిరా" అని పిలిచింది కుప్పమాంబ పన్నీరు ఆనందవల్లిమీద చిలికి తను తెచ్చిన పుష్పరాగపుఉంగరం ఆవిడ దోసిటలో వినయంగా పెట్టిందా పిల్ల "అయిందా" అన్నది పెద్దశెట్టిగారి భార్య కళావతి "ఆఁ..తప్పుకోండ్రా తప్పుకోండి కళావతిగారొస్తున్నారు" కుప్పమాంబ అల్లరి "పెద్ద! మీరంతా చాలా బీదవాళ్ళయినట్లు" నవ్వింది కళవతి.



"కాకతి రాజుల ఏలుబడిలో గజాంత వైభవమేగా ప్రతి ఇంటా" అంది. "బానసుకోండి కాని ఎప్పుడూ మీకంటే తక్కువేనండోయ్ మీకు మీరే సాటి" అంది అన్నమాంబ

"పోనీండి అంతకంటే కావలసిం దేమిటి? పరమేశ్వరుడి ఆశీర్వాదం" అంటూ రత్నాలు పొదిగిన కంకణాలు ఆనందవల్లి చేతులకి తొడిగింది. రాణిగారిపేరునించి అమె సఖులు చంపకమాలా. మాలతీలతా ఆనందవల్లికి త్రిసరాలూ, తాటంకాలూ పట్టుచీరా, రవికే ఒక పళ్లెంలో పెట్టి అందించారు. బిడియపడుతూనే ఆ కానుకలన్నిటినీ తీసుకుంది ఆనందవల్లి. "మహారాణి కుశలమా?" అని ఆదరంగా అడిగింది. "కొంచెం నలతగా ఉన్నారమ్మా లేకపోతే వచ్చేవారే" అన్నారు సఖులు,

రాణిగారి దీన స్థితిని తల్చుకుని ఆ సువాసినులందరూ బాధపడ్డారు. గురునాధుని భార్య దుక్కమ్మ వచ్చి ఆనందవల్లికి ఎర్రనీళ్ళు దిగదుడిచి పోసింది ఇంటికొచ్చిన ముత్తైదువులందరికీ పసుపూ, పారాణీ, బొట్టు, పళ్ళు, సెనగలు తాంబూలం ఇచ్చింది అన్నపూర్ణ.

చీరల రెపరెపలు, గాజుల గలగలలు, నవ్వుల కిలకిలలుగా ఉంది రాజ గురువుల ఇల్లు. వదినా మరదళ్ళ పరసలు, ఒకరిమీద ఒకరు వాగ్బాణాలు విసురుకోవటం, అత్తా కోడళ్ళ పరసలు, ఆనందంగా దెప్పి పొడుచుకోవడం.

ఆనందవల్లి లేచి వచ్చి అందరి మధ్యా కూర్చుంది. మాటల మధ్యలో "అమ్మో మావదినెగారు జాణ కాదుటమ్మా" అందిపార్వతీదేవి

అంతా నవ్వారు కానీ ఏకవీరకి ఏం అర్థం కాలేదు. "బానులే ఇప్పుడు మీ వారిగోల తప్ప ఇంకేం అర్థంకావులే అంది అన్నమాంబ.

"అబ్బ! మరదలు మాణిక్యం శ్రీ దానికే ఆపిల్లని బెదరగొట్టకు" అని కోప్పడింది కుప్పమాంబ.

"మరే, ఈపిల్ల ఉత్త ముద్దరాలు, గోట్లో వేలుపెడితే కొరకలేదు, పాపం, అంబదేవుడిగారి చెక్కిలివి తప్ప. అయినా పసిన గృహలక్ష్మి! పెళ్ళయిన కొత్తలో ఆడకపోతే ఇంక పరిహాసాలెప్పుడు?" అన్నది అన్నమాంబ,

"ఆనందవల్లిగారు నెల్లూరి వారు కదుటమ్మా నెల్లూరి నెరజాణల ప్రఖ్యాతి ఎప్పుడూ వినలేదా ఏకవీరా" అంది పార్వతీదేవి.

"ఓరుగల్లు వగలాడులకంటేనా?" అంది ఆనందవల్లి.

మళ్ళీ గొల్లుమని నవ్వులు.

ఇంటికి వెళుతూ "ఏమ్మా చెల్లెలా, ఈ శరత్కాలపు వెన్నెలలో ఎలా పట్టుకుంటావో ఏమో మీ ఆయన్ని" అంది అన్నమాంబ.

గాబరాగా చూసింది ఏకవీర.

"అసలే రాత్రిళ్లు నీ కౌగిట కరుగుతున్నారు గదా మరిదిగారు.... ఇంత ఈ వెన్నెలకూడా తోడయితే...."

"అన్నమా వెన్నెలకేమన్నా వడగొట్టి పోతాడా వీళ్ళ ఆయన



ఇంక మాటలాపి పదండి" అన్నది కుప్పమాంబ,

"ఏం గుండయ అన్నగారూ ఇవాళ పెందలాడే ఇంటికి వస్తామ న్నారా?" నవ్వుతూ అడిగింది అన్నమ.

"కాదు మా తమ్ముడు గన్నారెడ్డి వర్తమానం పంపాడు "తొందరగా ఇంటికి వస్తానివ్వాళ మా ఆవిడను తయారు చెయ్యండి" అని ఉంటూ అన్నమాంబ బుగ్గ పొడిచిందికుప్పమాంబ. అన్నమాంబతోపాటు ఏకవీరకూడా సిగ్గుపడిపోయింది.

○ ○ ○ ○

రుద్రమదేవికి మళ్ళీ ఆడపిల్ల పుట్టింది. నామకరణోత్సవం నోచుకోని ఆ పిల్లని "రుయ్యమ్మ"అని పిలవసాగారు రాజమాతలు. రుయ్యమ్మ పుట్టిన మూడు నెలలకే వచ్చిపడ్డాడు యాదవమహాదేవరాజు మహారాష్ట్రం ఏంచి భవానీభట్టు రాయబారం ఫలించలేదు.

అపారమైన పదాతి సేనతో, అనేకాయుధాలతో సర్వసన్నద్ధమైన సుశిక్షితమైన రథ గజ తురగ దళములతో అమేయ వ్యూహ రచనాప్రతిభతో ఈ ఆడదాని తడాఖా ఏమిటో తేలిపోవాలని మొదటిదయిన మట్టి కోటను ముట్టడించాడు మహాదేవరాజు.

మంత్రి సామంత దండనాథులను సమావేశపరిచింది రుద్రమదేవి మహా వీరులారా! మీ దేశభక్తి ధైర్య సాహసాలు ప్రదర్శించవలసిన "తరుణం ఆసన్నమయింది మనకిది పరీక్షాసమయం ఎవరూ శత్రువులకు

వెన్ను చూపవద్దు, విజయమో, వీర స్వర్గమో వరించేదాకా పోరాడ వల సిందే. ప్రాణాలమీద తీపి కంటే దేశం శ్రేయస్సు ముఖ్యం. దేశరక్షణే మన ధ్యేయం స్వయంభూదేవుడు మనలనందరినీ అఖండ పౌరుషాగ్ని ప్రజ్వలితులను చేస్తాడుగాక" అంది.

"ఆఖరి రక్తం బొట్టు చిందేదాకా కాకతీయ సామ్రాజ్యం కోసం పోరాడుతా"మని వీరులంతా ప్రమాణం చేశారు.

"చాలు ఆ మాట చాలు, తెలుగుజాతి చేవచచ్చిన జాతి కాదని నిరూపించగలిగితే చాలు అయితే ఒక్క విషయం సోదరులారా మహ సేనానులారా ఈ మహాసమరం ముగిసేటప్పటికి నేను ... నేను జీవించి ఉంటానో లేదో, అందుకే మీ తెనుగురాణి మీ దగ్గరనుండి సెలవు తీసు కుంటున్నది మీలో బ్రతికిన వాళ్లు నా తల్లులనీ పిల్లలనీ మర్చిపోకండి చివరి మాట లంటున్నప్పుడు ఆమె కంఠంలో సన్నని జీర.

వీరులందరూ ఉద్విగ్నులయినారు. రాజకుటుంబాన్ని యథాశక్తి కాపాడతామని పలికారు "మా ఏలిక నూరేళ్లూ బతుకుతుం"దని ఆశా సించారు.

వారిని వీడ్కొని అంతఃపురానికి వచ్చింది రుద్రమదేవి. పిల్లలిద్ద రినీ ముద్దులాడి తల్లుల కప్పగించింది, "పచ్చి బాలింతవు వద్దంటే విన కుండా వెళుతున్నావు, మరి మమ్మల్ని ఎవరికప్పగించి పోతావు తల్లీ "అని కన్నీరు నింపారు వాళ్లు.

"స్వయంభూదేవుల"కిఅంటూ వంగి తల్లులకు పాదాభివందనం చేసింది. పక్కనే వున్న గురుదేవులు విశ్వేశ్వర శివదేవయ్యగారికి



ప్రణామం చేసింది. "విజయోస్తు, దిగ్విజయోస్తు" అని దీవించారువాళ్ళు. బాధను అణిచి పెట్టి

తెలతెలవారుతున్నది. శత్రురక్తంతో తడిసిన రణరంగంలా ఆకాశం అరుణరాగ రంజితమైంది.

కుప్పమాంబ హారతిచ్చి వీర తిలకం దిద్దగా ఏనుగెక్కాడు మల్యాల గుండయ ప్రభువు ద్వీపిలుంటాక, పెదముట్టుగండ బిరుదాంకి తుడు. వకుళ ఎల్లన లిద్దరూ సమ ఉజ్జీగా మేలుజాతి తెల్లని గుర్రాల్ని అధివసించారు. మహావీరుడయిన నరసింహుడు భార్య అన్నపూర్ణ అం దించిన చంద్రహాసం ధరించి కదిలాడు.

మహా ప్రధాన గణపద్దేవ మహారాజూ, మల్లికార్జుననాయకుడు పోతినాయకుడూ, చతురుపాయదక్షులయిన వెలుగోటివారిలో ముఖ్యులూ, ప్రాసాదాదిత్య నాయకుడూ, మేచయనాయకుడూ, రేచెర్ల రుద్రసేనాని మొదలయిన మహావీరులు తమతమ కుటుంబాలని వీడ్కొని సమరానికి కదిలారు. వృద్ధుడూ, గణసాధనికుడూ, నృత్య గీత వాద్య రత్నావళి కర్త, రుద్రమదేవి మేనమామ అయిన జాయప సేనాని కొదమసింహం వలె రణానికి ఉరికాడు జన్నిగ దేవసాహిణి ఆడిదమ్మ సేనానీ, అంబ దేవుడూ. కాయస్థ వంశజుడయిన గండపెండార గంగయసాహిణి తమ తమ అశ్వికదళంతో పోరుకు తలపడ్డారు. పడికముబాప్ప దేవుడు, ప్రోల రాజూ సమరోత్సాహంతో విజృంభించారు. ఆ వెనుక వనితాసేనసాగింది అన్నమాంబ, కుప్పాంబల ఆధ్వర్యంలో.

సముజ్జ్వలమైన వీరవేషంలో అన్నమాంబిక దిద్దిన వీరతిలకం నెన్నుదుట రక్తకాంతు లీనుతుంటే, పంచకల్యాణి మీదికి దూకాడు గోన

గన్నారెడ్డి. వందిమాగధులు ఈ విధంగా స్తోత్రం చేస్తున్నారు. "జయ! జయ శ్రీ కాకతీయ కటక సన్నాహ! రుద్రదేవ దక్షిణ భుజాదండ! కామినీ జయంత! దుష్టతురగ రేఖా రేవంత కోసగిమైలి తలగొండుగండ! ఉప్పల సోముని తలగొండు గండ వంది భూపాలుని తలగొండుగండ! మేడిపల్లి కాచయ నాయకుని ఉరిశిరసుండ రాపాక భీమ నిర్దుమధామ. తెరాల కాటయ కోటపట్టు! ఏరువ తొండ గోఘాము ఘట్టన ఘరట్ట! బేడ చెలుకి నాయుని నిస్ప్రాణాపహారిణ! కోట పేర్మాడిరాయ కంఠాభరణ చూరకార చోడోదయ పట్టసూత్ర తురంగాపహార! శ్రీ సోమనాథ దేవ దివ్య శ్రీ పాదపద్మారాధక వర్థమాన పురాధీశ్వర " జయ

విశాల ఫాల భాగాన ఎర్రని కుంకుమ అరుణకాంతులు విరియించగా, కాసె కోక బిగించి కట్టి, కవచ శిరస్త్రాణాలతో సంపూర్ణ వీర పురుష యుద్ధ వేషం ధరించి ఆయుధపాణియై రథ చక్రరక్షకులూ, అంగరక్షకులూ పరివేష్టించి రాగా, సముజ్జ్వలంగా సాహంకారంగా సమర భూమికి ఏతెంచిందిరుద్రమదేవి. భద్రకాళికి మొక్కి వచ్చింది మొగసాలలో పంచమహా శబ్దములు మోగుతుండగా, కాకతీయ లాంచనమైన గరుడ ధ్వజం రెపరెపలాడుతుండగా ఆంధ్రాధీశ్వరి రథం సమరభూమికి చేరవచ్చింది. తమ ఏలిక కనులలోని ధైర్యంతో ఆమె చేసన్నతో నవలక్షల ధనుర్ధారులైన తెలుగు వీరులు శౌణయాదవులతో తలపడ్డారు. శత్రువులలో కూడా కాకలు తీరిన యోధులున్నారు. ఎవరూ తీసిపోయేట్లు లేరు.

సమర రంగాన కాళికాదేవిలా విజృంభించింది రాణి రుద్రమదేవి ఆ దేవి పౌరుషాగ్ని కీలలు మహాదేవరాజు అపార సైన్యాన్ని దహించ సాగినాయి. ఆచంద్ర తారార్కమైన ఆంధ్ర చక్రవర్తిని పరాక్రమానికి



అఖిలాంధ్ర దేశమూ. మహారాష్ట్రంతో సహా మోకరిల్లింది. పదిహేను రోజులు జరిగిన ఆ తుముల సమరం ముగిసింది ఓరుగంటి కోట పైన విజయచిహ్నంగా వరాహముద్ర సగర్వంగా ఎగిరింది చావగా మిగిలిన శౌణ సైనికులు శరవేగంతో పలాయన మంత్రం పఠించారు గోదావరి దాటేదాకా శత్రు సేనను తరిమి కొట్టింది ఆంధ్రసేన. కాంచీ నగరం వరకు విజయ విహారంచేసి తెలుగు కీలాలిని నెరపిన ఆంధ్ర సేనకి, యాదవ విజయం అసాధ్యమా?" అన్నారు వృద్ధులు. "అమ్మ నాయనో ఆంధ్రదేశాన్ని ఏలేది ఆడపురుగు కాదురా—ఆదిశక్తి" అనుకుని "బతుకు జీవుడా" అని పారిపోయినారు శత్రు సైనికులు.

యాదవ మహాదేవరాజును మటుకు వదలలేదు రుద్రమ్మ బందీగా స్వీకరించింది. ఆ రాజు రుద్రమ శౌర్య ప్రతాపాలకు ఆశ్చర్యం చెందాడు.

"ఎందరు హెచ్చరించినా వినకుండా ఆడదానిచేతకాళ్ళకు మొక్కి—చుకుంటానని బీరాలు పలికి ఈ మహిషాసుర మర్దిని మీదికి ఎత్తి వచ్చి ఉన్న పరువు కాస్తా గోదావరిలో కలుపుకుని నవ్వులపాలయినానే" అని వాపోయినాడాయన. "అబ్బా! ఈ రుద్రమ్మ ఏమి స్త్రీ? ఎవరు ఊహించ గలరు. ఒక అబల కింతటి మహాపరాక్రమ ముంటుందని? గణపతిదేవు ప్రయత్నం ఎంత ఫలవంతమైంది? యుద్ధంలో తన ప్రాణాలు ఎందుకు పోలేదు? రుద్రమ్మ ముందు దోషిగా నిలబడే అవస్థా తప్పేది విజయ కాకపోయినా వీరస్వర్గమైనా దక్కేది. ఇప్పుడావిడ పాదాలకు మోకరి నష్టపరిహారం ఇచ్చుకోవాలి కాబోలు" అని సిగ్గుపడ్డాడు మహా దేవరాజు.

o o o o

విషాదంగా కూర్చుని వున్నది రుద్రమ. ఆ భయంకర యుద్ధం ఆమెని కలకొండు పరిచింది. చనిపోతూ సైనికులుచేసే హాహాకరాలు, ఆర్తనాదాలు ఆమె చెవులలో మారోృగుతున్నాయి. ప్రాణసఖి వకుళ రుద్రమను రక్షించే ప్రయత్నంలో ప్రాణాలు కోల్పోయింది. చనిపోతూన్న వకుళను ఒడిలోకి తీసుకుంది రుద్రమ దేవి కన్నీళ్ళు కురుస్తుండగా "అమ్మా తెలుగు గడ్డపై పుట్టినందుకు మీ ఉప్పు తిన్నందుకు నా కర్తవ్యం నెరవేర్చుకున్నాను" అంటూ ప్రాణాలు వదిలింది వకుళ. "ఔను, వకుళ నా కర్తవ్యమే మిగిలి వున్నది. భర్త ఎల్లనను కృష్ణకి ఆవలవేపున్న రాజ్య భాగానికి రాజ ప్రతినిధిని చేస్తున్నాను. కానీ నిన్ను తీసుకొచ్చి ఇవ్వలేనే" అంటూ బాధ పడింది రుద్రమ. "ఇంకా ఎందరెందరో మెరికల్లాంటి వీరులు యుద్ధపిశాచికి ఆహుతయి పోయినారు. వాళ్ళ తల్లులు, పిల్లలు, ఇల్లాళ్లూ ఎంత శపించుకుంటున్నారో నన్ను ఎంత ఏడుస్తున్నారో పాపం" అనుకుంది రుద్రమ.

వకుళ మరణంతో అన్యమనస్కంగా వున్న మహారాణిని గురిచూసి ఇద్దరు శత్రు సేనానులు రెండు ఖడ్గాలు విసిరారు ఒకేసారి, "ఈ దెబ్బతో రాణిపని సరి" అనుకుంటూ. కాని ఆ రెండు ఖడ్గాలు ఆమెకి తగలలేదు. ఎక్కడ్నించి వచ్చారో ఇద్దరు కొత్త వ్యక్తులు హటాత్తుగా చెరొక ఖడ్గంకు అడ్డొచ్చారు, తీవ్రంగా గాయపడినారు. ఆ ప్రాణదాతలిద్దరికీ ప్రత్యేక శ్రద్ధతో వైద్య చికిత్స చేయిస్తున్నారు. పరిజనం.

జరిగిన భయంకర సంఘటనలు ఒక్కొక్కటి రుద్రమ్మ మనసును పీడటంలేదు.

"అసలెందుకీ యుద్ధాలు? ఆంధ్రులు, మహారాష్ట్రులు ఎందుకు



కలిసి ఉండకూడదు? భారత దేశంలో అంతఃకలహాలు ఎప్పుడు ర
మాసిపోతాయో? బలవత్తరమైన ఇరుగుపొరుగు రాజ్యాలు స్నేహ
కలసి ఉంటే ఉత్తర హిందూస్తానాన్ని ముంచివేసిన యవన సేనావాహి
దక్షిణాపథమైనా అడ్డుకట్టకాదా? తప్పకుండా అవుతుంది. యవనులే
న్నమాట? ఇతరులెవ్వరయినా ఇటు తేరి చూడగలరా? ఐకమత్యా
మించిన మహాస్త్రం ఏదీలేదు. పోరు నష్టమూ పొందు లాభమూను
దేశం ఐకమత్యం ఎప్పటికి నేర్చుకుంటుందో" అనుకున్నది రుద్ర
"ఇంతమంది చావుకి కారణమైన మహాదేవరాజా చివరికి ఏం బావు
టున్నాడు" అని విశ్వసించింది.

శివ దేవయ్య గారొచ్చి ఎన్నో విధాల ఓదార్చసాగారు. ఇం
ఒక పరిచారిక వచ్చి రాణిని కాపాడిన నూతనాంగతుకు లిద్దరికీ
ప్రమాదంగా ఉందని విన్నవించింది. మహారాణి చివ్వున లేచింది.
వుగారితో కలిసి వాళ్ళని చూడటానికి వచ్చింది. శయ్యలమీద
వేషాలలో పడివున్న ఇద్దర్నీ పరకాయించి చూస్తూనే గుర్తు పట్టి న
తోదేసినట్లు కెవ్వుమన్నది రుద్రమ దేవి. శివదేవయ్యగారు వెంటనే
మాతలనీ ముమ్మడమ్మ రుయ్యమ్మలనీ తీసుకురమ్మని కబురు చే
ఆ ఆగంతకు లిద్దరిలో ఒకడు వీరభద్రుడు. ఆయన కారాగారం
వెలువడి, యుద్ధానికి వచ్చి మహారాణిని నీడలా కాపాడుకున్నాడు.
మహామంత్రి పన్నాగమే కానీ, ఇంకో వ్యక్తి ఎవరు? మహామ
కుశాగ్రబుద్ధి కతనూ గోచరించాడు. అతడు రామప్ప. "నాయనా
ప్పా" అని నిట్టూర్చారు శివ దేవయ్యగారు.

ఆవేదనతో వాళ్ళిద్దరి మధ్య కూలబడింది ఆంధ్రరాజ్ఞి. వాళ్ళ

మృత్యువుకు సమీపంగా చూస్తుంటే ఆ సర్వాంధ్ర ధరాధినాయిక మెదడు మొద్దుబారి పోతున్నది.

బలవంతాన కళ్ళువిప్పిన వీరభద్రుడికి భార్య కనిపించగానే సంతోషమైంది. అతి ప్రయత్నం మీద ఆమె కన్నీరు తుడిచి, ఆమె చేతిని శివదేవయ్యగారి చేతిలో పెట్టి పిల్లలిద్దరినీ కళ్ళారా చూసుకుంటూ కన్ను మూశాడు వీరభద్రుడు.

"శిల్ప కళాలక్ష్మీ! రామప్ప గుడిలో బహు రూపాలుగా నిన్ను పోలిన ప్రతిమలే చెక్కాను. నా ప్రేమ శిలాసదృశ్యమైపోయింది. క్రూర విధి ఆడిన ఈ వింత నాటకానికి నా రక్తం తోనే భరతవాక్యం పలుకుతున్నాను. సర్వం సహాధికారిణివి. నన్ను గుర్తుపట్టావో లేదో, పోనీలే నిన్ను కాపాడుకున్నాను, సెలవు" అంటూ చేతులు జోడించ బోయినాడు రామప్ప. కానీ ఆ చేతులు నిర్జీవంగా వాలిపోయినాయి.

ఆ ఇద్దరి కళేబరాల మధ్య చైతన్య రహితంగా ఉన్నది రాణి. ఆమెను సమీపించి ఓదార్చడానికి ఎవరికీ ధైర్యం చాలుతుంది. ఒక్క వకుళకు తప్ప. రుద్రమ కళ్ళముందు వకుళ కనబడి, "ధైర్య తెచ్చు కోండమ్మా" అన్నట్లయింది.

"తెచ్చుకుంటానమ్మా, వకుళా, పౌరుషం తెచ్చుకున్నట్లే ధైర్యము పరువు తెచ్చుకుంటాను కాలి పారాణి ఆరకముందే నువ్విట్లాపోయినావు వీళ్ళిద్దరూ ఇట్లా పోయినారు ఇద్దరూ క్షేమంగా ఎక్కడో బతికి ఉంటే ఎంత బాగుండేది. నన్నెందుకు కాపాడి ఈ మనఃక్షోభ కలిగించడం! అయ్యో వకుళా నువ్వెన్నో అపనిందలకోర్చి ఎంతో ప్రయాస పడి నిలి



పిన ఈ మంగళసూత్రం.. ఇది తెగిపోతున్నదమ్మా 'నా బిడ్డలు తండ్రి లేని వారయినారు' అంటూ స్పృహ తప్పి పడిపోయింది రుద్రమదేవి.

రాజవైద్యు లెంత ప్రయత్నించినా ఆమె కన్ను తెరవలేదు. అప్పటి దాకా అమిత విజయోత్సవ సంరంభంగా వున్న రాచ నగరు విషాద మేఘావృతమై పోయింది.

శివదేవయ్యగారే ఆందోళన చెందారంటే ఇక— ఇంత శ్రమపడి ఇన్నివేల మందిని బలిపెట్టి సాధించుకున్న తెలుగు దేశ స్వాతంత్ర్యం మహారాణి క్షేమన్నా అయితే మళ్ళీ పరుల పాలుకాక తప్పదు ఈయుద్ధం తన వల్లనే వచ్చింది ఇంత నష్టానికి తనే కారణ మనుకుని ఇలా అయింది రుద్రమ" అనుకున్నారాయన. తిక్కనగారికి కబురుపంపారు వెంటనే.

ఆయన రాగానే శివదేవయ్యగారు తిక్కనగారి చేతులు పట్టుకుని "కవీశ్వరా! సమర్థులైన తెలుగు చక్రవర్తుల మధ్య మా రాణి మణిపూస లాగా నిలుస్తుందనుకున్నాను, తెలుగు జాతి చరిత్రలో చెరిగిపోని కీర్తి సంపాదించుకుంటుంది. నా తల్లి రుద్రమాంబ అని ఆశ పడ్డాను. వ్యక్తి గతంగా ఏం సుఖపడిందో భగవంతుడికెరుక. కానీ చెదరని చిరునవ్వుతో నిండారిన ఆత్మ స్థైర్యంతో ఆంధ్ర రాజ్యలక్ష్మికి విజయ నీరాజనం పట్టే ఈమె నూరేళ్ళూ బతుకుతుం దనుకున్నాను. అమృత వర్షంలాంటి రుద్రమ్మ పరిపాలన ఎల్లకాలమూ ఉండాలని ప్రజలు తహతహ లాడు తున్నారుగదా, వ్యవసాయాభివృద్ధి కోసం తవ్వించిన చెరువులతో కాక తీయుల రాజ్యం కాసారముల నాడని పేరు గాంచిందే. చేనేత పరిశ్ర మను ఎంత అభివృద్ధి చెందించిం దీమె. పాశుపత విద్యా పీఠాల

ఎట్లా విస్తరింప చేసింది, శిల్పకళ సంగతి చెప్పనే అక్కరలేదు. కవి చక్రవర్తులు, బాలభారతులు, అభినవ మయూరులు, ఎందరు కవులకు నిలయం కాకతీయ సభా మందిరం. నాట్యకళ ఈమె మేనమామగారి నడిగితేనే తెలుస్తుంది. ఇంకా పట్టాభిషేకమే చేసుకోకుండా రాజ్యానికి, ప్రజలకి రుద్రమదేవి ఎంత సేవ చేస్తున్నది. ఇటువంటి చల్లనితల్లి పాలనకి అఘాతమా?" అని వాపోయినారు.

ఊరడిల్లమన్నట్లు తిక్కనగారు శివదేవయ్యగారి భుజం తట్టారు. కానీ, ఆయన బాధ ఉపశమించలేదు.

నా వల్లనే, బావగారూ, రుద్రమ కింత బాధ కలిగింది, నా వల్లనే ఆ తల్లి పసుపు కుంకుమ చెరిగింది. నేనసలు చెరసాలలోనించి వీరభద్రులను తప్పించి యుద్ధానికి పంపకుండా ఉంటే...

"బాధ పడకండి, బావగారూ! గతం నాస్తి—రాజదంపతులు యుద్ధానంతరమైనా తిరిగి కలుసుకుని హాయిగా ఉంటారేమో అన్న సదుద్దేశంతోనే గదా మీరు రాజుగారిని విడిపించారు. తమ రెరుగని ధర్మాలేం ఉన్నాయి? సామ్రాజ్యాన్ని శాసించగలంగానీ, విధిని శాసించలేము గదా ఎవరమైనా. నేను మంత్రాంగం నెరపుతూంటే మనుమసిద్ధి మహారాజు ఓడిపోలేదా? క్షణిక బలహీనావస్థలో అంటున్నారు. మీకు ఏం భయం లేదు, బావగారూ! మహారాణికికూడా—" అన్నారు తిక్కన.

"ఎందుకనో సరిపెట్టుకోలేకపోతున్నాను. తిక్కనార్యా! ఇంతకూ నేనే కారణమనిపిస్తున్నది."



తిక్కనగారు చిరునవ్వు నవ్వారు. "ఇందాకట్నించీ చూస్తున్నాను బావగారూ! నేను–నేను– నేను చేశానంటున్నారు. మీరెవరయ్యా చేసేందుకు? కారాగారంలో రాజద్రోహిగా మగ్గుతున్న వీరభద్రుడు ఈ ఆత్మత్యాగంతో పునీతమైన అనుభూతి పొందాదేమో! చివరి క్షణాల్లో శౌర్యఖని, మానధన అయిన మహారాణికి తగిన భర్త అయినాడు కదా. ఎక్కడికక్కడ సంతృప్తి పడి, ఏది లభించినా నిష్కామంగా స్వీకరించ గలిగిన శక్తి ఈ మహామండలేశ్వరికి ఉన్నదని తోస్తున్నది. రమారమి ఇంకా ముప్పై, ముప్పై రెండు సంవత్సరాలు రాజయోగిని అయిన ఈ తెనుగురాణి పాలనలో ప్రజలు సుఖించగలరు. ఇంకో సంవత్సరము లోపలే ఈమె సామ్రాజ్య పట్టాభిషేకం జరుగుతుంది. చక్రవర్తిని అవుతుంది. తదుపరి కాలమున తన దౌహిత్రుడికి యౌవరాజ్య పట్టాభిషేక మొనరించును. అంతవరకూ అక్రమ పరాక్రమమూ, అచంచల ధైర్యసాహసాలూ కలిగిన ఆంధ్ర మహిళామణి ఏలుబడిలో త్రైలింగ రాజశ్రీ సుధా ప్రవర్షము కురియగలదు అంతేకాదు. చేజిక్కిన యాదవ రాజుని విడిచి పుచ్చి అపరాధ విత్తముగై కొని సంధి చేసుకొని ఇరుగు–పొరుగు రాజ్యములతో సాధ్యమైనంత స్నేహముతో ప్రవర్తించగలదు" అన్నారు. కనులు మూసుకుని తిక్కనగారు ఏదో దివ్యవాణి పలికించినట్లు.

శివదేవయ్యగారితో పాటు అక్కడున్న అందరి మొహాలూవిప్పారినాయి.

"ధన్యులం, మహాకవి! తమవంటి కారణ జన్ములు జాతికి చేసే సేవ అనుపమానం. మా మహారాణిని కాపాడండి. కవి బ్రహ్మలు

మరు తప్ప ఆమెకిప్పుడు ప్రాణం పోయగలవా రెవరు చెప్పండి." అన్నారు శివదేవయ్యగారు.

అక్కడున్న మిగతా వారంతాకూడా తిక్కనగారి వంక ప్రాధేయ పూర్వకంగా చూస్తున్నారు.

"సరే, కానివ్వండి. చూద్దాం, సకల శుభాస్పదమైన భారత భారతీ కృపా కటాక్షం ఆంధ్రసార్వభౌముల కళ్ళు తెరిపించవచ్చు. ఆమె కేర్పడిన తాత్కాలిక మనోనిర్వేదానికిదే ఉపాయం. స్వతస్సిద్ధంగా ధైర్యశాలిని, నిత్య సంయమన కృషిచేత మానసిక తపస్వినీ అయిన రుద్రమదేవికి భయం లేదు. బావగారూ!" అన్నారు తిక్కనగారు.

అప్పటికీ గురునాథుడు మహాభారత గ్రంథాన్ని తెచ్చి వ్యాస పీఠంలో ఉంచాడు. ఆనందవల్లి కృష్ణాజినం పరిచింది. పార్వతీదేవి రాణిగారి అరికాళ్ళకి పసుపు మర్దన చేస్తున్నది

"అసలు బాలింతరాలు భయంకర యుద్ధానికి వెళ్ళకూడదమ్మా అంటూ ఎంత చెప్పినా వినలేదమ్మా పిచ్చితల్లి!" అని రాజమాతలు కన్నీరు నిలిపారు. శీతలం కమ్ముతున్న ఆమెకి ఉష్ణం కలిగించాలనే ఆశతో రాజవైద్యులు ఏవో చికిత్సలు చేస్తున్నారు

పద్మాసనస్థితుడై ఆంధ్రజాతి తపఃఫలమైన వాడు తిక్కన సోమయాజి భీష్మ పర్వం ప్రారంభించారు. గీతా ఘట్టంలో అమృతం వాకలు కట్టినట్లైంది.



"పురుషుడు సెపి ననువాడును
పురుషుడు సెఱచునని పలుకు పురుషుండును న
య్యిరువురు నవివేకుల యు
పురుషుండు సెఱుపండు సెడడు భుజవీర్యనిధీ!"

రుద్రమదేవి నాడి ఎక్కడో ఉన్నట్లు కొట్టుకోసాగింది నాడి అందగానే రాజవైద్యుల గుండె బరువు దింపినట్లయింది

"ఫలముల యెడ బ్రహ్మార్పణ
కలన నుండగుచు కార్యకర్మము నడపన్
వలయున్ తత్త్వజ్ఞానము
తలకొనినన్ కర్మ శమము దానై కలుగున్"
చక్రవర్తిని ఆకృతిలో జీవకళ తోచింది
"క్రందుకొను సర్వధర్మ వికల్పములను
నెడల విడిచి దృఢంబుగనే నొకండ
శరణముగ నాశ్రయింపుము సకల దురిత
ములకు" దొలగింతు నిన్నుఁ బ్రమోదమొంత
మెల్లిమెల్లిగా కళ్ళు విప్పింది సామ్రాజ్ఞి
"అధిప! యోగీశ్వరేశ్వరుండైన కృష్ణు
డును ధనుర్ధరవర్యు డర్జునుడు నెచటను
నిలిచి రచ్చట విజయంబు నీతి
భూతి నిత్యంబులగు నిదినాడు

ఆనందంగా చూశారంతరూ తిక్కనగారితో సహా. శివదేవయ్యగారి వేపూ వేపూ, తిక్కనగారి సాభిప్రాయంగా, సభక్తికంగా చూసి నమస్కారం చేసింది మహారాణి రుద్రమదేవి

ఉభయ కవిమిత్రుడయిన తిక్కన సోమయాజి కంఠంతేనెసోనగా ఆంధ్రదేశానికినంత సంతసంగా ప్రవహిస్తున్నది

"క్షరణ రహితవృత్తీ! గ్రాహ్యభక్తి ప్రవృత్తీ!
కరణ గమనలీలా! గాఢకారుణ్యశీలా।
స్మరణ శుభదమూర్తీ। పద్య రశ్మి ప్రవర్తీ।
చరణ వినమదింద్రా। సంతతానంద సాంద్రా।"

—: సమాప్తం :—